# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 99 | హైదరాబాద్ | గురువారం 02-10-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

డిసెంబర్‌లో భారత్ పర్యటనకు రానున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

## నేటి భారతం

- ప్రజల మేలు కోసం పనిచేసిన ప్రభుత్వమే చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది.
- పరిపాలన అంటే అధికారాన్ని చూపడం కాదు, ప్రజలకు న్యాయం చేయడం.
- ప్రజల నమ్మకమే ప్రభుత్వానికి నిజమైన శక్తి
- ధర్మం, న్యాయం ఉన్నచోటే ప్రభుత్వానికి గౌరవం ఉంటుంది.
- ప్రజల కోసం ఏర్పడిన ప్రభుత్వం ప్రజలకే సేవ చేయాలి..
- కేవలం పాలించడమే కాకుండా పరిరక్షించాలి.
- సరైన పరిపాలన అంటే ప్రతి పౌరుడి హక్కును రక్షించగలగాలి..
- ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ పునాది ప్రజల అభిప్రాయం మాత్రమే..
- పాలనలో పారదర్శకత ఉన్నచోటే ప్రజల్లో విశ్వాసం ఉంటుంది.
- ప్రజల విన్నపాన్ని వినగల చెవులు లేని ప్రభుత్వం.. శక్తివంతమైనదిగా కాకుండా, మూగదిగా ఉంటుంది.
- ఒక్కటి గుర్తుపెట్టుకోవాలి..
  ప్రజలకు సేవ చేయడం ఒక బాధ్యత కాదు.. అది ప్రభుత్వానికి ఉన్న పవిత్ర కర్తవ్యము.

-కేసారం పెంటా రెడ్డి

## మన న్యాయస్థానాలలో గౌరవం, సమానత్వానికి సంక్షోభం ఏర్పడుతోంది..

### ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన వాస్తవాలు





(స్పెషల్ కరస్పాండెంట్)

హైదరాబాద్, అక్టోబర్ 01 (భారత శక్తి) : న్యాయవ్యవస్థ అనేది న్యాయ దేవత కొలువుండే ఆలయం.. ఇక్కడ సమానత్వం, న్యాయం, రాజ్యాంగ విలువలు కాపాడబడతాయి.. అయితే, ఇటీవలి కాలంలో మన కోర్టుల్లో ఒక కలవరపరిచే ధోరణి కనిపిస్తోంది.. న్యాయవ్యవస్థకు ప్రాణం లాంటి తరువాయి 12లో



12లో

## ఎవడబ్బ సొమ్మని వాడుతున్నారు..?

- ప్రభుత్వ ఎస్సెట్స్ అంటే అవి ప్రజలకు చెందుతాయి..
- జల్సాలు చేయడానికి అధికారాలను వినియోగిస్తారా..?
- ప్రజలు పన్నులు కడితే జీతాలు తీసుకుంటున్నారు..
- అవినీతికి మరిగి అధిక సంపాదన ఆర్జిస్తున్నారు..
- ప్రజలకు ఉపయోగపడతారనేగా మీకు ఉద్యోగాలిచ్చింది..?
- మీరు సేవ చేస్తారనుకుంటే.. పూర్తిగా సేవ్ చేస్తున్నారు..
- ఉద్యోగులపై నియంత్రణ లేకపోవడం ఒక మైనస్..
- ఉన్నతోద్యోగులు అయితే మరీ దుర్వినియోగం చేస్తున్నారు..
- అడిగేవారు లేరనే మీ ఆటలు సాగుతున్నాయి..
- కఠిన చట్టాలు ఏర్పాటు చేస్తే తప్ప ఉద్యోగుల్లో మార్పు రాదు..
- ప్రభుత్వ కార్యాలయాలు, వాహనాలు మీ సొంతం అనుకుంటున్నారు..
- అవినీతి ఉద్యోగులు, అధికారులపై పోరాటం సాగిస్తోంది
  " ఫోరం ఫార్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..



11లో

## యుద్ధాల్లో సాంకేతికత పెరిగింది..

### ఇది ఆందోళన కలిగించే అంశం

- రక్షణ రంగంలో పరిశోధన, అభివృద్ధి బలోపేతం కోసం వినూత్న వ్యవస్థను రూపొందిస్తామన్న కేంద్రమంత్రి
- సాంకేతికతను మనం కూడా అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్న కేంద్ర మంత్రి
- రక్షణ బడ్జెట్ ప్రతి సంవత్సరం పెరుగుతోందని వ్యాఖ్య

## వ్యక్తిత్వ వికాసంతోనే దేశ నిర్మాణం..

## అదే ఆర్ఎస్ఎస్ మార్గం

- ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
- వ్యక్తిత్వ వికాసం ద్వారా దేశ నిర్మాణానికి పాటుపడే సంస్థ అని కొనియాడిన ప్రధాని
- 'నేను' నుంచి 'మనం' వైపు నడిపించే స్ఫూర్తిదాయక సంస్థగా అభివర్ణన
- సంఘ్ పై ఎన్నో కుట్రలు జరిగినా ఎదుర్కొని నిలబడిందని వ్యాఖ్య
- వ్యక్తిత్వ నిర్మాణానికి శాఖలు పవిత్ర వేదికలని కితాబు




11లో

## 15 నెలల్లో 4,71,574 మందికి ఉద్యోగాలిచ్చాం: చంద్రబాబు

- విజయనగరం జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు
- సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామన్న సీఎం
- రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నామని వెల్లడి

హైదరాబాద్, 01 అక్టోబర్ (భారత శక్తి) : ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తమ ప్రభుత్వం ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని, మానవతా దృక్పథంతో సంక్షేమ పాలన అందిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా దత్తి గ్రామంలో నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి నెలా ఒక గ్రామానికి నేరుగా వచ్చి పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్నానని, అందులో భాగంగానే దత్తి గ్రామానికి వచ్చానని చంద్రబాబు తెలిపారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రంలో కేవలం రూ.500 మాత్రమే పింఛను ఇస్తున్నారని, కానీ ఏపీలో మాత్రం తాము అత్యధికంగా అందిస్తున్నామని పోల్చి చెప్పారు. రాష్ట్రంలో ప్రతి వంద మందిలో 13 మందికి పింఛను అందుతోందని, అందులో 59 శాతం మహిళలేనని వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన "సూపర్ సిక్స్" పథకాలను సూపర్ హిట్ తరువాయి 12లో



## పాకిస్థాన్‌పై ఆపరేషన్ ఎందుకు ఆపారు?

పాక్ పై ఆపరేషన్ ఎందుకు ఆగిపోయిందో అర్థం కావడం లేదన్న ఒవైసీ



11లో

## కరూర్ నగర్ తొక్కిసలాట ఘటన నటుడు విజయ్ కీలక నిర్ణయం

- రాష్ట్ర పర్యటనలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటన
- రాష్ట్రవ్యాప్త పర్యటనను రెండు వారాల పాటు వాయిదా వేస్తున్నట్లు వెల్లడి



11లో

# సంపాదకీయం

## ఐక్యరాజ్యసమితి పెద్దరికం ఏమైంది

ప్రపంచంలో అశాంతి పడగవిప్పి బుసలు కొడుతున్నది. గాజాలో రక్తపాతమైనా,- ఇజ్రాయి ల్-హమాస్‌ల పోరాటమైనా, ఇరాన్‌పై అమెరికా, -ఇజ్రాయిల్ దాడులైనా, భారత్‌లోని పహల్గాంలో పాక్ ఉగ్రవాదులు సాగించిన నరమేథమైనా, రష్యా-, ఉక్రెయిన్ దేశాల మధ్య సంవత్సరాల తరబడి కొనసాగుతున్న భీకర యుద్ధం ఇలా ఏదీ తీసుకున్నా ప్రపంచంలో అశాంతి పవనాలు వీచేలా చేస్తున్నాయి.అమెరికా అ ధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన లక్ష్య సాధన కోసం ప్రపంచ దేశాలపై అధిక సుంకాలు విధించి ట్రేడ్ వార్‌కు తెర తీశారు. నేపాల్ వంటి దేశాలు ప్రజాగ్రహజ్వాలల్లో చిక్కుకున్నాయి. గతంలో శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో ప్రజల తిరుగుబాటుతో ప్రభుత్వాలే పతనమయ్యాయి. ఈ దెబ్బకు ప్రపంచంలో పలు దేశాలు ఆర్ధికంగా చితికిపోయాయి. ఒక వైపు యుద్ధాలతో.. మ రో వైపు అగ్రరాజ్యాల ఆధిపత్య ధోరణులతో ప్రపంచ శాంతికి తీవ్ర విఘాతం కలు గుతున్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపుల పర్వం.. భారత్‌కు చైనాను దగ్గరయ్యేలా చేసింది. మూడు బలమైన దేశాలైన భారత్, రష్యా, చైనాలు ఏకమైతే అమెరికాకు దీర్ఘకాలంలో ఎదురయ్యే సమస్యల గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. బ్రిక్స్ దేశాల బలోపేతం ఏక ధృవ ప్రపంచ విచ్ఛిన్నానికి మార్గం సుగమం చేస్తుంది. ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌ల వల్ల ప్రపంచ వాణిజ్య రంగం అతలాకుతలం కావడమే కాకుండా ట్రేడ్ వార్ వల్ల వివిధ దేశాల మధ్య సం బంధాలు దెబ్బతింటున్నాయి. ఇటీవల ఖతార్‌పై ఇజ్రాయిల్ ఆకస్మికంగా వైమానిక దాడులు జరపడం ఆశ్చర్యం కలి గించింది. దీంతో వర్తమాన ప్రపంచం అశాంతికి నిలయంలా మారిపోయింది.ఈ పరిస్థితులను ఇలాగే వదిలేస్తే మూడో ప్రపంచ యుద్ధాన్ని ఏరికోరి ఆ హ్వానించడమే అవుతుంది. శాంతి భద్రతలు కరువైతే యుద్ధోన్మాదం విలయతాం డవం చేయక తప్పదు. ఎక్కడైతే శాంతి సుస్థిరతలకు భంగం వాటిల్లుతుందో, అక్క డ అభివృద్ధి కుంటుపడుతుంది. ఇప్పటి వరకు జరిగిన యుద్ధాలు, పలుదేశాల మధ్య సంఘర్షణలు ఈ విషయాన్ని స్ప ష్టంగా తెలియజేసున్నాయి. ప్రపంచంలోని ఇప్పటికీ చాలా దేశాల్లో ప్రజలు జీవించడానికి కనీస మౌలిక సదుపాయాలు లేవు. ఆకలి, దరిద్రం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అవినీతి వంటి పలు అంశాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా సామ్రాజ్య విస్తరణ కోసం వివిధ దేశాల మధ్య జరిగే యు ద్ధాల వలన ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇక భా రతదేశం కూడా అనేక దండయాత్రలకు గురైంది. స్వాతంత్ర్యానంతరం కూడా చై నా, పాకిస్తాన్ దేశాలతో భారతదేశం అనేక ఇబ్బందులకు గురికావడం చూస్తునే ఉన్నాం. భారతదేశం ప్ర పంచంలో అత్యధిక జనాభా గల ప్రజాస్వామ్య దేశం. అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన బాధ్యతాయుతమైన దేశం. ప్రపంచ దేశాలతో వి స్తృ తమైన వాణిజ్య సంబంధాలు కలిగి, 4.19 ట్రిలియన్ డాలర్లతో నాల్గవ బలమైన ఆర్థిక వ్యవస్థగా అవతరించిన భారత్‌కు ఇతర దేశాల సమస్యలను పరిష్కరించగల నేర్పు, ఓర్పు ఉన్నాయి. అం దుకే రష్యా, ఉక్రెయిన్ల మధ్య యుద్ధాన్ని నిలువరించడానికి భారత్ మధ్యవర్తిత్వం వహించాలని కొన్ని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. రష్యా చమురును కొనుగోలు చేసే దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉంది. అందువల్లే రష్యా-, ఉక్రెయిన్ల మధ్య యుద్ధ విరమణకు మన దేశం పూర్తి స్థాయిలో చొరవ తీసుకునే అవకాశం ఉండడం లేదు.రష్యా వద్ద భారత్ చమురు కొనుగోలు చేయడమే ఉక్రెయిన్-, రష్యాల మధ్య యుద్ధ విరమణ జరగకపోవడానికి కారణమని ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలు అర్థ రహితం. నోబెల్ శాంతి బహుమతి కోసం ఆరాటపడుతున్న రష్యా-, ఉక్రెయిన్ యుద్ధం విషయంలో మాత్రం ఏం చేయలేకపోతున్నారు. అయితే ఈ ఏడాది చి వర్లో లేదా వచ్చే ఏడాది ప్రథమార్థంలో ర ష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి చరమగీతం పా డే అవకాశముంది. ఇదే గనుక జరిగితే ప్ర పంచం ఒక గండం నుంచి బయటపడిన ట్లే. ఇక భారత్ భవిష్యత్తులో ప్రపంచంలో శాంతి స్థాపన విషయంలో కీలక భూమిక పోషించే అవకాశముంది. పాలస్తీనా విషయంలో భారత్ తన విదేశాంగ విధానం మార్చుకుని ఇజ్రాయిల్‌కు మద్దతు పలకడాన్ని పలు రాజకీయ పక్షాలు ఇప్పటి వ రకు విమర్శించాయి. అయితే గాజాపై ఇ జ్రాయిల్ జరుపుతున్న దాడులకు వ్యతిరేకంగా, పాలస్తీనాకు మద్దతుగా ఇటీవల ఐ క్యరాజ్య సమితిలో భారత్ ఓటు వేయడం గమనార్హం. భారత్ శాంతి కాముక దేశమ ని ఈ పరిణామం నిరూపించింది. ప్ర పంచ వ్యాప్తంగా భారత్‌కు పెరుగుతున్న ఆ దరణ దృష్ట్యా.. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు వీటో హక్కు దక్కాల్సిన అవసరముంది. ఐక్యరాజ్య సమితి ఆ విర్భావ సమయంలో 51 దేశాలకు సభ్యత్వముంటే ఇప్పుడా సంఖ్య 193కు పె రిగింది. భద్రతా మండలిలో 15 సభ్య దేశాలుంటే.. వీటిలో అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్‌లు శాశ్వత సభ్య దేశాలుగా అధికారం చెలాయిస్తుండడంతో ఐక్యరాజ్యసమితి ప్రేక్షక పాత్రలా మారిపోయింది. ప్రపంచంలో శాంతి స్థాపనే ధ్యేయంగా ఉ న్నత ఆశయాలతో ఏర్పడిన ఐరాస సంస్థ ఇలా నిస్తేజంగా మారడం ఘోరవైఫల్యం కింద లెక్కకట్టొచ్చు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన హసీనా ప్ర భుత్వాన్ని కూల్చినప్పుడు ప్రపంచ దేశాల ను శాసిస్తున్న పెద్దరికం ఎక్కడికి పోయింది? గాజా విషయంలో ఐక్యరాజ్యసమితి పాత్ర ఎంత? దశాబ్దాల తరబడి భా రత్ పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదంతో యుద్ధం చేస్తున్నా మౌనంగా ఉండడంపై ఐరాస సమాధానం చెప్పాల్సిందే. ప్రస్తుత ప్రపంచ పోకడలు అత్యంత ప్రమాదకరంగా తయారయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ సమస్యల పరిష్కారం విషయంలో భారత్‌కు తగిన ప్రాధాన్యత ఇ వ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న వి షయం తెలుసుకోవాలి.

# పెట్టుబడుల కోసం పరుగో... పరుగు

విశాఖపట్టణంఅక్టోబర్ 1 (భారత శక్తి):
విశాఖలో అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు జరగనుంది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించి ఏపీకి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే సీఎం చంద్రబాబు, నారా లోకేష్ బృందం సింగపూర్లో పర్యటించింది. అక్కడి పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించింది. అయితే తాజాగా విశాఖలో పెట్టుబడుల సదస్సుకు సంబంధించి ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్. మధ్యాహ్నం కి ఢిల్లీ చేరుకొని.. ఢిల్లీలో భారత పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. ఐటిసి మౌర్యలో జరిగే సిఐఐ పార్ట్నర్షిప్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. అక్కడే పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక విజ్ఞప్తి చేస్తారు. సీఐఐ ఆధ్వర్యంలో విశాఖలో జరగనున్న పెట్టుబడుల సదస్సుకు తరలిరావాలని కోరనున్నారు.విశాఖ పెట్టుబడుల సదస్సును ఏపీ ప్రభుత్వంప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ముందుగానే సన్నాహాలు ప్రారంభించింది. ఇప్పటికే సీఎం చంద్రబాబు బృందం సింగపూర్ లో పర్యటించి అక్కడి పారిశ్రామికవేత్తలతో సమావేశం అయింది. విశాఖలో జరిగే పెట్టుబడుల సదస్సుకు వస్తే ఏపీ ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సాహాలు అందిస్తామని చెప్పారు సీఎం చంద్రబాబు. అంతకుముందు లండన్ లో పర్యటించారు నారా లోకేష్. అలాగే దావోస్ పర్యటనకు కూడా వెళ్లారు. ఆ సమయంలో కూడా దిగ్గజ పారిశ్రామికవేత్తలతో సమావేశం అయ్యారు. వారితో ప్రత్యేక రోడ్డు షో నిర్వహించారు. వాటి ఫలితాలు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. విశాఖ సదస్సుతో భారీగా పెట్టుబడులు తేవాలన్నది ప్రభుత్వ ప్రణాళికగా తెలుస్తోంది.మరోవైపు ఏపీ మంత్రుల బృందం దక్షిణ కొరియాలో పర్యటించింది. విశాఖలో నిర్వహించనున్న పారిశ్రామిక పెట్టుబడుల సదస్సుకు తరలి రావాలని అక్కడి ప్రతినిధులను కోరారు మంత్రులు. మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి తో పాటు సీనియర్ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. దక్షిణ కొరియా రాజధాని సీయోల్ లో ఎల్జి కంపెనీ ప్రతినిధులతో మంత్రుల బృందం సమావేశం అయింది. మరోవైపు విద్యుత్తు వస్తువుల తయారీకి సంబంధించి ఎల్ ఎస్ గ్రూప్ కంపెనీ ప్రతినిధులతో కూడా సమావేశం అయింది. మెడికల్, స్మార్ట్ సూట్ తయారీలో అగ్రగామిగా ఉన్న సు ఆల్ సంస్థ చైర్మన్ చివోంగు లీతో కూడా సమావేశం అయ్యింది మంత్రుల బృందం. వారంతా విశాఖ పెట్టుబడుల సదస్సుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రుల బృందం చెబుతోంది. మొత్తానికైతే విశాఖలో పెట్టుబడుల సదస్సును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది ఏపీ ప్రభుత్వం. సీఎం చంద్రబాబు తో పాటు మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మరి ఈ పెట్టుబడుల సదస్సులో ఏ స్థాయిలో.. పరిశ్రమలు ఏర్పాటుకు దిగ్గజ పారిశ్రామికవేత్తలు ముందుకొస్తారో చూడాలి.

క్వాంటం కంప్యూటింగ్ అంతా రెడీ
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు .. రాష్ట్ర వృద్ధి లక్ష్యాలను, పెట్టుబడుల ఆకర్షణ విధానాలను ఢిల్లీ వేదికగా జరిగిన సదస్సులో పారిశ్రామిక లోకానికి వివరించారు. ఢిల్లీలో జరిగిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ పార్టనర్‌షిప్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు.. ఏపీలో ఉన్న పెట్టుబడి అవకాశాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ డాక్యుమెంటరీని సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన తర్వాత మాట్లాడారు. ఆదాయాన్ని సృష్టించడం ద్వారానే ప్రజలకు మెరుగైన సేవలను అందించగలమని పేర్కొన్న చంద్రబాబు.. తద్వారా పేదరికాన్ని సమూలంగా నిర్మూలించగలమని స్పష్టం చేశారు.2024-2025 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ 8.25 శాతం వృద్ధిరేటును సాధించిందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 15 నెలల్లోనే పలు కీలక విధానాలను తీసుకువచ్చిందని వెల్లడించారు. సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని తేల్చి చెప్పారు. ఏపీ ఇప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మారినట్లు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏడోసారి సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహించబోతున్నట్లు తెలిపిన చంద్రబాబు.. రాష్ట్రాలను ప్రమోట్ చేయడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి సీఐఐ ఒక శక్తిమంతమైన వేదిక అని వెల్లడించారు.భారత్ నుంచి దావోస్ వెళ్తున్న నాయకుల్లో తాను ముందుంటానని.. సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రపంచ పారిశ్రామికవేత్తలతో తాము సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. రాష్ట్రాల భాగస్వామ్యం లేకుండా భారత దేశ వృద్ధి సంపూర్ణం కాదని ఈ సందర్భంగా చంద్రబాబు తేల్చి చెప్పారు. స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 నినాదంతో తాము ముందుకెళు తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 2.47 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు తెలిపారు.
ఈ లక్ష్య సాధన కోసం 10 నిర్దిష్ట విధానాలను అనుసరిస్తున్నామని చెప్పారు.ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో కూడిన సమ్మిళిత వృద్ధిరేటు (పీ4 విధానాన్ని) విధానం అమలు చేస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. వెయ్యి కిలోమీటర్ల తీర ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న అతిపెద్ద బలమని.. రాష్ట్రంలో ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మరిన్ని ఎయిర్‌పోర్టులు నిర్మించాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఏపీని ఉత్తమమైన లాజిస్టిక్స్‌కు కేంద్రంగా మార్చే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. స్పేస్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ, డ్రోన్ సిటీ, ఏరో స్పేస్ సిటీ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. జనవరి నాటికి అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ ఏర్పాటు చేస్తామని.. 2 ఏళ్లలో రాష్ట్రంలోనే క్వాంటం కంప్యూటర్ల తయారీని చేపడతామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# మండలిలో బలం కోసం కసరత్తు

విజయవాడ, అక్టోబర్ 1 (భారత శక్తి):
ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలాన్ని కూడా తీసుకొని గట్టిగానే పోరాడుతోంది. ఏపీ శాసనసభలో ఆ పార్టీకి సంఖ్యా బలం తక్కువ. కానీ శాసనమండలి వేదికగా ప్రభుత్వ నిర్ణయాలను తప్పుపడుతోంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పావులు కదుపుతోంది. ముఖ్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులను అడ్డుకుంటుంది. ఈ క్రమంలో తాజాగా రాజకీయ హింసలో బలైన ఓ వ్యక్తి కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలనుకున్న కూటమి ప్రభుత్వానికి శాసనమండలిలో చుక్కెదురు అయ్యింది. ఆ బిల్లును శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంది. ఈ క్రమంలోనే కూటమి పునరాలోచనలో పడింది.2019లో వైసీపీఅధికారంలోకి వచ్చిన తర్వాత ఇదే పరిస్థితి ఎదురయింది. శాసనసభలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన బలం ఉంది. కానీ శాసనమండలిలో మాత్రం తెలుగుదేశం పార్టీ హవా కొనసాగింది. ఈ క్రమంలో మూడు రాజధానులకు సంబంధించిన బిల్లు శాసనమండలిలో ఆమోదానికి నోచుకోలేదు. టిడిపి ఎమ్మెల్సీలు అడ్డుకోవడంతో ఆ పరిస్థితి ఎదురయింది. దీనిని తీవ్ర అవమానంగా భావించారు అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి. ఏకంగా శాసనమండలి రద్దుకు శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారు. కేంద్ర ప్రభుత్వం వద్ద ఆ నిర్ణయం పెండింగ్లో ఉండిపోయింది. అయితే ఇప్పుడు అదే పరిస్థితి టిడిపి కూటమికి ఎదురు కావడంతో.. ఏం చేయాలన్న ఆలోచనలో ఉంది కూటమి ప్రభుత్వం.అయితే తాజాగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఏసురత్నం కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయ హింసలో చనిపోయిన వ్యక్తి కుమారుడికి ఉద్యోగం ఇవ్వడంలో తప్పు లేదని వ్యాఖ్యానించారు. దీంతో ఆయన విషయంలో చర్చ ప్రారంభం అయ్యింది. ఆయన పార్టీ మారే ఉద్దేశంతో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. ఎప్పుడైతే బిల్లుకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పావులు కదిపిందో.. అప్పుడే టిడిపి కూటమి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలను ఆకర్షించే ప్రయత్నం చేసిందని టాక్ వినిపిస్తోంది. ఈ క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఏసురత్నం ఈ తరహా వ్యాఖ్యలు చేయడం హాట్ టాపిక్ అవుతోంది. ఏసు రత్నం పోలీస్ శాఖలో పనిచేసేవారు. వడ్డెర కులానికి చెందిన ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి 2019లో పోటీ చేశారు
. ఓటమి చవి చూడడంతో జగన్మోహన్ రెడ్డి ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. అయితే తాజాగా మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో.. ఆయన మనసు మారినట్లు సమాచారం.వచ్చే శాసనసభ సమావేశాల నాటికి శాసనమండలిలో టిడిపి కూటమికి స్పష్టమైన ఆధిక్యత లభించేలా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్సీలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. మరికొందరు పదవీ విరమణ చేశారు. ఇంకొందరు కూటమితో టచ్ లో ఉన్నారు. దీంతో ఓ నలుగురు ఎమ్మెల్సీలను ఇటు వైపు లాక్కుంటే.. తప్పకుండా శాసనమండలి కూటమి చేతిలోకి రావడం ఖాయం. అయితే తాజాగా వైసీపీ ఎమ్మెల్సీ ఏసురత్నం వ్యాఖ్యలతో ఒకరు ఖాయమని తెలుస్తోంది. మిగతా ముగ్గురు ఎవరన్నది తేలాల్సి ఉంది

# కాంట్రావర్సీలకు అనంతపురం ఎమ్మెల్యే

అనంతపురం, అక్టోబర్ 1 (భారత శక్తి):
పెద్ద హీరో కొత్త సినిమా రిలీజవుతోందంటే చాలు? ఆ ఎమ్మెల్యేకి వణుకు పుడుతోందట. నా ప్రమేయం ఉన్నా? లేకున్నా? ఏదోఒక గొడవ కొంప మీదికి వస్తోందంటూ? తల పట్టుకుంటున్నారట ఆ శాసనసభ్యుడు. జూనియర్ ఎన్టీఆర్, పవన్‌కళ్యాణ్ మధ్య నలిగిపోతున్నారు. కూటమి ఎమ్మెల్యేలు కొందరు కేరాఫ్ కాంట్రవర్సీ అవుతున్నారు. ఇందులో సీనియర్స్, సూపర్ సీనియర్స్ సంగతి ఎలా ఉన్నా? కొత్తగా వచ్చిన వాళ్ళు కూడా ఆ విషయంలో తగ్గేదేలే అంటుండటంతో? పార్టీలకు తలనొప్పులు పెరుగుతున్నాయి. అలాంటి వాళ్ళలో ఫస్ట్‌లైన్‌లో ఉంటున్నారు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్. రాప్తాడు మండలం బండమీద పల్లికి చెందిన దగ్గుపాటి.. తెలుగుదేశం పార్టీలో మొదటి నుంచి కీలకంగా ఉండేవారు. ఎంపీపీగా గెలిచారు. అయినా? 2024 ఎన్నికలకు రెండు నెలల ముందు నుంచి మాత్రమే ఆయన పేరు బాగా తెరపైకి వచ్చింది. టీడీపీ అధిష్టానం అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వడం, కూటమి వేవ్‌లో గెలిచేయడం చకచకా జరిగిపోయాయి. అయితే.. గెలిచాకే దగ్గుపాటికి అసలైన సవాళ్ళు ఎదురవుతున్నాయి. మద్యం దుకాణాలు, సివిల్ మ్యాటర్లు, భూ పంచాయతీలు.. ఇలా ఒకటేంటి, అన్ని రకాల దందాల్లో ఆయన అనుచరులు తలదూర్చి దొరికిన కాడికి దోచుకుంటున్నారన్న ప్రచారం జోరుగా జరుగుతోంది.ఎమ్మెల్యే అనుచరులు పలువురి పేర్లు బయటికి వచ్చాయి కూడా. అదే సమయంలో ఎమ్మెల్యే మాట్లాడిన పలు ఆడియో కాల్స్ వెలుగు చూసి కలకలం రేపాయి. మరీ ముఖ్యంగా ఒకటైతే? కేవలం అనంతపురం నియోజకవర్గాన్నే కాకుండా మొత్తం రాష్ట్రాన్నే ఒక కుదుపు కుదిపేసింది. జూనియర్ ఎన్టీఆర్ నటించిన వార్ 2 సినిమా రిలీజ్ సందర్భంగా లీకైన ఆడియో కాల్ సంచలనం రేపింది. జూనియర్ ఎన్టీఆర్‌ని కించపరిచేలా ఒక అభిమానితో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడిన మాటలు బయటికి లీకై? రచ్చకు దారితీశాయి. వాటిని ఎమ్మెల్యే దగ్గుబాటి వెంటనే ఖండించినా? ఈ వివాదం మొత్తం రెండు రాష్ట్రాల్లో జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు కోపం తెప్పించింది. ఎన్టీఆర్ అభిమానులు దగ్గుపాటి ఇంటిని ముట్టడించారు. దాదాపు నెలరోజుల పాటు ఆ వివాదం నడిచింది. ఇక తాజాగా వివాదం డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు సంబంధించినది. పవన్ నటించిన ఓజీ సినిమా విషయంలో కూడా వివాదంలో ఇరుక్కున్నారు ఎమ్మెల్యే దగ్గుపాటి. ఆయన పేరుతో? హీరో పవన్‌కు ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలియజేయడమే కాకుండా ఈ సినిమా సూపర్ హిట్ అంటూ కామెంట్స్ వచ్చాయి. అదే



సందర్భంలో అనంతపురం నగరంలోని అన్ని థియేటర్లు మన అదుపులోనే ఉన్నాయి, అన్నింటిలోనూ పవన్ కళ్యాణ్ సినిమాలు ఆడించాలంటూ అదే ఎక్స్ ఖాతా నుంచి మెసేజ్‌లు వచ్చాయి. దాంతో మొన్నటికి మొన్న ఎన్టీఆర్ సినిమాను వ్యతిరేకించడం, ఇప్పుడు పవన్ కళ్యాణ్ సినిమాకు అనుకూలంగా కామెంట్స్ చేయడం ఏంటంటూ? వివాదం మొదలైంది.అందునా తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే కావడంతో దీనిపై రివర్స్ ట్రోలింగ్ మొదలైంది. ఈ విషయం తెలిసి ఒక్కసారిగా కంగుతిన్నారట ఎమ్మెల్యే. తనకు బీభత్సంమైన డ్యామేజ్ జరుగుతోందని గుర్తించి తానసలుఎలాంటి ట్వీట్స్ చేయలేదని క్లారిటీ ఇచ్చారు. వెంటనే ఆయన సోషల్ మీడియా టీం ఈ విషయం మీద పోలీసు కంప్లయింట్ కూడా ఇచ్చింది. ఎమ్మెల్యే పేరుతో ఎవరో.. ఫేక్ అకౌంట్ క్రియేట్ చేశారని, ఆ ఫేక్ నుంచే ఇలాంటి మెసేజ్‌లు పెడుతున్నారన్నది ఫిర్యాదు సారాంశం. ఇలాంటి మెసేజ్‌లను ఎవరూ నమ్మవద్దని ఆయన పదేపదే చెప్పుకోవాల్సి వచ్చింది. ఈ విషయంలో ఎమ్మెల్యే ప్రమేయం లేకున్నా ఆయన ఇరుక్కున్నారన్నది సన్నిహితుల మాట. ఇటు ఎన్టీఆర్ సినిమాకు నెగిటివ్, అటు పవన్ కళ్యాణ్ సినిమాకు పాజిటివ్ కామెంట్స్‌తో? అనంతపురం ఎమ్మెల్యేకు సినిమా గండం పొంచి ఉందన్న టాక్ వినిపిస్తోంది. ఆయన ప్రమేయం ఉందా లేదా అన్న చర్చను పక్కనపెడితే? పెద్ద హీరోల సినిమా విడుదలైన ప్రతిసారి ఆయనకు మాత్రం తిప్పలు తప్పడం లేదని చెప్పుకుంటున్నారు.

## పాపం సుజనా చౌదరి

విజయవాడ, అక్టోబర్ 1 (భారత శక్తి):
విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే సుజనా చౌదరి హ్యాపీగా లేరని తెలుస్తుంది. ఒకప్పుడు తెలుగుదేశం పార్టీలో



టిక్కెట్లను ఇప్పించిన వ్యక్తి ఇప్పుడు బీజేపీలో టిక్కెట్ కోసం అడుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ఎన్నికల్లో విజయవాడ పార్లమెంటు స్థానాన్ని సుజనా చౌదరి ఆశించారు. కానీ తెలుగుదేశం పార్టీకి పొత్తులో భాగంగా వెళ్లింది. మరొకస్థానమయినా కేటాయిస్తారనుకున్నారు. కానీ చివరకు బీజేపీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి సుజనా చౌదరిని పరిమితం చేసింది. రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన సుజనా చౌదరి ఇప్పుడు కేవలం పశ్చిమ నియోజకవర్గానికే లిమిట్ కావాల్సివచ్చింది. పార్టీ అధ్యక్ష పదవిని ఆశించినప్పటికీ అది మాధవ్ కు దక్కడంతో ఆయన హతాశు లయ్యారు.ఇక బీజేపీ నుంచి రాష్ట్ర మంత్రివర్గంలో తనకు చోటు దక్కుతుందని భావించినప్పటికీ అది కూడా చివరకు దక్కలేదు. నామమాత్రపు ఎమ్మెల్యేగానే ఆయన మిగిలిపోవాల్సి వచ్చింది. గెలిచారు కాబట్టి విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో అడపా దడపా పర్యటిస్తున్న సుజనా చౌదరి ఎక్కువ సమయాన్ని హైదరాబాద్ లోనే గడుపుతున్నారని అంటున్నారు. ఆయన ఢిల్లీ ప్రయాణాలు కూడా పెద్దగా చేయడం లేదు. ఒకనాడు ఢిల్లీలో బీజేపీ పెద్దల వద్ద దగ్గరగా మసిలిన సుజనా చౌదరి నేడు పశ్చిమ నియోజకవర్గంలోని బీజేపీ ద్వితీయ శ్రేణి నేతలతో ముచ్చటించుకోవాల్సి వస్తుంది. ఇది ఆయనలోని అసహనం బయటకు అప్పుడప్పుడు కనిపిస్తుంది. బీజేపీపై ఆగ్రహమా? కూటమి ప్రభుత్వంపై కోపమా? అన్నది తెలియదు కానీ మొత్తం మీద ఆయన అసంతృప్తిలో ఉన్నారు. ఇటీవల ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి కూటమి ప్రభుత్వంపై సంచలన కామెంట్స్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదిహేడు నెలలు గడుస్తున్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వ పాలనలానే నడుస్తుందని అన్నారు. అమరావతి రైతుల సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదిహేడు నెలలవుతున్నా వారి సమస్యలను పరిష్కరించలేదన్నారు. రుషికొండ ప్యాలెస్ నిర్మాణంపై గతంలో విపక్షంలో ఉన్నప్పుడు అనేక విమర్శలు చేశామని, అయితే అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలవుతున్నప్పటికీ దానిపై ఇంతవరకూ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇలా సుజనా చౌదరి తమ అక్కసును ఇలా వెళ్లగక్కుతున్నారని అంటున్నారు. మరి సుజనా చౌదరి ఆంతర్యమేంటో తెలియదు కానీ మొత్తం మీద ఆయన కొంత అసహనంగానే ఉన్నట్లు కనిపిస్తుంది.

## దక్షిణ కొరియాలో నాలుగో రోజు కొనసాగుతున్న మంత్రి నారాయణ పర్యటన

సీయోల్ అక్టోబర్ 1 (భారత శక్తి):
స్మార్ట్ సిటీల నిర్మాణం అధ్యయనం,రాష్ట్రానికి పెట్టుబడుల సాధన కోసం దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న మంత్రి నారాయణ పర్యటన నాలుగో రోజు కొనసాగింది. సియోల్ సమీపంలో జరుగుతున్న స్మార్ట్ లైఫ్ వీక్ ఎక్స్ పో 2025 ను మంత్రి నారాయణ,సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు సందర్శించారు. వరల్డ్ స్మార్ట్ సిటీస్ ఆర్గనైజేషన్,సియోల్ మెట్రోపాలిటన్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరుగుతున్న ఎక్స్ పో నీ సందర్శించారు. ఫ్యూచర్ సిటీస్ లో ఎఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)థీమ్ తో ఎక్స్ పో జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా 200 నగరాల నుంచి 300 ప్రముఖ కంపెనీలు,60,000 మంది హాజరు అవుతున్నారు.

# సమ్మె బాటలో వైద్య ఉద్యోగులు

ఏలూరు, అక్టోబర్ 1 (భారత శక్తి): ,
ఏపీలో వైద్య సేవలు నిలిచిపోనున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ సేవలు నిలిపివేతకు పిలుపునిచ్చింది ఆంధ్ర ప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు సమ్మెబాట పట్టేందుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగా ఈరోజు నుంచి పీహెచ్సీలలో ఓపి సేవలో నిలిపివేస్తామని ప్రకటించారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే దశలవారీగా ఇతర సేవలను సైతం నిలిపివేస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడే అవకాశం ఉంది. ప్రధానంగా గిరిజన, మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యులు సేవలు నిలిపివేస్తే ఇబ్బందికర పరిస్థితులు తప్పవు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న వైద్యులు గత కొద్దిరోజులుగా కోరుతూ వచ్చారు. జీవో 99 ద్వారా తగ్గించిన ఇన్ సర్వీస్ పీజీ కోటాను తిరిగి ఇవ్వాలని, ప్రమోషన్లు కల్పించాలని, 104 సంచార చికిత్స అలవెన్సులు, నేషనల్ ఇంక్రిమెంట్లు, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి 50 శాతం ప్రాథమిక వేతనాన్ని గిరిజన భత్యంగా ఇవ్వాలని డాక్టర్ల సంఘం డిమాండ్ చేస్తూ వస్తోంది. అయితే ఈ డిమాండ్లతోనే ఇప్పటికే వైద్య శిబిరాలతో పాటు సంచార సేవలను సైతం బహిష్కరించారు. ప్రభుత్వం తమ డిమాండ్లకు స్పందించకపోతే జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, దీక్షలు చేపడతామంటున్నారు. అక్టోబర్ మూడున విజయవాడలో రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్సీ వైద్యులతో పెద్ద నిరసన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆ రోజు నుంచి నిరవధిక దీక్షలు కూడా మొదలు పెట్టనున్నారు. అయితే ఇప్పటికే శాఖా పరమైన విధుల బహిష్కరణలో ఉన్నారు ప్రభుత్వ వైద్యులు పీహెచ్సీలకు ఆన్లైన్లో నివేదికలు పంపడం ఇప్పటికే మానేశారు. అధికారిక వాట్సాప్ గ్రూప్ లను కూడా బహిష్కరించారు. వైద్య శిబిరాలతో పాటు సంచార సేవలకు దూరంగా ఉంటున్నారు. ఈ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కు ఇప్పటికే అందించారు ప్రభుత్వ ఆసుపత్రుల డాక్టర్ల సంఘం ప్రతినిధులు. అయితే అత్యవసర విభాగం కావడంతో ఏపీ ప్రభుత్వం కూడా అప్రమత్తం అయ్యింది. ఎట్టి పరిస్థితుల్లో సమ్మెకు వెళ్లేందుకు



వీలులేదని? అవసరం అనుకుంటే ఏస్మా ప్రయోగానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం సంకేతాలు ఇస్తోంది. ఏపీ సివిల్ సర్వీసెస్ నియమావళి, అత్యవసర సేవల నిర్వహణ చట్టం ప్రకారం సమ్మెలు, సమ్మె నోటీసులు ఇవ్వడం నిషేధం. అత్యవసరమైన వైద్య సేవలకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే అది సర్వీసు నియమావళిని ఉల్లంఘించినట్లు అవుతుంది. ఎస్మా ప్రకారం అది శిక్షించదగ్గ నేరం కూడా. అందుకే ఏపీ ప్రభుత్వం సీరియస్ గా ఉన్నట్లు సమాచారం. ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతూనే.. ఎస్మా ప్రయోగానికి సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు పంపుతోంది. ప్రస్తుతం వర్షాలు పడుతున్న దృష్ట్యా రోగాలు ప్రబులుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో సమ్మె చేయడం తగదని ప్రభుత్వం చెబుతోంది. మరి దీనిపై ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు ఎలా స్పందిస్తారో చూడాలి.

## శిద్ధా రాఘవరావుకు రాని గ్రీన్ సిగ్నల్

ఒంగోలు, అక్టోబర్ 1 (భారత శక్తి):
మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు తెలుగుదేశం పార్టీలో చేరాలనుకున్నారు. అయితే ఆయన చేరికకు మాత్రం గ్రీన్ సిగ్నల్ దొరకలేదని తెలిసింది. అందుకే శిద్ధా రాఘవరావు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారని తెలిసింది. శిద్ధా రాఘవరావు ప్రస్తుతం తన వ్యాపారాలకే పరిమితమయ్యారు. ప్రకాశం జిల్లాలో గ్రానైట్ సంస్థల వ్యాపారాన్నినిర్వహిస్తూ ఆయన సమయాన్ని గడుపుతు న్నారు. అదే సమయంలో తన సామాజికవర్గానికి చెందిన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అంతే తప్ప రాజకీయ కార్యక్రమాల్లో మాత్రం ఆయన పాల్గొనడం లేదు. ఆయన ఆర్థికంగా స్థితిమంతుడు కావడంతో పాటు వైశ్య సామాజికవర్గానికి చెందిననేత కావడంతో సహజంగా రాజకీయ పార్టీలు ఆయన చేరికకు స్వాగతం చెబుతాయి. 2014 ఎన్నికల్లో శిద్ధా రాఘవరావు దర్శి నియోజకవర్గం నుంచి పోటీ చేసి టీడీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించారు.



తర్వాత చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. ఐదేళ్ల పాటు శిద్ధా రాఘవరావు మంత్రిగా ఉన్నారు. తర్వాత 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. తర్వాత శిద్ధారాఘవరావుకు చెందిన గ్రానైట్ కంపెనీలపై భారీగా జరిమానాలను విధించింది. దీంతో శిద్ధా రాఘవరావు కుటుంబం టీడీపీని వదిలి పెట్టి వైసీపీలో చేరింది. వైసీపీలో పెద్దగా యాక్టివ్ గా లేకపోయినప్పటికీ శిద్ధా రాఘవరావు వైసీపీలో చేరడంతో మొన్నటి ఎన్నికల్లో దర్శి నియోజకవర్గం నుంచి గొట్టిపాటి కుటుంబానికి చెందిన గొట్టిపాటి లక్ష్మికి చంద్రబాబు సీటు కేటాయించారు. దీంతో శిద్ధా రాఘవరావును ఒంగోలు పార్లమెంటుకు పోటీ చేయించాలని చూసినా కుదరలేదు. ఇక 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శిద్ధా రాఘవరావు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఒక దశలో చంద్రబాబు నాయుడును కలిసి తిరిగి టీడీపీలో చేరాలని భావించినా అందుకు కీలక నేత ఒకరు అంగీకరించలేదని సమాచారం. వైసీపీకి రాజీనామా చేశారు. శిద్ధా రాఘవరావు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. వైశ్య సామాజికవర్గం కార్యక్రమాల్లోనే ఆయన పాల్గొంటున్నారు. దీంతో పాటు కూటమి ప్రభుత్వంలోని నేతలతో ఆయన టచ్ లో ఉంటున్నారని, అయితే ఆయన చేరిక మాత్రం ఇప్పట్లో ఉండదని మాత్రంచెబుతున్నారు. మొత్తం మీదశిద్ధా రాఘవరావు ఇప్పుడు ఏ పార్టీలో లేకుండా ఆయన తన పని తాను చూసుకుంటున్నారు.

## ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం.. 60 మంది మృతి


ఫిలిప్పీన్స్‌లో 6.9 తీవ్రతతో భారీ భూకంపం
సెంట్రల్ సెబు ప్రావిన్స్‌లో భూవిలయం
ప్రమాదంలో 60 మంది మృతి, పదుల సంఖ్యలో క్షతగాత్రులు
మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన
భూకంప కేంద్రం బోగో నగరానికి సమీపంలో గుర్తింపు
సెంట్రల్ ఫిలిప్పీన్స్‌ను భారీ భూకంపం కుదిపేసింది. సెబు ప్రావిన్స్‌లో మంగళవారం రాత్రి సంభవించిన ఈ ప్రకృతి విలయానికి ఇప్పటివరకు 19 మంది ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు.
మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.
==========================

## బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలతో మంత్రి పొన్నం భేటీ

హైదరాబాద్ అక్టోబర్ 1 (భారత శక్తి):
మినిస్టర్ క్వార్టర్స్ లోని అధికార నివాసంలో మంత్రి పొ?న్నం ప్రభాకర్ బీసీ నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు,ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలుతదితర అంశాల పై చర్చ జరిగింది. న్యాయపరమైన అంశాల్లో రిజర్వేషన్ల పై ఎలా ముందుకు వెళ్ళాలో సమావేశంలో చర్చించారు. 8 వ తేది నాడు కోర్టులో రిజర్వేషన్ల అంశంపై గెలిచి తీరుతాము . 42 శాతం రిజర్వేషన్లుఇచ్చి ఎన్నికలకు వెళ్తున్నాం. తమిళనాడు లో తరహాలో ఇక్కడ కూడా రిజర్వేషన్లు అమలు అవుతాయని అన్నారు.
తమిళనాడు లో ఇటీవల కోర్టు తీర్పు గవర్నర్,రాష్ట్రపతి వద్ద ఉన్న పెండింగ్ బిల్లులు మూడు నెలలకు మించి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసుకోవచ్చని ఉందనీ కోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ లో కూడారిజర్వేషన్లు అమలు జరుగుతుందని అన్నారుజ ఈ సమావేశంలో పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, సీనియర్ నాయకులు వి. హనుమంతరావు, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్యాదవ్, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకరయ్య, ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ,మినరల్స్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ కామర్స్ సంస్థలపై నిఘా

ముంబై, అక్టోబర్ 1 (భారత శక్తి): ప్రభుత్వం ఇప్పుడు షాంపూ, పప్పులు, వెన్న, టూత్‌పేస్ట్ వంటి రోజువారీ వస్తువుల ధరలను నిశితంగా పరిశీలిస్తోంది. దీని కోసం, ఇ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లను కూడా పరిశీలన పరిధిలోకి తీసుకువచ్చారు. ఊూ రేట్లలో కోత ప్రయోజనం వినియోగదారులకు పూర్తిగా, సరిగ్గా చేరేలా చూడడమే దీని లక్ష్యం. ఇటీవల అమలు చేసిన ఊూ కోత తర్వాత, దాదాపు 99% రోజువారీ వస్తువుల ధరలు తగ్గాలి. కొన్ని ఇ-కామర్స్ కంపెనీలు వినియోగదారులకు పూర్తి ప్రయోజనం చేకూర్చడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. ప్రభుత్వం అనధికారికంగా అనేక ఇ-కామర్స్ ఆపరేటర్లకు ధరలలో




పారదర్శకతను తీసుకురావాలని హెచ్చరించింది. ఆర్థికమంత్రిత్వ శాఖ సెంట్రల్ ఊూ అధికారులను 54 సాధారణ వస్తువుల ధరలపై నెలవారీ నివేదికలను సమర్పించాలని ఆదేశించింది. మొదటి నివేదికను మంగళవారం నాటికి సెంట్రల్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ బోర్డ్)కి సమర్పించాల్సి ఉంది జాబితా చేసిన వస్తువులలో షాంపూ, టూత్‌పేస్ట్, వెన్న, టొమాటో కెచప్, జామ్, ఐస్‌క్రీం, ఏసీ , టీవీ, సిమెంట్, డయాగ్నస్టిక్ కిట్‌లు, థర్మామీటర్లు, క్రేయాన్‌లు మొదలైనవి ఉన్నాయి. అనేక ఇ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లు ఊూ కోత తర్వాత ధరలలోని వ్యత్యాసాలను “సాంకేతిక లోపం” అని పేర్కొన్నాయి. అదే సమయంలో కొన్ని కంపెనీలు స్వయంగా ముందుకు వచ్చి వినియోగదారులకు ధరలను తగ్గించడం ద్వారా ప్రయోజనం చేకూరుస్తున్నామని పేర్కొన్నాయి ఊూ కోత ప్రత్యక్ష ప్రయోజనం సామాన్య ప్రజలకు అందేలా ప్రభుత్వం “లాభార్జన వ్యతిరేక వ్యవస్థ” బలహీనంగా ఉన్నప్పటికీ ఇ-కామర్స్ ఆపరేటర్లపై నిఘా ఉంచింది. ప్రభుత్వం కఠినమైన నిఘా ప్రభావం వినియోగదారులపైనే కాకుండా ఇ-కామర్స్ కంపెనీల షేర్లు, పెట్టుబడిదారులపై కూడా అనుభవించవచ్చు. ఇ-కామర్స్ కంపెనీలపై పెరుగుతున్న నిఘా, ధరల కోత ఒత్తిడి వారి లాభాలను ప్రభావితం చేయవచ్చు. పెట్టుబడిదారులలో అనుమానం కారణంగా, స్టాక్‌లలో స్వల్పకాలిక హెచ్చుతగ్గులు ఉండవచ్చు. కంపెనీలు ధరలను పెంచలేకపోతే లేదా ఊూ కోత పూర్తి ప్రయోజనాన్ని వినియోగదారులకు అందించవలసి వస్తే, లాభాల మార్జిన్ తగ్గవచ్చు. దీర్ఘకాలంలో కంపెనీ ఆర్థిక ఆరోగ్యంపై ప్రభావం పడవచ్చు.

## దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఫ్లూ కేసులు

హైదరాబాద్ అక్టోబర్ 1 (భారత శక్తి):
దేశవ్యాప్తంగా ఊ3ఔ2 ఫ్లూ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. ఇది సాధారణ ఫ్లూ లాగా అనిపించే ఒక రకమైన ఇన్‌ఫ్లూఎంజా వైరస్, కానీ దాని లక్షణాలు ఎక్కువ కాలం ఉంటాయి. ఈ వైరస్ బారిన పడిన వ్యక్తులు అధిక జ్వరం, నిరంతర దగ్గు, గొంతు నొప్పి, శరీర నొప్పులు వంటి లక్షణాలను అనుభవిస్తారని వైద్యులు అంటున్నారు. ఇది చాలా సందర్భాలలో తగ్గినా, కొంతమంది వ్యక్తులకు ఇది మరింత ప్రమాదకరం కావచ్చని హెచ్చరిస్తున్నారు. ఎవరికి




ఎక్కువ ప్రమాదం ఉంటుందంటే ఫ్లూ బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ ఉన్నవారిని ప్రభావితం చేస్తుంది. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, ఉబ్బసం, మధుమేహం లేదా గుండె జబ్బులు వంటి ముందస్తు వైద్య పరిస్థితులు ఉన్నవారు ఈ వైరస్ బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. మీరు 5 సంవత్సరాల కంటే తక్కువ లేదా 65 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉంటే ప్రత్యేక శ్రద్ధ వహించండి. ఈ వ్యక్తులకు సాధారణం కంటే తక్కువ రోగనిరోధక శక్తి ఉంటుంది. కాబట్టి ఇన్ఫెక్షన్లు త్వరగా అభివృద్ధి చెందుతాయి. జాగ్రత్త పడకుంటే తీవ్రంగా మారవచ్చు. ఈ ఫ్లూ లక్షణాలు సాధారణ వైరల్ ఇన్ఫెక్షన్‌ల మాదిరిగానే ఉంటాయి. కానీ అవి ఎక్కువ కాలం ఉంటాయి. రోగులు అధిక జ్వరం, గొంతు నొప్పి, దగ్గు, తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, నిరంతర అలసట వంటి లక్షణాలు ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు. ను అనుభవిసరు. కొన్ని సందర్భాల్లో, వాంతులు, విరేచనాలు కూడా గమనించవచ్చు. జ్వరం కొనసాగితే, శ్వాస తీసుకోవడం కష్టమైతే, వెంటనే వైద్యుడిని సంప్రదించాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. ఫ్లూ నివారణకు పరిశుభ్రత, అప్రమత్తత అవసరమని నిపుణులు అంటున్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలలో క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం, మాస్క్ ధరించడం, అనారోగ్య వ్యక్తుల నుండి దూరం పాటించడం చాలా అవసరం. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు నోటిని కప్పుకోవడం, ఉపయోగించిన టిష్యూలను సరిగ్గా పారవేయడం వల్ల ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందకుండా నిరోధించవచ్చు. అంతేకాకుండా, సమతుల్య ఆహారం, తగినంత నిద్ర, తేలికపాటి వ్యాయామం రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ప్రతి సంవత్సరం, ముఖ్యంగా శీతాకాలం రాకముందే ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోవాలని వైద్యుల సూచిస్తున్నారు. ఒక వ్యక్తికి చాలా రోజులుగా అధిక జ్వరం, నిరంతర దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే, దానిని తేలికగా తీసుకోకండి.

## వీరభద్రస్వామి మిస్

విజయనగరంఅక్టోబర్ 1 (భారత శక్తి):
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత కొందరు నేతలు కనిపించడం మానేశారు. రాజకీయాల నుంచి తప్పుకున్నారా? లేక కావాలనే బయటకు రావడం లేదా? అన్నది అర్థం కావడం లేదు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో వైసీపీ నేతలు యాక్టివ్ గా లేరు. గతంలో మంత్రులుగా పదవులు వెలగబెట్టిన వారు, కీలకమైన పదవులు దక్కించుకున్న వారు సయితం గత పదిహేడు నెలలుగా ముఖం చాటేస్తున్నారు. జగన్ ఎన్ని సార్లు క్రియాశీలకంగా వ్యవహరించాలని చెబుతున్నప్పటికీ వారిలో మార్పు రావడం లేదు. వారిలో కోలగట్ల వీరభద్రస్వామి ఒకరు. విజయనగరం నియోజకర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి పేరు కూడా వినిపించడం లేదు. కనిపించడం లేదు. . 2019 ఎన్నికల్లో కోలగట్ల వీరభద్రస్వామి విజయనగరం నియోజకవర్గం నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. నాడు టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతి రాజు కుమార్తె ఆదితి గజపతి రాజును ఓడించి శాసనసభలోకి అడుగుపెట్టారు. అయితే కోలగట్ల వీరభద్రస్వామి వైశ్య సామాజికవర్గం కావడంతో జగన్ మంత్రివర్గంలో తనకు స్థానం దక్కుతుందని భావించారు. కానీ నాడు మాత్రం కోలగట్ల వీరభద్రస్వామికి జగన్ కేబినెట్ లో చోటు దక్కలేదు. నాడు విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ కు ఆ సామాజికవర్గం కోటాలో మంత్రి పదవి లభించింది. దీంతో ఆయన కొంత అసంతృప్తికి లోనయ్యారు. అయితే తర్వాత డిప్యూటీ స్పీకర్ పదవిని జగన్ కోలగట్ల వీరభద్రస్వామికి ఇచ్చి కొంత శాంతపర్చగలిగారు. 2024 ఎన్నికల్లో మరోసారి పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామి అదే ఆదితి గజపతి రాజుపై ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉంటున్నారు. కోలగట్ల వీరభద్రస్వామి దూరంగా ఉండటానికి జగన్ పై కోపం కన్నా అదే జిల్లాకు చెందిన బొత్స సత్యనారాయణపై కోపమేనని పార్టీ నేతలే అంటున్నారు. కోలగట్ల వీరభద్రస్వామి తనకు నాడు మంత్రి పదవి దక్కకపోవడానికి బొత్స సత్తిబాబు కారణమని బలంగా నమ్మారు. ఇప్పుడు కూడా జిల్లాలో ఆయనను ఎమ్మెల్సీని చేసి, శాసనమండలిలో లీడర్ ఆఫ్ అపోజిషన్ గా చేయడాన్ని జీర్ణించుకోలేని కోలగట్ల వీరభద్రస్వామి పార్టీతో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారని తెలిసింది. ఆయన వచ్చే ఎన్నికల్లోనూ పోటీ చేసేందుకు ఆసక్తి చూపడం లేదని, అందుకే పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారన్న కామెంట్స్ బలంగా వినిపిస్తున్నాయి.

# ఇండియాకు ఆసియా కప్ ఎప్పుడొస్తుంది..

ముంబై, అక్టోబర్ 1 (భారత శక్తి):
పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చీఫ్, ఆసియన్ క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధిపతి మోహ్సిన్ నఖ్వీ తీరు వివాదస్పదంగా మారుతోంది. ఆసియాకప్ ముగిసిన తర్వాత కప్పును ఇవ్వకుండా, తనతోనే అట్టి పెట్టుకుని విమర్శల పాలైన సంగతి తెలిసిందే. అలాగే విన్నర్లకు బహుకరించాల్సిన మెడల్స్ ను కూడా తన వెంటే తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. తాజాగా దీనిపై ఏసీసీ మీటింగ్ దుబాయ్ లో జరిగింది. ఈ సమావేశం వాడివేడిగా జరిగిందని తెలుస్తోంది. ఈ సమావేశానికి నఖ్వీతోపాటు బీసీసీఐ తరపున ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, మాజీ కోశాధికారి ఆశీష్ హాజరయ్యారు. ఇక ఈ మీటింగ్ లో ట్రోఫీకి సంబంధించిన విషయాలు తప్ప, మిగతా విషయాలపై నఖ్వీ మాట్లాడినట్లు తెలుస్తోంది. నిజానికి ఆసియాకప్ భారత్ గెలుపొందిన విషయాన్ని కూడా తను గుర్తించడానికి సిద్ధంగా లేదని అతని ప్రవర్తన బట్టి తెలుస్తోందని బోర్డు వర్గాలు తెలిపాయి. ఇక ఈ మీటింగ్ లో ఆసియాకప్పు ను తిరిగి ఏసీసీ ఆఫీస్ కు తీసుకు రావాలని, అలాగే విజేతలకు బహుకరించే మెడళ్లను కూడా ఇవ్వాలని నఖ్వీకి బీసీసీఐ అధికారులు చెప్పినట్లు సమాచారం. అక్కడి నుంచి ఇండియాకు సొంత ఖర్చులతో బోర్డ్, తీసుకొస్తుందని ప్రతిపాదించగా, దానికి నఖ్వీ ఏలాంటి సమాధానం ఇవ్వలేదని సమచారం. దీనిపై ఆగ్రహానికి గురైన బోర్డు.. త్వరలో దుబాయ్ లోనే జరిగే సమావేశంలో నఖ్వీపై ఐసీసీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది. నిబంధలను విరుద్ధంగా విజేతలకు బహుకరించే కప్పు, మెడల్స్ ను తన చిత్తానికి వచ్చినట్లు వెంట తీసుకెళ్లడంపై బోర్డు గుర్రుగా ఉంది. నిజానికి పీసీబీ చీఫ్ గా వ్యవహరిస్తున్న నఖ్వీ.. పాకిస్తాన్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నాడు. అయితే అతని చేతి నుంచి కప్పును అందుకునేందుకు భారత జట్టు సిద్దంగా లేదని కథనాలు వెలువడ్డాయి. నఖ్వీ కూడా ఇండియాకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పలుసార్లు పోస్టులు



పెట్టాడు. భారత వ్యతిరేక వైఖరిని బహాటంగానే ప్రదర్శించాడు. ఇక ఆదివారం ఫైనల్ మ్యాచ్ ముగిశాక గంట సేపటివరకు బహుమతి ప్రదానోత్సవం ఆలస్యమైంది. చివరకు ఇండియా కప్పు లేకుండానే స్వదేశానికి చేరుకుంది. ఇక నఖ్వీ వైఖరిని ఎండగట్టేందుకు తాజాగా అతనితో దుబాయ్ లో బోర్డు పెద్దలు సమావేశమైన లాజికల్ ఎండ్ కు సమావేశం రాలేదు. త్వరలోనే మరో మీటింగ్ ఈ విషయంలో జరగనుందని, సమస్యకు పరిష్కారం త్వరలోనే దక్కుతుందని తెలుస్తోంది. ఇక ఐసీసీ అనుమతితోనే ఈటోర్నీని నిర్వహించారు. తాజాగా నఖ్వీ ప్రవర్తనపై ఐసీసీ వద్దే తేల్చుకుంటామని బీసీసీఐ పట్టుదలగా ఉంది.
ఐసీసీ వద్దకు పంచాయితీఆసియా క్రికెట్ కౌన్సిల్ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ ఆసియా కప్ ట్రోఫీని తనతో తీసుకెళ్లిపోయి క్రికెట్ ప్రపంచాన్నిగ్భ్రాంతికి గురిచేశారు. ఫైనల్ గెలిచిన తర్వాత మొహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని అందుకోవడానికి టీమ్ ఇండియా నిరాకరించింది, ఆ తర్వాత ఆయన ట్రోఫీతో హోటల్‌కు వెళ్ళిపోయారు. నఖ్వీ పాకిస్తాన్ ప్రభుత్వంలో మంత్రి కూడా, ఇప్పుడు అతను పతకాలు, ట్రోఫీ తిరిగి ఇచ్చే విషయంపై స్పందించారు. విచిత్రమైన షరతు పెట్టారు. క్రికెట్‌బజ్ ప్రకారం, మొహ్సిన్ నఖ్వీ టోర్నమెంట్ నిర్వాహకులతో మాట్లాడుతూ, టీమ్ ఇండియా తమ ట్రోఫీ, పతకాలను తీసుకోవచ్చని, అయితే ఇది ఒక కార్యక్రమం నిర్వహించినప్పుడే సాధ్యమవుతుందని, అందులో అతను స్వయంగా భారత జట్టుకు పతకాలు, ట్రోఫీలను బహుకరిస్తానని చెప్పారు. భారత్, పాకిస్థాన్ మధ్య చెడిన సంబంధాల కారణంగా, అలాంటి కార్యక్రమం జరిగే అవకాశం దాదాపు లేదు. ఆసియా కప్ ఫైనల్ గెలిచిన తర్వాత టీమ్ ఇండియా చాలాసేపు మైదానంలోనే కూర్చుంది. గంటన్నర పాటు ఎదురుచూడాల్సి వచ్చింది, చివరకు చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ తన పట్టుదలతో ఆసియా కప్ ట్రోఫీని తీసుకుని మైదానం నుంచి బయటకు వెళ్ళిపోయారు ఃఅఅఎ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా అభ్యంతరం వ్యక్తం చేస్తూ మొహ్సిన్ నఖ్వీ పతకాలు, ట్రోఫీలను తనతో తీసుకెళ్ళడానికి ఎటువంటి అధికారం లేదని అన్నారు. దేవ్‌జిత్ సైకియా మాట్లాడుతూ,”పాకిస్తాన్ ప్రభుత్వంలో మంత్రి అయిన చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని అందుకోవడానికి మా జట్టు నిరాకరించింది. అందుకే మేము అతని చేతుల మీదుగా ట్రోఫీని తీసుకోము.
అంటే అతను ట్రోఫీస పతకాలను తనతో తీసుకెళ్తాడని కాదు. ఇది చాలా దురదృష్టకరం, క్రీడా స్ఫూర్తిని దెబ్బతీసేది.”ఆసియా కప్ ఫైనల్ తర్వాత, మొహ్సిన్ నఖ్వీ తనతోపాటు ఆసియా కప్ ట్రోఫీని తీసుకెళ్లారు. అది ఇప్పటికీ ఆయన వద్దనే ఉంది.
ఇప్పుడు ఆయన విధించే షరతులకు భారత్ అంగీకరించే అవకాశం లేనందున ఈ వివాదం మరికొన్ని రోజులు కొనసాగబోతోందని స్పష్టమవుతుది. ఆసియా కప్ ట్రోఫీ ఇప్పుడు భారతదేశానికి ఎలా తిరిగి వస్తుంది అంటే.. మోహ్సిన్ నఖ్వీ తన మొండితనాన్ని వదులుకుని, ఎటువంటి షరతులు లేకుండా భారత జట్టుకు ట్రోఫీ, పతకాలను అందజేస్తేనే. బీసీసీఐ అధికారికంగా, ఎఅఅకి ఫిర్యాదు చేస్తుంది

# కవిత రాజీనామా ఆమోదానికి బ్రేక్

హైదరాబాద్, అక్టోబర్ 1 (భారత శక్తి):
బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా కల్వకుంట్ల కవిత ఎన్నికయ్యారు. 2021లో ఆమె నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచారు. నాడు బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో నిజామాబాద్ పరిధిలోని స్థానిక సంస్థలలో ఎక్కువ భాగం బీఆర్ఎస్ చేతిలోనే ఉండేవి. అలాగే ఎమ్మెల్యేలు కూడా ఎక్కువ సంఖ్యలో నాడు నిజామాబాద్ జిల్లాలో ఉన్నారు. దీంతో నిజామాబాద్ జిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కల్వకుంట్ల కవిత సులువుగా ఎన్నికయ్యారు. పెద్దల సభలోకి అడుగు పెట్టారు. అయితే ఆమె ఇటీవల బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి తాను రాజీనామా చేస్తున్నట్లు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. కవిత పదవీకాలం మరో రెండేళ్ల సయం ఉంది. స్పీకర్ ఫార్మాట్ లోనే రాజీనామా ఆమోదించినప్పటికీ కల్వకుంట్ల కవిత రాజీనామా మాత్రం ఆమోదం పొందలేదు. అలాగే పార్టీ పరంగా వచ్చిన ఎమ్మెల్సీ పదవికి కూడా తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ తనను సస్పెండ్ చేయడంతో తనకు పార్టీ పరంగా వచ్చిన పదవులను కూడా వదులు కున్నారు. అయితే ఇంత వరకూ ఆమె రాజీనామా మాత్రం ఆమోదం పొందలేదు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఇప్పటికే కల్వకుంట్ల కవితతో ఫోన్ లో మాట్లాడి ఆవేశంతో నిర్ణయం తీసుకోవద్దని, ఆలోచించి రాజీనామాపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అయితే తాను ఆలోచించి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినట్లు కల్వకుంట్ల కవిత



చెప్పారని తెలిసింది. అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ రాజీనామాను మాత్రం శాసనమండలి ఛైర్మన్ ఇప్పటి వరకూ ఆమోదించలేదు. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదలయింది. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను సాధించిన తర్వాత మాత్రమే ఆమె రాజీనామా ఆమోదం పొందుతుందన్న కామెంట్స్ బీఆర్ఎస్ నేతలే అంటున్నారు. ఇప్పుడు రాజీనామా ఆమోదించినా స్థానిక సంస్థలలో బీఆర్ఎస్ బలంగా ఉందని, అందుకే లోకల్ బాడీస్ ఎన్నికల తర్వాత కవిత రాజీనామా ఆమోదించే అవకాశముందని చెబుతున్నారు. మరొకవైపు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సొంత జిల్లా కావడంతో ఈ ఎమ్మెల్సీ స్థానానికి బాగా ప్రాధాన్యత ఏర్పడింది. సెప్టెంబర్ 3వ తేదీన కల్వకుంట్ల కవిత రాజీనామా చేసినప్పటికీ ఇప్పటి వరకూ ఆమోదించలేదన్నది బీఆర్ఎస్ వర్గాల వాదన. మొత్తం మీద స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో ఇక ఫలితాల తర్వాత మాత్రమే రాజీనామా ఆమోదం పొందే అవకాశముందని అంటున్నారు. కవిత కూడా ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు

**లండన్ లో సంచలన వ్యాఖ్యలు**

భారత రాష్ట్ర సమితి బహిష్కృత నేత.. జాగృతి అధినాయకురాలు కలవకుండా కవిత ప్రస్తుతం లండన్ లో ఉన్నారు. బతుకమ్మ సంబరాలలో పాల్గొంటున్నారు. ఇటీవల కాలంలో ఆమె తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కేంద్ర బిందువుగా మారారు. రోజుకో తీరుగా సంచలన వ్యాఖ్యలు చేస్తూ తెలంగాణ రాజకీయాలను షేక్ చేస్తున్నారు. లండన్ లో జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కల్వకుంట్ల కవిత.. ఒకసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలు కోరుకుంటే తాను పార్టీ పెడతానని స్పష్టం చేశారు. పార్టీ ఏర్పాటు విషయంలో తనకంటూ కొన్ని లక్ష్యాలు ఉన్నాయని కవిత వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉంది కాబట్టి పార్టీ ఏర్పాటు విషయంలో ఆమె ఆచితూచి నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే కొంతమంది నేతలతో ఆమె సమాలోచనలు జరిపారు. ఇటీవల కాలంలో కూడా తన నివాసంలో ముఖ్య కార్యకర్తలతో ఆమె వరుసగా సమావేశాలు కూడా నిర్వహించారు. ఆ సమావేశాలలో ఆమె రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తారని ప్రచారం జరిగినప్పటికీ.. అది కార్యరూపం దాల్చలేదు.

భారత రాష్ట్ర సమితిపై కూడా కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 20 సంవత్సరాల పాటు తాను భారత రాష్ట్ర సమితిలో ఉన్నానని.. పార్టీ ఎదుగుదల కోసం తన కృషి చేశానని.. ఇప్పుడు ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేశారని కవిత వ్యాఖ్యానించారు. భారతీయ జనతా పార్టీ డిఎన్ఏ తనకు సరిపడదని.. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లే ఉద్దేశం లేదని.. రాజకీయ కార్య క్షేత్రాన్ని ప్రజలు కోరుకున్న విధంగా ఏర్పాటు చేస్తానని కవిత పేర్కొన్నారు. కల్వకుంట్ల కవిత రాజకీయ పార్టీ పెడతారని మొన్నటి దాకా ప్రచారం జరిగిన నేపథ్యంలో.. కవితే నేరుగా స్పష్టం చేయడంతో.. ఇప్పట్లో ఆమె పార్టీ పెట్టే అవకాశాలు లేవని తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ సంచలన వ్యాఖ్యలతో మరోసారి కల్వకుంట్ల కవిత తెలంగాణ రాజకీయాలలో సంచలనంగా మారారు.

# మనసంతా అమ్మతో.

.--- భవానీల రాకతో కొండపై పెరిగిన రద్దీ..
.--- పకడ్బందీ ఏర్పాట్లతో అందరికీ సంతృప్తికర దర్శనం
--- అధికార యంత్రాంగంపై భక్తుల ప్రశంసల వర్షంసాధారణ భక్తులకు తోడుగా

... భవాని మాలధారుల రాకతో ఇంద్రకీలాద్రి పర్వతం జై భవాని నినాదాలతో మార్మోగుతోంది. రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంతాల నుంచే అధికార యంత్రాంగం ఒక నిర్ణీత పద్ధతిలో ఎక్కడా భక్తుల రద్దీ కారణంగా ట్రాఫిక్ అవరోధాలు ఎదురుకాకుండా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, నగర పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వాహణాధికారి



శీనానాయక్ లు ఇస్తున్న ఆదేశాలతో చక్కని సమన్వయంతో భక్తులకు అవసరమైన ప్రాథమిక అవసరాలను తీర్చేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ అవకాశము కల్పించడంతో మహిళా భక్తుల సంఖ్య బాగా పెరిగింది. అమ్మ దర్శనం కోసం వచ్చే ప్రతి భక్తునికి సంతృప్తికర దర్శన భాగ్యం లభిస్తోంది. అధికార యంత్రాంగం నవరాత్రి ఉత్సవాలలో బాధ్యతలు నిర్వహిస్తున్న వివిధ శాఖలకు చెందిన ఇతర ప్రాంతాల అధికారులకు సైతం ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తోంది. సాధారణ భక్తుల సంతృప్తికర దర్శనమే లక్ష్యంగా అధికారులు నిర్ణయాలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చింది. భక్తులకు సురక్షిత తాగునీరు, బిస్కెట్ ప్యాకెట్ల పంపిణీ, చిన్నారులకు వేడిపాలు, అత్యవసర వైద్య సదుపాయం వంటి ప్రాథమిక సదుపాయాల కల్పనలో అధికారులు పలు జాగ్రత్తలు తీసుకున్నారు. భవానీల కోసం ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఎంతో భక్తితో మాలధారణ చేపట్టిన భవానీలు మాలధారణ విరమణ సమయంలో ఎక్కడా అసంతృప్తి తలెత్తకుండా అమ్మ దర్శనం కోసం ఇంద్రకీలాద్రి పర్వతానికి వచ్చిన ప్రతీ ఒక్కరు భక్తి భావంతో దర్శించుకునేందుకు ఎటువంటి అవాంతరాలు లేకుండా ఆధ్యాత్మిక అలౌకిక ఆనందానుభూతులతో దర్శన భాగ్యం కల్పించడమే లక్ష్యంగా వివిధ శాఖలు తీసుకుంటున్న చర్యలతో భక్తులు తమ సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

# పెరుమాళ్ళపల్లి లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

వెదురు కుప్పం,అక్టోబర్ 1 (భారత శక్తి):
చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు నియోజకవర్గం వెదురు కుప్పం మండలం పెరుమాళ్ళపల్లి గ్రామం నందు గత నెలలో చిన్న ముత్తయ్య అనే వ్యక్తి మరణించడంతో భార్య రెడ్డమ్మకు తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెదురు కుప్పం క్లస్టర్ ఇంచార్జి, మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, స్థానిక మాజీ ఎంపీటీసీ మోహన్ మురళి, సర్పంచ్ శశికళ ఆనంద రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు బోడిరెడ్డి.రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి దనంజుయులు, సోషల్ వెల్ఫేర్ గుణశేఖర్, టిడిపి నాయకులు శ్రీనివాసులు, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న పై నెట్టింట సెటైర్లు

హైదరాబాద్, అక్టోబర్ 1 (భారత శక్తి):
ఏపీలో పక్కన పెడితే.. తెలంగాణలో రాజకీయ పార్టీలు కొత్తవి పుట్టుకొస్తున్నాయి. గతంలో వివిధ పార్టీలు మారిన వారు.. ఆ పార్టీల ద్వారా పదవులు పొందిన వారు కొత్త రాజకీయ క్షేత్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అందులో తీన్మార్ మల్లన్న కూడా ఒకడు. గతంలో తీన్మార్ మల్లన్న బిజెపిలో చేరారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎమ్మెల్సీ అయ్యారు. కొంతకాలానికి ఆ పార్టీకి వ్యతిరేక స్వరం వినిపించడం మొదలుపెట్టారు. చివరికి ఆ పార్టీ నుంచి బయటికి వచ్చారు. ఇప్పుడు ఎమ్మెల్సీగా కొనసాగుతూనే కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేశారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలున్న నేపథ్యంలో తన పార్టీని విస్తరించే పనిని మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే జిల్లాల వారీగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. అధ్యక్షులను నియమిస్తున్నారు. తాజాగా తీన్మార్ మల్లన్న తన పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో భవిష్యత్తు విధివిధానాలను ప్రకటించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. సమావేశం ముగిసిన తర్వాత కార్యకర్తలతో తీన్మార్ మల్లన్న బయటికి వచ్చారు.. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో తీన్మార్ మల్లన్న పార్టీ కార్యకర్తలు రెచ్చిపోయి మాట్లాడారు. ఒక కార్యకర్త అయితే వీరావేశంలో మాటలు మాట్లాడారు. తీన్మార్ మల్లన్న దేశానికి ప్రధానమంత్రి అవుతాడని.. తెలంగాణ నుంచి ఆ అదృష్టాన్ని పొందిన వ్యక్తి అవుతాడని పేర్కొన్నారు. అంతేకాదు తీన్మార్ మల్లన్న నాయకత్వం వర్ధిల్లాలి అంటూ ఆ కార్యకర్త చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్నాయి. తీన్మార్ మల్లన్న పార్టీ కార్యకర్తలు చేసిన వ్యాఖ్యల పట్ల సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి..” మొదట్లో బిజెపిలో ఉన్నాడు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరాడు.



అందులో ఎమ్మెల్సీ అయ్యాడు. చివరికి పార్టీ తీసుకున్న విధానాలను ప్రశ్నించాడు. ఆ పార్టీ సస్పెండ్ చేసింది. పార్టీ నుంచి ఎమ్మెల్సీగా గెలిచి దానికి మాత్రం రాజీనామా చేయలేదు. ఇప్పుడేమో రాజకీయ పార్టీ పెట్టాడు. రాజకీయ పార్టీ పెట్టి కొద్ది రోజులు కూడా కాకముందే తన కార్యకర్తలకు భజనలు అలవాటు చేశాడు. తనని ఏకంగా ముఖ్యమంత్రిని చేసుకున్నాడు. ఇప్పుడు ప్రధానమంత్రిని కూడా చేసేసుకున్నాడు. ఇది మామూలు కామెడీ కాదు. వాస్తవానికి ఎవరైనా సున్నా నుంచి ఎదుగుతారు. తీన్మార్ మల్లన్న మాత్రం ఏకంగా ప్రధానమంత్రి పీఠానికి సూటి పెట్టాడని” నెటిజన్లు అంటున్నారు. ఓ సామాజిక వర్గం వారిని తీన్మార్ మల్లన్న తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ నేపథ్యంలోనే తీన్మార్ మల్లన్న ను ఉద్దేశించి ప్రధానమంత్రి అని వ్యాఖ్యలు చేసిన వీడియో బయటకి రావడంతో ఆ సామాజిక వర్గం వారు రెచ్చిపోతున్నారు. ఎమ్మెల్సీ గా ఉన్న వ్యక్తి ప్రధాన మంత్రి ఎలా అవుతాడంటూ ఎద్దేవా చేస్తున్నారు.

# మీరు ప్రయాణించే రోడ్డు గుంతలు పడిందా..? మొబైల్ తో ఆ సమస్య...

కరీంనగర్ అక్టోబర్ 1 (భారత శక్తి): కరీంనగర్ జిల్లాలో ఒక వ్యక్తి రోడ్డు బాగా లేదని అక్కడే కూర్చొని నిరసన తెలిపాడు. ఇందుకు సంబంధించిన వార్త వైరల్ గా మారింది. అయితే చాలామంది అతడు చేసేది చాలా కరెక్ట్ అని సోషల్ మీడియాలో కామెడీ చేశారు. అయితే అతడు చేసే పనిని మనం కూడా చేసే అవకాశం ఉంటుంది. కానీ నిరసన ద్వారా కాకుండా ప్రభుత్వానికి రోడ్డు సమస్య తెలియజేయవచ్చు. అయితే సాధారణంగా ఈ సమస్య ప్రభుత్వానికి తెలపాలంటే కాస్త ఇబ్బందులే ఉంటాయి. కానీ ఆన్లైన్లో దీని గురించి తెలిపితే ప్రభుత్వం వెంటనే స్పందించే అవకాశం ఉంటుంది. ప్రతిరోజు ప్రయాణం చేసే సమయంలో గుంతలు పడే రోడ్లు.. ధ్వంసం అయ్యే రోడ్లు చూస్తూ ఉంటాం. కానీ రోడ్డు బాగా ఉండాలని కోరుకుంటాం. అయితే ఈ సమస్యను ఇతరులు ప్రభుత్వానికి చెబితే బాగుండు అని కొందరు అనుకుంటే.. మరికొందరు మాత్రం రకరకాల మాధ్యమాల ద్వారా ఈ విషయాన్ని తెలియజేస్తూ ఉంటారు. అయితే ఇకనుంచి ఆన్లైన్లో దీనిని తెలిపి రోడ్డు సమస్యను పరిష్కరించుకోవచ్చు. అందుకోసం మొబైల్ లోని ఈ వెబ్సైట్ను ఓపెన్ చేయాల్సి ఉంటుంది. ఉనీనీఇశ్రీవ లోకి వెళ్లిన తర్వాత అఖ ఐతీజీఏ అని టైప్ చేయాలి. ఇలా డిస్లే అయినా మొదటి వెబ్సైట్లోకి వెళ్ళాలి. ఇక్కడ ఏ ప్రాంతంలో అయితే సమస్య ఉందో.. దాని గురించిన పూర్తి వివరాలు అందించాలి. అయితే అంతకుముందు రోడ్డు ఫోటోలు తీసుకోవాలి. ఇప్పుడు వెబ్సైట్లో పూర్తి వివరాలు అందించిన తర్వాత ఫోటో ఆప్షన్ వద్ద క్లిక్ చేసి రోడ్డు సమస్య ఉన్న ఫోటోలను అప్లోడ్ చేయాలి. ఇలా అప్లోడ్ చేసిన తర్వాత 15 లేదా 20 రోజుల్లో ఈ రోడ్డు సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉంటుంది. ఎందుకంటే ఈ రోడ్డు సమస్యలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కొందరిని నియమించింది. వీరికి ఇలాంటి ఫిర్యాదులు అందిన వెంటనే ఆయా గ్రామాలు లేదా పట్టణాల్లోకి సంబంధిత అధికారులు లేదా సిబ్బందిని పంపి రోడ్డు సమస్యను పరిష్కరిస్తారు. ఇది ప్రభుత్వానికి చెందిన వెబ్సైట్ కావడంతో ఇందులో పౌరులు ఎవరైనా ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే ఫిర్యాదు చేసే సమయంలో ఆ సమస్య నిజమైనదిగా ఉండాలి.



కొందరు తప్పుడు ఫోటోలు పెట్టి సమయాన్ని వృధా చేసే అవకాశం ఉంటుంది. అలా చేస్తే అప్లోడ్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. అందువల్ల రోడ్డుకు సంబంధించిన ఎలాంటి సమస్య ఎదుర్కొంటున్నా.. ఈ విధంగా పరిష్కరించుకోవచ్చు.

# డ్రంకెన్ డ్రైవ్ చేసేవాళ్లు టెర్రరిస్టులు హైదరాబాద్ సీపీ సజ్జనార్

హైదరాబాద్ అక్టోబర్ 1 (భారత శక్తి):
హైదరాబాద్ సీపీగా బాధ్య తలు తీసుకున్నాక సజ్జనార్ చేసిన కామెంట్స్ వైరలవుతున్నాయి. ‘డ్రంకెన్ డ్రైవ్ చేసేవాళ్లు టెర్రరిస్టులతో సమానం. తాగిన మత్తులో వాహనం నడిపి ఎంతమందిని చంపుతారో, వాళ్లే చనిపోతారో తెలియదు. అందుకే అలాంటి వాళ్లను వదిలే ప్రసక్తే లేదు’ అని సజ్జనార్ హెచ్చరించారు.
ఆయన సరిగ్గా మాట్లాడారని, డ్రంకెన్ డ్రైవ్ చేసేవాళ్లను వదలొద్దని నెటిజన్లు సపోర్ట్ చేస్తున్నారు.

# వంగాతో దీపికా చాలెంజ్...

హైదరాబాద్ అక్టోబర్ 1 (భారత శక్తి):
ఈమధ్య కాలం లో వివాదాలకు కేర్ ఆఫ్ అడ్రస్ గా మారిన హీరోయిన్స్ లో ఒకరు దీపికా పదుకొనే. పాన్ ఇండియా లెవెల్ లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ని సంపాదించుకున్న హీరోయిన్స్ లో ఒకరు ఈమె. ఇప్పటి వరకు మన సౌత్ లో కేవలం ప్రభాస్



‘కల్కి’ చిత్రంలో మాత్రమే నటించింది. అంతకు ముందు ఈమె దర్శకులను కానీ, నిర్మాతలను కానీ ఇబ్బంది పెట్టినట్టు ఎక్కడా మనం చూడలేదు. కానీ రీసెంట్ సమయం లో సందీప్ వంగ మరియు కల్కి నిర్మాతలు బహిరంగంగా ఈమెపై మండిపడుతూ , అసహనం తో ట్వీట్లు వేయడం అందరినీ షాక్ కి గురి చేస్తుంది. కారణం ఏమిటంటే ఈమె డిమాండ్స్ హద్దులు దాటుతుందని, రెమ్యూనరేషన్ కి బదులుగా లాభాల్లో భారీ వాటాలను అడుగుతుందని, పని గంటలు కూడా బాగా తగ్గిస్తేనే కాల్ షీట్స్ ఇస్తానని, ఇలా రకరకాల షరతులు పెట్టి ఆ రెండు సినిమా మేకర్స్ కి చిరాకు రప్పించడం వల్లే ఈమెని తప్పించారని టాక్. ఈ రెండు సంఘటనలు ప్రభాస్ సినిమాలకు మాత్రమే జరగడం గమనార్హం. దానిని బట్టీ చూస్తుంటే ప్రభాస్ కి దీపికా పదుకొనే కి పడట్లేదని స్పష్టంగా అర్థం అవుతుంది అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మరోపక్క ఈమె అల్లు అర్జున్, అట్లీ సినిమా నుండి కూడా తప్పుకుంది అంటూ వార్తలు వినిపిస్తున్నాయి. ఇదంతా పక్కన పెడితే రీసెంట్ గానే ఈమె సంస్థ 2000 సంవత్సరం నుండి 2025 వరకు ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టి అత్యంత ప్రేక్షాధారణ సంపాదించుకున్న నటీనటుల జాబితాలను ప్రకటిస్తూ అవార్డ్స్ ఈవెంట్ ఏర్పాటు చేసింది. ఈ జాబితా లో దీపికా నాల్గవ స్థానం లో నిల్చింది. మొదటి మూడు స్థానాల్లో షారుఖ్ ఖాన్, అమీర్ ఖాన్ మరియు హృతిక్ రోషన్ రోషన్ నిలిచారు. ఆ తర్వాతి స్థానాల్లో అమితాబ్ బచ్చన్, రణబీర్ కపూర్, సల్మాన్ ఖాన్, ఐశ్వర్య రాయ్ మరియు అనుష్క శర్మ వంటి వారు నిలిచారు. ఈ జాబితా లో తనకు దక్కిన స్థానం గురించి దీపికా పదుకొనే మాట్లాడుతూ, పరోక్షంగా ఇటీవల కాలం లో తనపై వచ్చిన ఆరోపణలకు కూడా సమాధానం చెప్పింది. ఆమె మాట్లాడుతూ ‘నా కెరీర్ లో ఇప్పటి వరకు ఎన్నో సక్సెస్ లు చూసాను, ఫెయిల్యూర్స్ చూసాను. ఈ ప్రయాణం లో నేను ఎన్నో గొప్ప విషయాలు నేర్చుకున్నాను. ఎంతో గొప్పవాళ్లను చూసాను, వెన్నుపోటు పొడిచేవాళ్ళను కూడా చూసాను. నా వెనుక చేరి మాట్లాడుకునే వాళ్ళు ఇప్పటికీ చాలా మంది ఉన్నారు. నా సక్సెస్ తోనే వాళ్లకు సమాధానం చెప్తూ వచ్చాను. ఈ ప్రయాణం లో నాకు తోడున్న అభిమానులకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు’ అంటూ చెప్పుకొచ్చింది దీపికా పదుకొనే.

# నరసరావుపేటలో అట్టహాసంగా సామాజిక పెన్షన్ల పంపిణీ

**ఇంటింటికి తిరిగి పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చదలవాడ**

నరసరావుపేట,అక్టోబర్ 1 (భారత శక్తి):
రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద అక్టోబర్ 1న ప్రారంభమైన సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నరసరావుపేట నియోజకవర్గంలో పండుగలా మారింది.



తెల్లవారుజాము నుంచే అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ తిరిగి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పెన్షన్లను స్వయంగా వెళ్లి లబ్ధిదారుల కు అందజేశారు. వాలంటీర్ల సహకారం లేకుండానే ఈ పంపిణీ విజయవంతంగా జరిగిందని, ఇది కూటమి ప్రభుత్వ నిబద్ధతకు మరో ఉదాహరణ అని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. నియోజకవర్గంలోని దాదాపు 6 వేల మంది ప్రయోజనాలకు మొత్తం రూ.5 కోట్ల పెన్షన్ మొత్తాన్ని పంపిణీ చేశామని ఎమ్మెల్యే అరవింద బాబు అన్నారు. ప్రతి ఒక్కరికీ నెలవారీ పెన్షన్లు ప్రజల జీవనోపాధికి బలమైన మద్దతుగా నిలుస్తున్నాయి అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 63.50 లక్షల మందికి రూ.2,745.50 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం అద్భుతంగా సాగుతోంది అని అన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో కూడా ఇదే ఉత్సాహంతో పంపిణీ పూర్తి చేశాం అని ఆయన అన్నారు. నరసరావుపేట పట్టణంలోని 28వ, 30వ వార్డుల్లోని ఏనుగు బజార్ ప్రాంతంలో ప్రత్యేకంగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, అక్కడి ప్రజల ఇళ్లకు వెళ్లి పెన్షన్ అందజేశారు. ప్రతి ఒక్కరినీ సంతోషపడేలా చేశాం అన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువుల ముఖాల్లో కనిపించిన సంతోషం మాకు అతి పెద్ద పురస్కారం అని అన్నారు. రాష్ట్రంలో వాలంటీర్ల సహాయం లేకుండా ఈ పంపిణీ విజయవంతమవడం మా ప్రభుత్వం సామర్థ్యానికి నిదర్శనం అని ఎమ్మెల్యే అరవింద్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, స్థానిక అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజలతో మమేకమై మాట్లాడుతూ పెన్షన్లు పంపిణీ చేశారు అని అన్నారు. ప్రజల సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది అని ఎమ్మెల్యే అన్నారు. ఈ పెన్షన్ పథకం ద్వారా మా నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి మద్దతు అందుతోంది అని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని అని ఎమ్మెల్యే అరవింద బాబు నరసరావుపేట నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు.

## కొత్తవారికే సీట్లా... రిజర్వేషన్లతో తారుమారైన లెక్కలు

నిజామాబాద్, అక్టోబర్ 1 (భారత శక్తి):
ప్పుడు ఎప్పుడు అని ఎదురు చూసిన ఎన్నికల సైరన్ మోగింది. స్థానికం సమరానికి సన్నద్ధం కావాలని ఎన్నికల కమిషన్ పిలుపునిచ్చింది. మరోవైపు పంచా యతీ పోరుకు పట్టుదలతో కృషి చేయాలని ఆయా పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. పంచాయతీ పోరుతో పల్లెల్లో ఎన్నికల వేడి కాస్తుంది. నువ్వా నేనా అనే రీతిలో పోటీదారులు సమరానికి సై అంటున్నారు.జెడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలను రెండు విడతలుగా నిర్వహించగా, పంచాయతీ ఎన్నికలను మూడు విడుత లగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లకు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర, జిల్లా అధికార యంత్రాంగం అప్పుడే ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. సమీక్షలు సమావేశాలతో కలెక్టర్ స్థాయిని మొదలుకొని డివిజన్ స్థాయి అధికారుల వరకు బిజీగా ఉన్నారు.ప్రభుత్వం ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్లు కొందరి ఆశావా వులకు నిరాశ మిగిల్చాయి. ఈ దఫా ఎన్నికల్లో తామే పోటీగా ఉంటామని భావించిన వారికి రిజర్వేషన్లు 'నో' అనే దిబ్బ కొట్టాయి. జనాభా గణాంకాల ప్రకారం ఈ దఫా ఎన్నికలు అనూహ్య రీతిలో రిజర్వేషన్లు మారిపోయాయి. ఈసారి స్థానికం ఎవరికి అనుకూలంగా ఉంటుందన్న చర్చ జోరుగా సాగుతోంది.మరోవైపు కమలనాథులు సైతం ప్రధాని మోదీ చరిష్మాతో అనుకూలమైన చోట్లల్ల పాగా వేసే ప్రయత్నం చేస్తు న్నారు. గత మాసం రోజుల నుండి ఎన్నికల నగరా కోసం వేచి చూసిన వాళ్లంతా ఎన్నికల కమిషన్ నుండి సైరన్ మోగడంతో పలు పార్టీలు తమ పంతాను మొదలుపెట్టాయి. రాష్ట్రవ్యాప్తంగా 565 జెడ్పిటిసి స్థానాలు, 5749 ఎంపీటీసీ స్థానాలకు గాను రెండు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి.

అలాగే మూడు విడతలుగా పంచాయతీ పోలింగ్ జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా పంచాయితీ ఎన్నికల్లో 81,65,894 మంది పురుష ఓటర్లు ఉండగా, 85 లక్షల 36,770 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మరో 54 ఇతరుల ఓటర్లు ఉండగా, ఒక కోటి 67 లక్షల 3165 మంది ఓటర్లు పంచాయతీ పూర్ లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరి అనుగ్రహాన్ని పొంది విజేతలుగా నిలిచేందుకు అభ్యర్థులు రంగంలోకి దిగనున్నారు.ఇప్పటికే కాంగ్రెస్ బి ఆర్ఎస్, బిజెపి, సిపిఐ సిపిఎం పార్టీలు సమర్థులైన అభ్యర్థుల వేటలో నిమగ్నులై ఉన్నారు. ఆయా ప్రాదేశిక నియోజకవర్గం స్థాయిలో ప్రజల్లో ఎవరెవరికి పట్టుంది అన్న విషయాలను పరిగణలో తీసుకొని వారిని అభ్యర్థు లుగా రంగంలోకి దింపేందుకు మూడు పార్టీల నేతలు సమాలోచనలు చేస్తున్నారు.ఇప్పటికే జెడ్పిటిసి ఎంపీటీసీ, ఎంపీపీ స్థానాలకు రిజర్వేషన్లను ఎన్నికల కమిషన్ ప్రకటించింది. దీంతోపాటు సర్పంచులకు వార్డు మెంబర్ల స్థానాలకు రిజర్వేషన్లు ప్రకటించింది. కామారెడ్డి జిల్లాలో బాన్సువాడ జెడ్పిటిసి స్థానం బీసీకి కేటాయించగా, భిక్కనూర్ బీసీకి కేటాయించారు. బిబిపేట్ బీసీ మహిళకు రాగ, బిచ్కుంద అన్ రిజరవ్డ్ కు, బీర్కూర్ అన్ రిజర్వుడుకు కేటాయించారు.దోమకొండ అన్ రిజరవ్డ్ మహిళకు దక్కగా, డోంగ్లి షెడ్యూల్ క్యాస్ట్ మహిళకు, గాంధారి బిసి మహిళకు కేటాయించారు. కామారెడ్డి ఎస్సి కి కేటాయించగా, లింగంపేట్ బీసీకి కేటాయించారు, మాచారెడ్డి ఎస్టి మహిళకు, మద్నూర్ బీసీ సామాజిక వర్గానికి దక్కింది. మహమ్మద్ నగర్ బీసీ మహిళకు వెళ్లగా, నాగిరెడ్డిపేట్ ఎస్సీ మహిళకు రిజర్వ్ అయింది. నస్రుల్లాబాద్ అన్ రిజర్వుడు గా కేటాయించగా, నిజాంసాగర్ బీసీ మహిళకు కేటాయించారు.పాల్వంచ బిసి వర్గానికి పోగా, పెద్ద కొడపుగల్ బీసీకి కేటాయించారు. పిట్లం అన్ రిజర్వుడు మహిళకు కేటాయించగా, రాజంపేట ఎస్టి కి దక్కింది. రామారెడ్డికి బీసీ మహిళకు, సదాశివ నగర్ అన్ రిజర్వుడు మహిళకు కేటాయించారు. తాడ్వాయి అన్ రిజర్వుడు కాగా, ఎల్లారెడ్డికి అన్ రిజర్వుడు మహిళలకు కేటాయించారు . జడ్పిటిసి స్థానాలతో పాటు మండల పరిషత్ అధ్యక్షుల స్థానాల రిజర్వేషన్లు కూడా ఎన్నికల కమిషన్ రిజర్వేషన్లను ప్రకటించింది.బాన్సువాడ బిక్కనూర్ బీసీలకు కేటాయించగా, బిబిపేట్ బీసీ మహిళకు బిచ్కుంద అన్ రిజరవ్డ్ మహిళకు, బీర్కూర్ అన్ రిజరవ్డ్ మహిళకు, దోమకొండ అన్ రిజర్వుడు , డోంగ్లి ఎస్సీ మహిళకు, గాంధారి బీసీకి కేటాయించారు. జుక్కల్ ఎస్సీకి, కామారెడ్డి ఎస్టీ మహిళలకు, లింగంపేట్ బీసీకి వర్గానికి దక్కింది. మాచారెడ్డి ఎస్ టి మహిళ కు రాగా, మద్నూర్ బీసీ కి వెళ్ళింది. మహమ్మద్ నగర్ బిసి మహిళకు, నాగిరెడ్డిపేట్ ఎస్సీకి కేటాయించారు.నస్రుల్లాబాద్ అన్ రిజరవ్డ్ మహిళకు, నిజాంసాగర్ బీసీ మహిళకు కేటాయించగా పాల్వంచ బిసి మహిళ ఖాతాలోకి వెళ్ళింది. పెద్ద కోడప్గల్ బిసి మహిళకు, పిట్లం అన్ రిజర్వ్ కేటాయించగా, రాజంపేట ఎస్టికి కేటాయించారు. రామారెడ్డికి బీసీ మహిళకు సదాశివ నగర్ కు అన్ రిజర్వుడు కేటాయించగా, తాడ్వాయికి అన్ రిజర్వ్ మహిళకు, ఎల్లారెడ్డి అన్ రిజర్వుడుకు కేటాయిస్తూ ఎన్నికల కమిషన్ రిజర్వేషన్లను ప్రకటించింది.గత ఏడాదికాలంగా చాలా చోట్లలో తామే జడ్పిటిసిలుగా, సర్పంచులుగా పోటీలో నిలిచి గెలుపొందుతామని ఆశతో ఆయా ప్రాంత ప్రజలను మచ్చిక చేసుకునేందుకు పెద్ద మొత్తంలో ఖర్చు చేసుకున్నారు. ఆలయాలకు విరాళాలు ఇవ్వడం, పర్వదినాల్లో అన్నదానాలు పెట్టడం, సమస్యల్లో ఉన్నవారికి ఆర్థికంగా ఆదుకోవడం, పెళ్లిళ్లకు ఇతరత్రా కార్యక్రమాలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ఆశావాహులు లక్షల్లో ఖర్చు చేసుకున్నారు.ప్రస్తుతం రిజర్వేషన్ల దెబ్బ వారి ఆలోచనలు బెడిసి కొట్టింది. సామాజిక వర్గం ప్రకారం పురుషులకు రిజర్వ్ అవుతాయి అనుకున్న స్థానాలు మహిళలకు రిజర్వు కావడం, బీసీ వర్గానికి దక్కుతాయనుకున్న ప్రాంతాలు ఎస్సీ కోటాలోకి వెళ్లిపోవడం, తమ వర్గానికి వస్తాయనుకున్న ప్రాదేశిక నియోజకవర్గం జనరల్ గా రిజర్వ్ కావడంతో వారి ఆశలపై రిజర్వేషన్లు నీళ్లు చల్లాయి. ఇంతకాలం తమ తమ స్థానాల్లో పట్టు సాధించి అభ్యర్థులుగా ఉంటాం అనుకున్న వారు పోటీకి దూరం కాగా బరిలోకి దిగేందుకు ముందుకు వస్తున్నాయి. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని వారు కూడా ఈసారి స్థానికం పంచాయతీ పోరులో అభ్యర్థులుగా నిలబడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రజా సమస్యలు, సామాజిక స్పృహ, ప్రగతి అనే అంశాలపై ఏమాత్రం అవగాహన లేని వారు కూడా రిజర్వేషన్ల ప్రక్రియతో ఎన్నికల్లో నిలబడే ఛాన్స్ వచ్చింది.వారిని బరిలోకి దింపి గెలిపించుకోవాలన్న తహతహ ప్రధాన పార్టీ నేతలు తొలగిసలాడుతోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల్లో స్థానిక సమరం ఈసారి వాడి వేడిగా సాగనుంది. రాజకీయం రసవత్తరంగా మారి పంచాయితీ పోరులో తాజా మాజీ ఎమ్మెల్యేలు సైతం తమ సత్తాను చాటుకునే పంతంతో ముందుకు కదులుతున్నారు. కామారెడ్డి గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి సురేందర్, నిజామాబాద్ రూరల్ బాజిరెడ్డి గోవర్ధన్, జుక్కల్ హనుమాన్ షిండే మాజీ ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాలలో పంచాయితీ ఎన్నికలను సవాల్ గా తీసుకుంటున్నారు.

# రెండు, మూడు రోజుల్లో జూబ్లీ నోటిఫికేషన్

హైదరాబాద్, అక్టోబర్ 1 (భారత శక్తి): జూబ్లిహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాను మంగళవారం ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ జా బితాలో 3,98,982 మంది ఓటర్లు ఉన్నారు, ఇందులో 2,07,367 మంది పురుషులు, 1,91,590 మంది మహిళలు , 25 ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఎన్నికల కమిషన్ ప్రకారం, తుది ఓటర్ల జాబితాలో గత ఎన్నికల కన్నా 1.61 శాతం ఎక్కువ మంది ఓటర్లు నమోదయ్యాయి. ఈ జాబితాలో ఉన్న 3,98,982 ఓటర్లు మొత్తం 407 పోలింగ్ స్టేషన్లలో ఓటు హక్కు వినియోగిచుకుంటారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో సగటుగా 980 ఓటర్లు ఉన్నారు. ఓటర్లు తమ పేర్లు తుది ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో సరిచూసుకోవడానికి ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ లేదా వోటర్ హెల్ప్‌లైన్ యాప్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జాబితాలో పేర్లను చేర్చడానికి లేదా తీసివేయడానికి ఫిర్యాదులు దాఖలు చేయడానికి, ఫారం-6 (పేరు చేర్చడానికి), ఫారం-8 (పేరు, చిరునామా మొదలైనవి సరిచేయడానికి) ఉపయోగించవచ్చని ఈసీ తెలిపింది. కేంద్ర ఎన్నికల సంఘం అక్టోబర్ నాలుగు, ఐదు తేదీల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేయనుంది. బీహార్ కు అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనున్నారు. అదే సమయంలో జూబ్లిహిల్స్ ఉపఎన్నిక షెడ్యూల్ కూడా విడుదల చేస్తారు. బీహార్ లోనూ మంగళవారమే పూర్తి స్థాయి ఓటర్ల జాబితాను విడుదల చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేసి ఓటర్ల జాబితాను పూర్తిగా సంస్కరించారు. దాదాపుగా అరవై లక్షలకుపైగా ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. మరణించిన వారు, శాశ్వతంగా వలసపోయిన వారు అలాగే.. రెండు ఓట్లు ఉన్న వారు ఇలా అందర్నీ తొలగించారు ఈ ప్రయత్నంపై వివాదం ఏర్పడినప్పటికీ అంతా పారదర్శకంగా చేస్తున్నామని ఈసీ ప్రకటించింది. అందుకే బీహార్ ఓటర్ల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు వస్తాయేమోనని ఈసీ నాలుగు రోజుల సమయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. భారత రాష్ట్ర సమితి సిట్టింగ్ సీటు కావడంతో ఎలాగైనా సీటును నెలబెట్టుకోవాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతపేరును ఖరారు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నేతలంతా విజయం కకోసం రంగంలోకి దిగారు. ఇక కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున తమ పాలనపై వ్యతిరేకత రాలేదని నిరూపించుకునేందుకు గెలిచి తీరాల్సిన పరిస్థితిలో పడింది. ఇప్పటికే కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో గెలిచారు. అందుకే జూబ్లిహిల్స్ లోనూ సానుభూతి పని చేయదని.. తమ పార్టీ పాలనను మెచ్చి తమకే ఓట్లు వేస్తారని అనుకుంటున్నారు. ఈ నియోజకవర్గంలో మజ్లిస్ కు మంచి బలం ఉంది. ఆ పార్టీ పోటీ చేస్తే ఓ రకంగా పోరు ఉటుంది. పోటీ చేయకపోతే.. ఎవరికి మద్దతు ఇస్తుందన్నదానిపై ఫలితం ఆధారపడి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

త్రిముఖ పోటీ

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలపైన ప్రధాన పార్టీలు కోటి ఆశలు పెట్టుకున్నాయి. గెలిచేది ఒక్క నియోజవర్గమైనప్పటికీ ఆ లెక్కలు అధికారపార్టీ పనితీరుకు కొలమానంగా మారబోతున్నాయనే వాదనల నేపథ్యంలో అటు అధికార పార్టీతోపాటు ఇటు సిట్టింగ్ సీటు కోసం ప్రతిపక్ష బిఆర్ఎస్, మేము కూడా తగ్గేదే లేదంటూ బిజెపిలు ఇలా త్రిముక పోరుతో జూబ్లీహిల్స్‌లో ఢీ అంటే ఢీ అంటున్నాయి. త్వరలో నోటిఫికేషన్ విడుదలకానున్న వేళ ఓటర్ల లెక్కలపై తాజాగా క్లారిటీ ఇచ్చేసింది ఎలక్షన్ కమిషన్. ఓటర్లు లెక్కలను బట్టే అభ్యర్థుల తలరాతలు మారిపోతాయి. ఇన్నాళ్లు ఊహాజనిత కథనాలు, కాకిలెక్కలు ఇక చాలంటూ తాజాగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఫైనల్ లెక్కలు విడుదల చేశారు ఎలక్షన్ కమిషన్ సీఈవో సుధర్శన్ రెడ్డి.అతి త్వరలో జరగబోయే జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికకు సంబంధించిన ఫైనల్ ఓటర్ల జాబితా ప్రకారం నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,99,000గా ఉందని ముఖ్య ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి ప్రకటించారు. జూలై 1, 2025ను అర్హత తేదీగా తీసుకుని సవరించిన జాబితాలో 2,07,382 మంది పురుషులు, 1,91,593 మంది మహిళలు, 25 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారని తెలిపారు

.లింగ నిష్పత్తి ప్రకారం ప్రతి వెయ్యి పురుషులకు 924 మహిళలుగా ఉండగా, ఈ జాబితాలో 6,106 మంది యువ ఓటర్లు (18?19 సంవత్సరాలు), 2,613 మంది వృద్ధులు (80 ఏళ్లుపైబడిన వారు), అలాగే 1,891 మంది వికలాంగులు ఉన్నారు. వీరిలో 519 మంది చూపు కోల్పోయిన వారు, 667 మంది కదలికల లోపం ఉన్న వారు, 311 మంది వినికిడి/మాట లోపం కలిగిన వారు ఉన్నారు. అంతేకాదు 722 మంది ఇతర కేటగిరీలకు చెందినవారు అండగా , విదేశీ ఓటర్లు 95 మంది ఉన్నారు.ఇటీవల సెప్టెంబర్ 2న విడుదలైన ప్రాథమిక జాబితాలో 3,92,669 ఓటర్లు ఉన్నారు. నిరంతర సవరణల తరువాత 6,976 మంది కొత్తగా చేర్చారు, 663 మందిని తొలగించారు

. దీంతో మొత్తం సంఖ్య 3,98,982కి చేరింది. సేవా ఓటర్లను కలుపుకుని తుది సంఖ్య 3,99,000 గా తేలింది. ఓటర్ల సంఖ్య ఆధారంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉపఎన్నిక నిర్వహణకు 139 కేంద్రాల్లో 407 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

# స్థానిక సమరానికి పార్టీలు రెడీ




హైదరాబాద్, అక్టోబర్ 1 (భారత శక్తి):
స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో గ్రామాల్లో రాజకీయాలు వేడె క్కాయి. పల్లెల్లో పట్టు సాధించుకునేందుకు రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. మెజార్టీ సీట్లు సాధించుకోవడమే లక్ష్యంగా ఎత్తుగడలతో ముందుకు సాగనున్నాయి. మొదటగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలు జరగనుండటంతో నెలన్నర పాటు గ్రామా ల్లో ఎన్నికల వాతావరణం కనిపించనుంది.ఆ తర్వాత మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు కూడా నిర్వహించే అవకాశం ఉంది. దీంతో రాజకీయ పార్టీలన్నీ విమర్శలు, ప్రతి విమర్శలకు కత్తులునూరుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీకి కొంత మేర కలసివ స్తాయి. చేసిన అభివృద్ధి, సంక్షేమంతో పాటు భవిష్యత్‌లో చేయాల్సిన పనులు చెప్పుకోవడానికి అధికార పక్షానికి అవకాశం ఉం టుంది. ఇక ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ వైఫల్యాలు, అమలుకాని ఎన్నికల హామీలపై ప్ర భుత్వాన్ని ప్రశ్నిస్తూ ఇరుకునపెట్టే ప్రయత్నం చేస్తుంటాయి. అధికార కాంగ్రెస్ పార్టీ, స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు పటిష్టమైన ప్రణాళికలు రచిస్తున్నది. ఒక వైపు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతానికి చర్యలు తీసుకుంటూనే మరో వైపు బీఆర్ఎస్, బీజేపీపైన విమర్శల జోరు పెంచు తోంది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాళేశ్వరం, ఫార్ములా ఈ కారు రేసులో అవినీతి జరిగిందని, విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. బీఆర్ఎస్ హయాంలో రూ. లక్ష కోట్లకు పైగా అవినీతి జరిగిందని విమర్శలతో పాటు బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చాక అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రచారాస్త్రాలుగా మల్చుకోవాలని భావిస్తున్నది. ప్రధానంగా రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్న వరికి రూ. 500 బోనస్ , ధరణి స్థానంలో భూమాత పోర్టల్ తీసుకురావడం వంటి అంశాలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రభావం చూపుతాయని అధికార కాంగ్రెస్ పార్టీ అం చనా వేస్తున్నది.దీంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత గృహవిద్యుత్, రూ. 500 లకే గ్యాస్, రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ వంటి అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించింది. అంతేకాకుండా గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన, ఫోర్త్ సిటీకి ఫౌండేషన్, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య అభివృద్ధి, మూసీ నదీ ప్రక్షాళన, ఇం టిగ్రేటెడ్ స్కూల్స్ వంటి కార్యక్రమాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్తామని కాంగ్రెస్ నేత లు చెబుతున్నారు.ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని కూడా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయిం చారు. అయితే యూరియా సమస్యపై క్షేత్రస్థాయిలో కొంతమేర వ్యతిరేకత వచ్చినప్ప టికి.. కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు నిర్వహించి యూరియా సమస్యను చాలా వరకు పరిష్కరించినట్టు భావిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కూడా పార్టీ శ్రేణులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూనే ఉంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా సమస్యలపై నిరంతరం క్షేత్రస్థాయిలో ఉంటూ పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం చేస్తోంది. బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక .. ఆ తర్వాత వచ్చిన పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటు గెలుచుకోకపోవడంతో కొంతకాలం స్తబ్దతగా ఉన్నప్పటికి.. ఇప్పుడు ప్రభు త్వంపై విమర్శలు జోరు పెంచింది.ప్రభు త్వం తీసుకొచ్చిన హైడ్రాతో పేదల బతుకులు ఆగమైనాయని, యూరియా కొరతను తీర్చడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని క్షేత్ర స్థాయిలో ఆందోళలను చేపడుతూ పార్టీలో మరింత కదలిక తీసుకొచ్చే ప్రయ త్నం చేస్తున్నారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గజ్వేల్‌లోని తన వ్యవసాయ క్షేత్రం నుంచే పార్టీ శ్రేణులను ఎన్నిక లకు సన్నద్ధం చేస్తున్నారు.ఇక కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పార్టీ ముఖ్య నేతలు నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తు న్నారు. తద్వారా పార్టీ శ్రేణులను పనిలో పెడుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయడంలో ప్రభుత్వం విఫలమైందని 'బాకీ కార్డు' పేరుతో వినూత్న కార్యక్ర మాన్ని బీఆర్ఎస్ చేపట్టింది. యూరియా కొరతతో రైతులు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అది తమకు స్థానిక సం స్థల ఎన్నికల్లో కలిసి వస్తుందనే అభిప్రాయం తో గులాబీ నేతలున్నారు. లోకల్‌బాడీ ఎన్నికల్లో ఈసారి సత్తా చాటాలని కమల దళం ఉవ్విళ్లూరుతోంది. ఎన్నికల హామీలు నేరవేర్చడం, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా బీజేపీనే అంటూ ఆ పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు. గ్రామాల్లో యువత మెజార్టీగా బీజేపీనే ఆదరిస్తున్నారని, పంచాయతీల్లో మెరుగైన స్థానాలు వస్తాయనే అంచనాతో ఉన్నారు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో గ్రామాలకు చేసిందేమి లేదని, ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు కేంద్ర వాటా ఉందన్న విషయాన్ని ప్రజలకు వివరించనున్నారు. వీటితో పాటు జాతీయ రహదారులు, కేంద్రం నిధులతోనే జాతీయ ఉపాధి హామీ పనుల వంటివి అమలవుతున్నాయనే విషయాన్ని ప్రజలకు వివరించాలనే ఆలోచనతో ఉన్నారు. అసెంబ్లీలో 8 మంది ఎమ్మెల్యేలతో పాటు 8 మంది ఎంపీలు కూడా ఉన్నందున ఆయా నియోజక వర్గాల్లో బీజేపీకి అనుకూల పవనాలు వీస్తాయని ఆ పార్టీ నాయకులు ఆశిస్తున్నారు.స్థానిక ఎన్నికల్లో టికెట్ సాధించేందుకు ప్రధాన పార్టీలకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు తమ ప్రయత్నాలను స్పీడప్ చేశారు. రాష్ట్ర పార్టీ ముఖ్య నేతల దగ్గర లాబీయింగ్ పెరిగినట్టు తెలుస్తున్నది. రిజర్వేషన్ల ప్రకారం తమకు కలిసి వచ్చే ఆయా సామాజికవర్గాల నేతలు టికెట్లపై తమ వాదనలు పార్టీ ముఖ్యుల దగ్గర వినిపిస్తూ టికెట్లు తమకే ఇవ్వాలని విజ్ఞప్తులు చేసుకుంటున్నారు. రిజర్వేషన్ల ద్వారా ఈసారి జనరల్ స్థానాలు తగ్గడంతో ఆ సీట్లపై భారీఎత్తున ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా అధికార పార్టీలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ బంధువులు, వారసులను రంగంలోకి దింపేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు గ్రామాల్లో పట్టున్న నాయకులను బరిలో దింపాలనే ఆలోచనతో ఉన్నారు. అన్ని పార్టీలకు చెందిన ఆశావాహులు మాత్రం గ్రామాల్లో వివిధ కార్యక్రమాలకు హాజరవుతూ గత కొన్ని నెలలుగా హడావుడి చేస్తున్నారు.

## రెండో దశ నీట్ సీట్ల కేటాయింపు జాబితా విడుదల-

హైదరాబాద్, అఅక్టోబర్ 1 (భారత శక్తి):
తెలంగాణలో రెండో దశ ఎంబీబీఎస్, బీడీఎస్‌లో ప్రవేశాల కోసం ఎదురు చూస్తున్న వాళ్లకు గుడ్ న్యూస్. ఇప్పటికే తమకు కావాల్సిన కాలేజీలో సీట్లను ఎంపిక చేసుకున్న విద్యార్థులు వాటి ఫలితాల కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నారు. వారి ఎదురు చూపులకు తగ్గట్టుగానే కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆ రెండో దశ సీట్ల కేటాయింపు వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టింది. రెండో దశలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కేటాయింపునకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వాల్సిన పని లేదు. నేరుగా అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపు వివరాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పీడీఎఫ్ ఉన్న




వివరాల్లో మీ పేరు మీకు కేటాయించిన కాలేజీ వివరాలను చెక్ చేసుకోవచ్చు. డౌన్‌లోడ్ చేసిన సెకండ్ ఫేజీ ఎంబీబీఎస్, బీడీఎస్ జాబితా పీడీఎఫ్‌లో ర్యాంకులు, రోల్ నెంబర్ వారిగా కేటాయించిన కాలేజీల వివరాలు ఇచ్చారు. అందులో మీరు మీ మెరిట్ ఆధారంగా సాధించిన కాలేజీ గురించి చూడొచ్చు. ఇందులో ర్యాంకు, కేటగిరి, రిజర్వేషన్లు ఇతర ప్రాధాన్యతల ఆధారంగా కేటాయింపులు జరిగాయి. వాటిని చెక్ చేయవచ్చు. మీ పేరుకు ఎదురుగా అన్ని వివరాలు పొందుపరిచారు. మీరు డౌన్‌లౌడ్ చేసిన రెండో దశ ఎంబీబీఎస్, బీడీఎస్, పీడీఎఫ్‌ను ప్రింట్ తీసి పెట్టుకోవాలి. ఇందులో మీకు కేటాయించిన కాలేజీ నచ్చినట్టు అయితే తర్వాత ప్రక్రియ పూర్తి చేయాలి. ఆ కాలేజీకి వెళ్లి ఫీజు చెల్లించి మిగతా వివరాలు అందజేయాలి. అప్పుడే మీకు కేటాయించిన సీటు మీకు కన్ఫామ్ అవుతుంది. లేకుంటే గడువు లోపు ఈ పని పూర్తి చేయకుంటే మాత్రం సీట్లు క్యాన్సిల్ అయ్యే అవకాశం ఉంటుంది. మీరు నీట్ అప్లికేషన్ నింపేటప్పుడు ఇచ్చిన మెయిల్, ఫోన్ నెంబర్‌కి కూడా వివరాలు పంపించారు. ఒక్కసారి చెక్ చేసుకోండి. కొన్ని సార్లు మెయిల్‌లో వివరాలు స్పాన్‌లోకి వెళ్లి ఉంటాయి. అందులో కూడా చెక్ చేయాల్సిన అవసరం ఉంది. మీకు కేటాయించిన కాలేజీ పేరుతో మీకు అలాట్మెంట్ లెటర్ వచ్చి ఉంటుంది. దాన్ని డౌన్‌లోడ్ చేయాలి అంటే కచ్చితంగా అధికారిక వెబ్‌సైట్‌లోకి లాగిన్ కావాలి. అప్పుడే దాన్నిడౌన్ లోడ్ చేసుకోగలరు. కాలేజీకి వెళ్లినప్పుడు కచ్చితంగా ఇది ఇస్తేనే మీరు తర్వాత ప్రక్రియ పూర్తి చేయడానికి వీలవుతుంది. డౌన్‌లౌడ్ చేసిన తర్వాత ఎంబీబీఎస్ అభ్యర్థులు నలభై వేలు, బీడీఎస్ అభ్యర్థులు ఇరవై వేలు చెల్లించాలి. అలా చెల్లించిన తర్వాత మీ సీటును హోల్డ్ చేస్తారు. ఒక తేదీని మీకు ఇస్తారు. ఆ తేదీ లోపు మీరు కాలేజీకి వెళ్లి మిగతా ప్రక్రియ పూర్తి చేయాలి. ఆన్‌లైన్‌లో వివరాలు అందివ్వకుండా కూడా కాలేజీకి వెళ్లినా ప్రయోజనం ఉండదు. ఈ రెండింటిలో ఏది చేయకున్నా సరే మీ సీటును రద్దు చేస్తారు. తర్వాత విడత కౌన్సెలింగ్స్‌లో ఆ సీటును ఉంచుతారు.

# తెలంగాణలో పింక్ బుక్ లేదు, రెడ్ బుక్ లేదు, బ్లూ బుక్ లేదు

## మాకు తెలిసిందల్లా ఖాకీ బుక్ మాత్రమే

హైదరాబాద్ అక్టోబర్ 1 (భారత శక్తి):
సోషల్ మీడియాలో ఇష్టమొచ్చినట్లు కుటుంబ సభ్యులను కించపరిచేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవుని డీజీపీ శివధర్ రెడ్డి హెచ్చరించారు. డీజీపీ గా నియమించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఏ లక్ష్యంలో నన్ను నియమించారో అందుకు అనుగుణంగా పనిచేస్తామని అన్నారు. తెలంగాణలో పింక్ బుక్ లేదు, రెడ్ బుక్ లేదు, బ్లూ బుక్ లేదు. మాకు తెలిసిందల్లా ఖాకీ బుక్ మాత్రమే నని అన్నారు. లోకల్ బాడీ ఎన్నికలు మాకు మొదటి చాలెంజ్. శాంతియుతంగా ఎన్నికలు పూర్తి చేయడానికి సన్నద్ధం అవుతున్నాము . పోలీస్ శాఖలో 17000 ఖాళీలు ఉన్నాయి..ఆ నియామకాలు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటాం. బేసిక్ పోలీసింగ్




తో సాంకేతికను ఉపయోగించుకుని మరింత సమర్థవంతంగా పని చేస్తాము. మావోయిస్టులు పొలిట్ బ్యూరో మల్లోజుల వేణు గోపాల్ ఇటీవల ఒక ప్రకటన రిలీజ్ చేశారు. బయటకు రావడానికి, ఆయుదాలు వదిలి పెట్టడానికి నిర్ణయం తీసుకున్నాం అని ప్రకటన రిలీజ్ చేశారు. జనరల్ సెక్రటరీ బసవరాజు ఉన్నపుడే ఆ నిర్ణయం జరిగింది.. అని వేణుగోపాల్ ప్రకటనలో పేర్కొన్నారు . వేణుగోపాల్ ఇచిన స్టేట్ మెంట్ జగన్ ఖండించారు . ప్రజా పోరాట పంథా సక్సెస్ అవట్లేదు అని మావోయిస్టులే అంటునారు. పోలీసులు వేధిస్తారని అని భయం లేకుండా ఎలాంటి సంశయం లేకుండా మావోయిస్టుల జన జీవన స్రవంతి లోకి రావాలని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.

చాలా మంది ఇప్పటికే పార్టీ నుండి బయటకు వస్తున్నారు..రీసెంట్ సెంట్రల్ కమిటీ మెంబర్ సుజాతక్క కూడా లొంగిపోయారు . మావోయిస్టుల లతో మాకు ఇక్కడ సమస్య లేనపుడు వాళ్ళతో చర్చలు అనవసరం .సైబర్ సెక్యూరిటీ, ఈగల్ టీం లకు పూర్తి సహకారం ఉంటుంది. బేసిక్ పోలింగ్ ఓ విజువల్ పోలీసింగ్ మానిటరింగ్ సిస్టమ్ ఇంప్రూవ్ చేస్తామని అన్నారు.

# మొక్కలను సంరక్షించాలి... రోడ్డు డివైడర్ల మధ్యలో నాటాలి

వాహన పూజల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, అక్టోబర్ 1 (భారత శక్తి):
నర్సరీలో పెరుగుతున్న మొక్కలను సంరక్షించాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. బుధవారం నగరపాలిక ఆధ్వర్యంలో ఎల్ఎండీ సమీపంలో ఏర్పాటు చేసిన నర్సరీని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి సందర్శించారు. మొక్కలు ఎండిపోకుండా నీటిని అందిస్తూ ఇతర జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు నర్సరీ లో పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించి శుభ్రం చేయాలన్నారు.
రోడ్డు డివైడర్ల మధ్యలో మొక్కలు నాటించాలని సూచించారు. పండ్ల మొక్కలను ఉమెన్స్ కాలేజీలో పెరిగిన మొక్కలను వృథా చేయకుండా తప్పనిసరిగా నాటించాలని పేర్కొన్నారు. వారి వెంట మున్సిపల్ ఈఈ సంజయ్ కుమార్, ఏఈ సల్మాన్ తదితరులు ఉన్నారు.

- స్థల పరిశీలన

మున్సిపల్ వాహనాలు నిలుపుదల కోసం కోటి రూపాయలతో రేకుల షెడ్డు ఏర్పాటు చేసేందుకు హౌసింగ్ బోర్డ్ కాలనీలో స్థలం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్..మున్సిపల్ ఈఈ సంజయ్ కుమార్ కు పలు సూచనలు చేశారు.

- పనులు వేగవంతం చేయాలి

బాలసదన్ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచి సత్వరం పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు.
జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆసుపత్రి సమీపంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ. రెండు కోట్లతో చేపట్టిన బాలసదన్ భవన నిర్మాణ పనులను నగరపాలిక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి పరిశీలించారు. సకాలంలో పనులు పూర్తిచేసి భవనం అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట మున్సిపల్ ఈ ఈ సంజయ్ కుమార్, తదితరులు ఉన్నారు.

- వాహనాలకు పూజ

విజయదశమి పండుగ పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సప్తగిరి కాలనీలో సబ్ స్టేషన్ వద్ద మున్సిపల్ రేకుల షెడ్డులో మున్సిపల్ వాహనాలకు పూజ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ పమేలా సత్పతి, నగరపాలక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్.. అర్చకుల సమక్షంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.
కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వేణుమాధవ్,మున్సిపల్ ఈఈ సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు - జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



సంగారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి)అక్టోబర్ 01: విజయదశమి పర్వదినం సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ,జిల్లా ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు.చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగ ప్రతి ఇంటిలో ఆనందోత్సాహాలను నింపాలని, చేపట్టిన కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు.మాత దుర్గాదేవి కృపతో అందరూ ఆరోగ్యవంతంగా, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో జీవించాలని కలెక్టర్ కోరారు. ఈ విజయదశమి ప్రతి ఒక్కరికి విజయాలు చేకూర్చాలని అభిలాషించారు.అందరూ శాంతియుత, ఆనందోత్సాహాల మధ్య దసరా పండుగను జరుపుకోవాలని ఆమె సూచించారు.

# కనిపెంచిన దైవాలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి

(అక్టోబర్1 ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా )

వృద్దులం అనుభవాల
వారదులం అంతరంగాన్ని
ఆవిష్కరించే కనపడని
డిటెక్టర్లం అకుపచ్చగా
మెరిసే పండుటాకులమే
గాని ఎందుకు
పనికిరాని వారం కాదు .

కలలు పండినా
పండక పోయినా
మేము తలలు పండిన
అనుభవజ్ఞులం
అనుభవాల నిధులం
కొరవడింది కంటి చూపు ..
మందగించలేదు
మా ముందు చూపు

అలసిపోయింది
దేహమే గాని
మామనసు కాదు
మనసుకు మబ్బులు
కమ్మిన మానవీయతను
చాటుతాం మమత సమత
క్షమతకు ఆర్థతకు
అడ్డా అవుతం

ఆత్మీయత అనురాగం
ప్రేమ వాత్సల్యం అందిస్తాం

ఆప్యాయత కరువై
ఆదరణ శూన్యమైన
జీవితమే బరువైన
వృద్ధాప్యం వెక్కిరించిన
కష్టాల కడలిని కానుకగా
ఇచ్చిన వృద్దులమై దీర్ఘ
సెలవులో వున్న
జాతి నిర్మాతలం

కార్పొరేట్ చదువులు
కరెన్సీ విలువను పెంచిన
మానవీయ విలువలు మరిచిన
మమత మంచితనానికి
వృద్దులమే అంబాసిడర్లం

అనుభవాన్ని రంగరించి
ఎంచుకున్న రంగంలో.
రాణింపుకు ఊతంగా నిలుస్తాం
ఎగిరెగిరి ఊళ్ళు ఏలక పోయిన
ఎవరికి కాబోము భారం

అరవైలో ఇరవై కాకున్నా...
అందని ద్రాక్ష కై అర్రులు
చాచం ఉన్నంతలో ఉన్నతి
ఉనికిని చాటుదాం


సంతృప్తి సంతోషమే
జీవన శైలిగా బతుకులు
సాగిస్తం యువతకు బరోసా
భద్రత మనోనిబ్బరతను
మాటల్తో అందిస్తాం
చేతులతో ఆదరిస్తం

కుందేళ్ళమై పరుగులు
తీయకున్నాకూచున్న
చోటే గెలుపు బాట
చూపగలంధైర్యానికి పెద్ద
దిక్కుగా నిలిచేము

పరుగెత్తే సత్తా లేకున్నా..
జీవన పోరాటంలో
మెళుకువలు నేర్పగలం
ఎంజాయ్ చేసే సమయం
మాకు లేకున్నా
సమయమంతా
మీకే సమర్పించే
సహనం వున్న వాళ్ళం
మా అనుభవ సారం
పంచుకుంటాం
మీఅభివృద్ధికి బాట వేస్తం

వాడిపోయే పూవులమైనా
కీర్తి ప్రతిష్టలు వెదజల్లుతాం
వంశ పారంపర్యంతో
సంతానం
ప్రతిష్ట పెంచే ప్రచార
కర్తలం
రాలిపోయే తారలమైనా
కాంతి పుంజాలమై వెలుగు
నిస్తం
కనిపెంచిన దైవాలను
కంటికి రెప్పలా
కాపాడుకోవాలి

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
కరీంనగర్
9440245771



# బిఆర్ఎస్ దోపిడి..కాంగ్రెస్ మోసాలు

- స్థానిక ఎన్నికల్లో ఓట్లడిగే అర్హత లేదు
- పార్టీ పిరయింపులకు బీజేపీ వ్యతిరేకం
- రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు



కరీంనగర్, అక్టోబర్ 1 (భారత శక్తి):
బి ఆర్ ఎస్ పదేండ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని దోపిడీ చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 420 మోషాలతో స్థానిక ఎన్నికలకు సిద్ధం అవుతున్నారని బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు మండిపడ్డారు. బుధవారం నగరంలోని మహాశక్తి దేవాలయంలో అమ్మవారిని కేంద్ర మంత్రి బండి సంజయ్ తో కలిసి దర్శించుకొని స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొని అనంతరం కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర అధ్యకులు పై విధంగా కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల విరుచుకుపడ్డారు. ఈ స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత అసలే లేదని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బి ఆర్ ఎస్ పార్టీ పదేండ్లు అధికారంలో ఉండి స్థానిక సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని, వారికే ఈ ఘనత దక్కుతుందనీ ఆరోపించారు. కేంద్ర నిధులు దారి మళ్లించి గ్రామాలను నామరూపాలు లేకుండా దెబ్బతీశారని, దీంతో సర్పంచ్ లు చేసిన పనులకు బిల్లులు రాక, పంచాయతీలకు విద్యుత్ చార్జీలు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకోవడానికి కారకులైనారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేసి మోసం చేసిందని, తిరిగి ఈ స్థానిక ఎన్నికల్లో మోసం చేసి గెలవడానికి వస్తున్నారని ల, గ్రామ పోలిమేరల్లోనే తరిమికొట్టాలని కోరారు. గ్రామాల్లో ప్రస్తుతం చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తిగా కేంద్రం నిధులతో జరుగుతున్నాయని స్పష్టం చేశారు. గ్రామాలకు 40వేల కోట్ల రూపాయల ఎరువుల పేరుతో సబ్సిడీ ఇస్తోందని, తద్వారా ఎరువుల పంపిణీ చేతగాక కృత్రిమ కొరతకు బాధ్యులు కాంగ్రెస్ ప్రభుత్వముదేనని చెప్పారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, అందుకే రెండేళ్ల జాప్యం చేశారనీ ఆరోపించారు. బీజేపీ పార్టీ బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని, ఎన్నికలు నిర్వహించాలన్నదే పార్టీ అభిమతం అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ప్రజలను కోరారు.
స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా అభ్యర్థుల ఎంపిక కార్యక్రమం కరీంనగర్ జిల్లా నుంచే మొదలైందముందనీ, జడ్పీటీసీ అభ్యర్థులను ఖరారు చేసి, ఏకగ్రీవంగా ఉన్న చోట బి.ఫాం ఇవ్వాలన్నారు. అలాగే వార్డు మెంబర్ నుంచి జడ్పీటీసీ దాకా అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుందనీ, అత్యధిక స్థానాలను సాధిస్తామని చెప్పారు. అలాగే పార్టీ పిరాయింపులకు బీజేపీ వ్యతిరమని, పార్టీని వీడే ముందు రాజీనామా చేయాలన్నదే పార్టీ ఉద్దేశ్యం అని పాత్రికేయుల అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి, నాయకులు సునీల్ రావు, తాళ్ళపెల్లి శ్రీనివాస్ గౌడ్ లు పాల్గొన్నారు.

# కుమ్మర్లను బిసి "ఏ" గూపులో చేర్చాలి

"మానవ నాగరికతకు కుమ్మరి తొలి మెట్టు ఆరోగ్యానికి కుండ ఆయువు పట్టు"

మానవుడికి వంట నేర్పి మానవ జాతి చరిత్ర నిర్ధారణకు సంస్కృతి' వారసత్వ విశేషాల అధ్యయనానికి దోహదపడే కుమ్మర వృత్తి అంతరించే దశకు చేరుకుంది. మానవాళికి వంట వండటానికి వంట పాత్రలు సమకూర్చి మానవ జాతికి శాస్త్రీయ పరిజ్ఞానం అందించి ప్రజారోగ్యాన్ని పర్యావరణ పరిరక్షణకు ప్రతినిధిగా నిలిచిన కుమ్మర వృత్తి కార్మికులు ఉపాధిలేక దుర్భరమైన జీవితాలను వెళ్ళ దీస్తున్నారు.
మానవ మనుగడ కుమ్మర వృత్తి మనిషి పుట్టుక 'పెళ్లి' 'చావు' .'దైవ' కార్యక్రమాల్లో కుమ్మర్ల ఉత్పతులు కుండలు' గురుగులు' వంట కొరకు ఎసులలు 'అటికెలు నీటి నిల్వకు తొట్టీలు రంజన్లు' కథువలు పెళ్ళిళ్ళలో "ఐరేని కుండలు" వినియోగిస్తారు. కుమ్మర్లవృత్తి మానవ జాతి మనుగడలో ప్రధాన పాత్ర పోషిస్తుందనడంలో అతిశయోక్తిలేదు. చారిత్రక వాస్తవం "మొహంజదారో" "హరప్పా" "మసపుటోనియా"" "సింధూ"
నాగరికత అధ్యయనాలలో వెల్లడైంది. గృహ ప్రవేశం ప్రభుత్వ భవనాల భూమి పూజ 'అమ్మవారికి సమర్పించే భోనాలు' తెలంగాణ సంస్కృతిని చాటే గోల్కొండ బోనాలు"శుభ" "దైవ"కార్యక్రమాల్లో కుమ్మరి కుండలు ఉపయోగిస్తారు. మట్టిని నమ్ముకొని పర్యావరణ పరిరక్షణకు కవచంగా నిలిచిన కుమ్మర వృత్తి ఉనికిని కోల్పోయే స్థితిలో వుంది.
కుమ్మర్లు కేంద్ర' రాష్ట్ర ప్రభుత్వాల నిరాదరణకు గురై కుల వృతుల( మట్టి పాత్రలకు) ఉత్పతులకు గిరాకీ తగ్గటం వల్ల కుమ్మర వృత్తి పై ఆధారపడిన కుమ్మర్లు వృత్తిని వదిలి పట్టణాలకు వలస పోతున్నారు. అల్పవేతనాలకు పనిచేస్తూ శ్రమ దోపిడీకి గురౌతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 14 లక్షల జనాభా కలిగి 8 లక్షల ఓటర్లు ఉన్న కుమ్మర్లు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మద్ధత్తు ఇచ్చారు. కుమ్మర్లు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. స్వరాష్ట్ర సాధనలో తెగించి కొట్లాడారు. సకల జనుల సమ్మె ' మిలియన్ మార్చ్ లో కుమ్మర్లు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. చాలా మంది కుమ్మర్లు గ్రామ 'మండల జిల్లా స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో వివిధ హోదాల్లో కాంగ్రెస్ పార్టీకి అంకిత భావంతో సేవలు అందిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ విధానాలను క్షేత్ర స్థాయిలో ప్రజలవద్దకు చేర్చి పార్టీ పట్ల ప్రజల విశ్వాసాన్ని సమీకరించడంలో గణనీయమైన కృషి చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై 10 సంవత్సరాలు గడిచినా గత ప్రభుత్వం కుమ్మర్లకు చట్టసభల్లో నామినేటెడ్ పదవులు ఇవ్వలేదు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలైనప్పటికీ కుమ్మర కులస్థులు చట్ట సభల్లో నేటికి ప్రవేశించలేదు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో చట్ట సభల్లో ప్రవేశం లేని కులాలకు నామినేటెడ్ పదవులు ఇస్తామన్న రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ' రేవంత రెడ్డి హామీతో కుమ్మర్లు కోటి ఆశలు పెట్టుకున్నారు.
దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 యేళ్లు ఐనప్పటికీ ఏఒక్క రాజకీయ పార్టీ అసెంబ్లీ ' లోకసభకు పోటీ చేయడానికి కుమ్మర్లకు టిక్కెట్లు ఇవ్వక పోవడం వల్ల కుమ్మర్లకు చట్ట సభల్లో ప్రవేశం లభించలేదు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేఆర్థిక స్థోమత లేని నామినేటెడ్ పదవుల్లో కుమ్మర్లకు రాజకీయ పార్టీలు అవకాశం కల్పించక పోవడం వల్ల రాజ్యాధికారం లోవాటా కుమ్మర్లకు దక్కలేదు. కుమ్మర్లను బీ 'సీ "బి" జాబితాలోచేర్చినప్పటికీ ఆశించిన విధంగా కుమ్మర్ల సామాజిక 'ఆర్థిక 'రాజకీయ వికాసం జరుగలేదు.

**కుమ్మర్లను బి' సి 'ఏ'గ్రూపులో చేర్చాలి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుల గణనలో కుల సర్వేలో ఆర్థికంగా సామాజికంగా ఉద్యోగ పరంగా రాజకీయంగా వెనుకబడిపోయి రెక్కాడితే డొక్కాడని కుమ్మర కులస్తులను బీ 'సీ ఏ గ్రూపులో చేర్చడానికి బీసీ కమిషన్ 'రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంతరెడ్డి గారు చర్యలు తీసుకొని కుమ్మర కులస్థుల జీవితాలలో వెలుగులు ప్రసాదిస్తారని విజ్ఞప్తి చేస్తున్నాను.

కుమ్మర్లకు రాజ్యాధికారంలో వాటాలి

నేటి వరకు కుమ్మర్లకు రాష్ట్రం నుండి అసెంబ్లీ 'లోకసభ 'రాజ్యసభ' కౌన్సిల్ సభ్యులుగా ఒక్కరికి కూడా అవకాశం రాలేదు. ఉత్తరాది రాష్ట్రాల్లో కుమ్మర్లను ప్రజాపతి 'కుమార్ 'కుంభార్ ' కుమావత్ ' కుంభాకార్ అనే పేర్లతో పిలుస్తారు.ఒకే దేశం ఒకే రాజ్యాంగం ఒకే చట్టం ఒకే రిజర్వేషన్ అంటూ చెబుతున్న నాయకులకు ఉత్తర' దక్షిణ 'భారత దేశ ప్రాంతాల మధ్య వివక్ష చూపడం వల్ల ప్రభుత్వాలు పార్టీలు అవలంబిస్తున్న దంద్వ వైఖరి వల్ల తెలుగు రాష్ట్రాలలో ఉన్న కుమ్మర్లు చట్ట సభల్లో ప్రవేశానికి నోచుకోలేదు.కుమ్మర్లను "ఎమ్మెల్సీ" 'కార్పొరేషన్స్ కు ఛైర్మెన్ పదవుల్లో నామినేట్ చేయక పోవడం వల్ల రాజ్యాధికారం కుమ్మర్లకు అందని ద్రాక్ష అయ్యింది.

**మట్టి కుంటల జీవో అమలు**

గతంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన మిషన్ కాకతీయ వల్ల చెరువుల్లో' 'కుంటల్లో మట్టి తవ్వకం వల్ల కుండలు చేయడానికి ఉపయోగించే బంక మట్టి కొరత ఏర్పడింది. మట్టి లభించే చెరువులు' కుంటలు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జాల్లోకి వెళ్ళటం వల్ల ఉచితంగా లభించే మట్టికి డబ్బులు చెల్లంచే పరిస్థితి వచ్చింది. కుంటల్లో చెరువుల్లో కుమ్మర్లకు ఉచితంగా మట్టి లభించే ప్రభుత్వ ఉత్తర్వులు అమలు కాలేదు.

ఉచిత కలిప జి 'వో అమలు చెయ్యాలి

కుమ్మర వృత్తికి ముడిసరుకు మట్టి కలప లభించని పరిస్థితులు దాపురించాయి.

కుమ్మర వృత్తి దారులు వలసలు

కుమ్మర వృత్తి ఉత్పత్తులు కుండలు వంట పాత్రలకు మార్కెట్లో డిమాండ్ తగ్గింది వృత్తి కుదు పెట్టనిస్థితికి చేరింది.
ఈ పరిస్థితి కుమ్మర వృత్తిదారులు కుల వృత్తిని వదిలి పట్టణాలకు నగరాలకు వలసకు దారితీసింది . ఉపాధి కొరకు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు.

కుమ్మర వృత్తి కుదేలైంది

ప్లాస్టిక్ 'అల్యూమినియం పాత్రలు మార్కెట్లో లభించడం వల్ల కుండలకు వంట చేసుకునే మట్టి పాత్రలకు డిమాండ్ తగ్గింది. కుమ్మర్ల రెండు రకాలుగా నష్టపోయారు.
కుండలు 'వంట పాత్రలకు కావలసిన ముడి సరుకు మట్టి కొరత ఒక వైపు మార్కెట్లో గిరాకీ తగ్గడం మరో వైపు జటిల ఆర్థిక సమస్యలుగా పరిణమించి కుమ్మర వృత్తి కుదేలైంది. "కులవృత్తిని మించింది లేదు గువ్వల చెన్న" అన్న నానుడి కుల వృత్తిని వదిలిందే మిన్న అనేది నేడు విధానమైంది.
ఉత్తరాది రాష్ట్రాల్లో కుమ్మర్లు ఎ'ఎస్సీ 'ఎస్ 'టి జాబితాలో వుండడం వల్ల అనేక రాజకీయ అవకాశాలు వచ్చాయి.అనేక మంది కుమ్మర్లు శాసన సభ్యులుగా ఎం'పి 'లుగా 'శాసన మండలి సభ్యులుగా 'మంత్రులుగా తమ ప్రతిభను చాటుతున్నారు.
ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు చట్ట సభల్లో అవకాశం రాలేదు. ఐ 'ఏ 'ఎస్ 'ఐ'పి' ఎస్ అధికారులుగా అవకాశం రావడం లేదు. తెలంగాణ ఉద్యమంలో కుమ్మర్లు తమ "సారే "కుల వృత్తులు ప్రదర్శిస్తూ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేశారు.అరెస్ట్ అయ్యిలాఠీ దెబ్బలు తిని జైళ్లకు వెల్లారు.

కుమ్మర్లు బిఓటుబ్యాంకు

తెలంగాణ ఏర్పడి 10 యేళ్లు ఐనప్పటికీ కుమ్మర కులస్థులకు చట్టసభల్లో ప్రవేశం లభించలేదు. రాష్ట్రంలోని119 నియోజక వర్గాల్లో అసెంబ్లీ అభ్యర్థుల గెలుపు ఓటములు నిర్ణయించడంలో గణనీయమైన ఓటు బ్యాంకు వున్న కుమ్మర్లు నామినేటెడ్ పదవుల్లో నియమించ బడలేదు. తెలంగాణ మాజీ ముఖ్య మంత్రి శ్రీ' కె చంద్రశేఖర్ రావు చట్ట సభల్లో ప్రవేశం ప్రాతినిధ్యం లేని కులమైన కుమ్మర్లకు "ఎమ్మెల్సీ 'పదవికి నామినేట్ చేస్తానన్న హామీ నేటికీ నెరవేరలేదు.
తెలంగాణలో కాంగ్రెస్ అద్వర్యంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం ఇతర కుల వృత్తులకు ఆదుకున్నట్లే కుమ్మరవృత్తి దారులను ఆదుకోవాలి. కుమ్మర్ల సంక్షేమ చర్యలు చేపట్టాలి.
కుమ్మర వృత్తికి ఆధునిక సాంకేతికతను అందించాలి..
యువతలో నైపుణ్యాభివృద్ధి కిపెద్ద పీట వేయాలి.ప్రతి మండల జిల్లా కేంద్రంలో అధునాతన పాటరీ "కలంకారీ"
ఉత్పత్తి కేంద్రాలను "స్కిల్ డెవలప్మెంట్ "ప్రోగ్రాం ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.
కుమ్మర వృత్తి అభివృద్ధికి మౌలిక వసతులు "వాము" బట్టిల కొరకు ఉచితంగా స్థలం సమకూర్చాలి.మట్టి సేకరణ వాము కాల్చడానికి పోరుక అడవినుండి కలప ఉచితంగా పొందడానికి ప్రభుత్వం జారీ చేసిన "జీ'వో" లు అమలు చెయ్యాలి.వాము' కొరకు కుండల' బట్టి కొరకు 'షెడ్ కొరకు ప్రభుత్వం ఉచితంగా భూమి కేటాయించాలి.
ప్రభుత్వం విధించే "సీవరేజ్ సేస్ "వృత్తి పన్ను నుండి కుమ్మర వృత్తిని మినాహాయించాలి.
చాకలి 'మంగలి వృత్తులకు ఇస్తున్న "ఉచిత విద్యుత్తు" సౌకర్యం కుమ్మర్లు ఉపయోగించే "సారే" కు వర్తింప చేయాలి. కుమ్మర్లకు గ్రామ పంచాయతీ 'మున్సిపాలిటీ' మున్సిపల్ కార్పొరేషన్లలో షాపింగ్ కాంప్లెక్స్ ల్లో వసతి ఉచితంగా కల్పించాలి. కుమ్మర్ల ఉత్పత్తులకు "రైతు బజార్లలో" స్టోరేజ్ సౌకర్యం మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలి. పాటరీ కోర్స్ ను విశ్వ విద్యాలయాలలో పాఠ్యాంశంగా చేర్చాలి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.
కేంద్ర ప్రభుత్వ భవిష్య నిధి పథకం ఇన్సూరెన్స్ ఆరోగ్యబీమా ప్రమాద బీమా సౌకర్యం కార్మిక మంత్రిత్వ శాఖ కుమ్మర వృత్తి దారులకు లేబర్ గుర్తింపు కార్డులు ఆరోగ్య కార్డులు ఉచితంగా ఇవ్వాలిలి

కుమ్మర్లను పూజారులుగా నియమించాలి

ప్రభుత్వం ఎండోమెంట్స్ శాఖ ద్వార గ్రామదేవాలయలలో( పోచమ్మ 'మైసమ్మ' గ్రామ దేవతలు) కుమ్మర కులస్తులను పూజారులుగా నియమిస్తూ జీ 'వో.జారీ చెయ్యాలి.

పెన్షన్ సౌకర్యం వర్తింపచేయాలిలి

కుమ్మర వృత్తిదారులు పెన్షన్ సౌకర్యం కల్పించాలి. ప్రమాద బీమాపథకాన్ని ఉచిత ఆరోగ్య పథకాన్ని వర్తింపచెయ్యాలి .

విద్యుత్తు సారి ఉచితంగా ఇవ్వాలి

కుమ్మర వృత్తి దారులకు ఉచితంగా విద్యుత్తుతో నడిచే సారి( ఆదునిక పరికరం) ఇవ్వాలి.

కుమ్మర ఫైనాన్స్ ఫెరేషన్ పునరుద్ధరించాలి

రాష్ట్ర ప్రభుత్వం కుమ్మర్ల సమగ్రాభివృద్ధికి ఆర్థిక వికాసానికి వృత్తి నైపుణ్య అభివృధి దోహదపడే "కుమ్మర / శాలివాహన ఫైనాన్స్ ఫెడరేషన్ కు రూ" "2000 కోట్ల బడ్జెట్ కేటాయించాలి. కుమ్మర ఫైనాన్స్ ఫెడరేషన్ ను పునరుద్ధరించి ఫెడరేషన్ కు ఛైర్మెన్' మరియు అన్నిజిల్లాకు ప్రాతినిధ్యం ఇస్తు పాలక వర్గాన్ని నియమించి కుమ్మర్లలో 'ఆత్మ గౌరవాన్ని" పెంపొందించాలి. కుమ్మర్ల సమస్యల పరిష్కారంకోసం కుమ్మర్లలో నాయకత్వాన్ని ప్రోత్సహించే వాతావరణం
కల్పించే చర్యలు తీసుకోవాలి.కుమ్మర్లకు కార్పొరేషన్ పదవుల్లో నామినేట్ చేసి రాజ్యాధికారంలో భాగ స్వాములను



చేయాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ' ఎ రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేయనైనది.

నేదునూరి కనకయ్య
రాష్ట్ర అధ్యక్షులు
తెలంగాణ కుమ్మర సంఘం 880/2014
హైదరాబాదు
9440245771

# టిఎన్జీవోల ఆధ్వర్యంలో ఉద్యోగుల సంబరాలు

- ఉద్యోగుల ఐక్యతనే విజయాలకు నాంది
- రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసి ఛైర్మన్ మారం

కరీంనగర్, అక్టోబర్ 1(భారత శక్తి):తెలంగాణ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగుల సంబరాల వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు.లబుధవారం ఎన్జీవో సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా సంఘం కోశాధికారి కిరణ్కుమార్ రెడ్డిజన్మదిన వేడుకలు ఉద్యోగులు, సంఘ సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించుకొన్నారు. అలాగే మల్కా రాజేశ్వరరావు పదవీ విరమణ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన ఏవోలు పదోన్నతి పొందిన అధికారులకు సన్మానాలు నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోలు రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ హాజరై మాట్లాడుతూ ఉద్యోగుల ఐక్యత, సంఘీభావమే విజయాల పునాదనీ గుర్తుచేశారు. ఉద్యోగులు ప్రతి సందర్భాన్నీ ఉత్సవంలా చేసుకోవడం విశేషం అని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు,గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, కార్యదర్శి అరవింద్ రెడ్డి,నాయకులు నాగుల నరసింహ స్వామి, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్ రెడ్డి, సర్దార్ హర్మిందర్ సింగ్, హరికృష్ణ, బల్వీర్ సింగ్, మారుపాక రాజేష్ భరద్వాజ్, ఒంటెల రవీందర్ రెడ్డి, ఏవి రాజేశ్వరరావు, ఇరుమల్ల శారద, సునిత, కొండయ్య వెంకట్ రెడ్డి, అజ్గర్ అలి, కరుణాకర్, లవకుమార్, నారాయణ, గిరిధర్ రావు, బోనాల రవి, పుర్ణచందర్ రెడ్డి, సత్యం, తిరుపతి, కోట రామస్వామి, శంకర్ పాల్గొన్నారు.

## విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 1 :సంగారెడ్డి జిల్లా నియోజకవర్గ ప్రజలందరికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగలో మన సంప్రాదాయం, సంస్కృతితో పాటు ఆత్మీయత మిలితమై ఉందని,ఈ పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలన్నారు. చెడు ఎంత శక్తివంతంగా కనిపిస్తున్నా, చివరికి మంచితనమే విజయం సాధిస్తుందని,దసరా పండుగ దీనిని గుర్తు చేస్తుంది. చెడు పై మంచి విజయం సాధించిన రోజు విజయ దశమి అని అన్నారు.

## విజయవాడ పత్రికా సమాచార కార్యాలయ డైరెక్టర్‌గా జి. సురేష్ కుమార్ ఐఐఎస్



విజయవాడ, అక్టోబర్ 01(భారత శక్తి ప్రతినిధి):విజయవాడలోని పత్రికా సమాచార కార్యాలయ డైరెక్టర్‌గా శ్రీ జి సురేష్ కుమార్ ఐఐఎస్ బాధ్యతలు స్వీకరించారు. ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియాకు(పిఆర్‌జిఐ) డిప్యూటీ ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్‌గా కూడా ఆయన అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్) సీనియర్ అధికారి అయిన శ్రీ సురేష్ కుమార్ పిఐబిలో బాధ్యతలు స్వీకరించడానికి ముందు ఐదు సవంత్సరాల పాటు రాష్ట్ర ప్రభుత్వం లో వివిధ హోదాలలో విధులు నిర్వర్తించారు. గతంలో విజయవాడలోని దూరదర్శన్ న్యూస్ ప్రాంతీయ వార్తల విభాగ అధిపతిగా, హైదరాబాద్ డిపిఆర్ డిఫెన్స్ ప్రజా సంబంధాల అధికారిగా, ఢిల్లీ ఇ ఎమ్ ఎమ్ సి లో సహాయ సంచాలకులుగా పనిచేశారు. రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రచార కార్యకలాపాలు, మరియు డిప్యూటీ ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్‌గా ప్రింట్ మీడియా సంస్థలకు సంబంధించిన వివిధ కార్యకలాపాలను తన కొత్త హోదాలో సమన్వయం చేస్తానని శ్రీ సురేష్ కుమార్ తెలియజేశారు .

## పోలీస్ కమీషనరేట్‌లో ఘనంగా దసరా వేడుకలు

**ఆయుధ, వాహన పూజల్లో పాల్గొన్న సిపి గౌష్ ఆలం**



కరీంనగర్, అక్టోబర్ 1 (భారత శక్తి):జిల్లా కేంద్రంలోని కమీషనరేట్ పోలీసు హెడ్ క్వార్టర్స్ లో దసరా పండగ సందర్బంగా ఆయుధ , వాహన, జమ్మి పూజల్లో కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ అలం పాల్గొన్నారు. ఈ సందర్బంగా పోలీసు కమీషనర్ మాట్లాడుతూ ప్రజలకు దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(ఏ.ఆర్)భీం రావు, ఏసీపీలు విజయ్ కుమార్ రిజర్వు ఇన్స్పెక్టర్లు లు రజినీకాంత్, జానీమియా, శ్రీధర్ రెడ్డి , కిరణ్ కుమార్, సిఐలు శ్రీనివాస్, రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, బిల్లా కోటేశ్వర్ , సరిలాల్ లతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజుల నుంచి పారిశ్రామికవేత్తల వరకు.. తగ్గని శ్రీవారి కానుకల వైభవం

**శతాబ్దాలుగా కొనసాగుతున్న శ్రీవారికి కానుకల సమర్పణ**
**శ్రీకృష్ణదేవరాయల కాలంలో అపూర్వ ఆభరణాల బహూకరణ**
**వివిధ మతాల వారు కూడా సమర్పించిన విలువైన కానుకలు**
**ఆధునిక కాలంలోనూ కోట్లాది రూపాయల విలువైన కిరీటాలు, హారాలు**
**భక్తికి, విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తున్న శ్రీవారి ఆభరణాలు**




తిరుపతి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 1,( భారత శక్తి):
తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిపై భక్తికి, సమర్పించే కానుకలకు యుగాల చరిత్ర ఉంది. రాజుల కాలం నుంచి నేటి ఆధునిక పారిశ్రామికవేత్తల వరకు, హిందూ మతస్థులే కాకుండా ఇతర మతాల వారు సైతం ఏడుకొండలవాడికి విలువైన ఆభరణాలను సమర్పిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. ఈ కానుకల వెనుక ఉన్నది కేవలం బంగారం, వజ్రాల విలువ కాదు.. యుగాలుగా కోట్లాది భక్తులు స్వామివారిపై కురిపిస్తున్న అచంచలమైన భక్తి, విశ్వాసం.

12వ శతాబ్దం నుంచి శ్రీవారికి కొనసాగుతున్న కానుకలు

12వ శతాబ్దం నుంచే శ్రీవారికి కానుకలు అందించే సంప్రదాయం ఉన్నప్పటికీ, విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల పాలనలో ఇది శిఖరస్థాయికి చేరింది. ఆయన 1513లో రెండు వేర్వేరు సందర్భాల్లో వజ్రాలు, కెంపులతో పొదిగిన కిరీటంతో పాటు నవరత్న ఖచిత ఆభరణాలు, స్వర్ణఖడ్గం వంటివి స్వామివారికి సమర్పించి తన భక్తిని చాటుకున్నారు. ఆకాశరాజు, తొండమాన్ చక్రవర్తి వంటి ఎందరో రాజులు స్వామివారికి అపురూప ఆభరణాలు అందించిన వారిలో ఉన్నారు.

మతాలకు అతీతంగా ఏడుకొండలస్వామికి కానుకల వెల్లువ

స్వామివారిపై భక్తి కేవలం హిందువులకే పరిమితం కాలేదు. బ్రిటిష్ పాలనలో చిత్తూరు కలెక్టర్‌గా పనిచేసిన థామస్ మన్రో స్వామివారికి ఒక పెద్ద గంగాళాన్ని కానుకగా ఇచ్చారు. అలాగే గుంటూరుకు చెందిన షేక్ హుస్సేన్ సాహెబ్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ మీరా వంటి వారు 108 బంగారు పుష్పాలను స్వామివారి పూజ కోసం సమర్పించడం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది.

ఆధునిక కాలం కానుకలు

రాజుల కాలం నాటి సంప్రదాయం నేటికీ అదే వైభవంతో కొనసాగుతోంది. ఆధునిక కాలంలోనూ శ్రీవారికి అత్యంత విలువైన కానుకలు అందుతున్నాయి. 2009లో గాలి జనార్ధనరెడ్డి సుమారు 42 కోట్ల రూపాయల విలువైన వజ్రకిరీటాన్ని సమర్పించారు. అలాగే, గోయంకా కుటుంబం 10 కిలోల బంగారు కిరీటాన్ని, పెన్నా సిమెంట్స్ సంస్థ 5 కోట్ల రూపాయల విలువైన వజ్రాల కటి, వరద హస్తాలను కానుకగా అందించారు.

తిరుమల శ్రీవారి ఆభరణాలు.. తరగని భక్తికి నిలువుటద్దం

రత్నకిరీటం, మేరు పచ్చ, సహస్రనామ హారం, సూర్య కఠారి వంటి అపురూప ఆభరణాలు ఉత్సవాల సమయంలో శ్రీవారి శోభను మరింత పెంచుతాయి. ఈ ఆభరణాలన్నీ కేవలం స్వామివారి ఖజానాకు అలంకారాలు కావు, తరతరాలుగా భక్తులు ఆయనపై చూపుతున్న ప్రేమకు, విశ్వాసానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. అందుకే ఆయన 'సిరి'నివాసుడిగా భక్తులచే పూజలందుకుంటున్నారు.

## అధిక లాభం ఆశ చూపి కోట్లల్లో దోచేస్తున్న ముఠా అరెస్ట్

ఉమ్మడి వరంగల్ బ్యూరో,(భారత శక్తి)అక్టోబర్1:
పెట్టిన పెట్టుబడికి అధిక మొత్తంలో లాభం ఆశ చూపిస్తూ ప్రజల నుండి కోట్ల రూపాయలను దోచేసిన నలుగురు సభ్యుల ముఠాను టాస్క్ ఫోర్స్, పాలకుర్తి పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఈ ముఠా నుండి 5లక్షల92వేల రూపాయలతో పాటు, 684.5 గ్రాముల బంగారు నాణాలు,150 గ్రాముల బంగారు ఆభరణాలు,ఒక కారు సెల్ ఫోన్లు, ల్యాప్ టాప్, రసీదు పుస్తకాలు, క్యాష్ కౌంటింగ్ మిషన్, చెక్ బుక్స్, స్టాంప్స్ తో పాటు పొలాలు, ఇంటి స్థలాలకు సంబంధించిన పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
పోలీసులు అరెస్టు చేసిన నిందితుల వివరాలు :
. తెప్పాలి సైదులు, తండ్రి పేరు బిక్షం, వయస్సు 55, స్వగ్రామం గడ్డి పల్లి, సూర్యాపేట జిల్లా. ప్రస్తుత నివాసం పాలకుర్తి మండల కేంద్రం, జనగామ జిల్లా.
. మనుబోతుల రామకృష్ణ, తండ్రి పేరు సాయిరామ్, వయస్సు 36, నందిగామ, కృష్ణ జిల్లా, ఆంధ్రప్రదేశ్, ప్రస్తుత నివాసం పాలకుర్తి మండల కేంద్రం, జనగామ జిల్లా.
. పొడిల సురేష్ కుమార్, తండ్రి పేరు వెంకటనర్సయ్య, వయస్సు 35, స్వగ్రామం పెన్ పహాడ్, సూర్యాపేట జిల్లా, ప్రస్తుత నివాసం, పాలకుర్తి, జనగామ జిల్లా. పొడిల శ్రీధర్, తండ్రి ఆంజనేయులు, వయస్సు 30, స్వగ్రామం హుజూర్ నగర్, సూర్యాపేట జిల్లా, ప్రస్తుత నివాసం పాలకుర్తి, జనగామ జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.ఈ అరెస్ట్ కు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ వివరాలను వెల్లడిస్తూ.. పోలీసులు అరెస్ట్ చేసిన ముఠాలోని ప్రధాన నిందితుడు తెప్పాలి సైదులు తన భార్య నారాయణమ్మ పేరు మీద హెబ్సిబా పేరుతో ఒక సంస్థను 2023 సంవత్సరంలో ఏర్పాటు చేసాడు. అనంతరం ప్రధాన నిందితుడు 2024 సంవత్సరంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అధిక లాభాలు ఆశ చూపిస్తూ చీటీ వ్యాపారాన్ని ప్రారంభించాడు. ఈ చిట్టీ లో చేరే వారు ముందుగా ఆరు వేల రూపాయలను చెల్లించాల్సి ఉంటుంది. సభ్యులు చెల్లించిన డబ్బులో నాలుగు వేలు తన వద్దనే డిపాజిత్ చేసుకొని మిగితా రెండు రెండు వేల రూపాయలకు సభ్యులకు ఈ సంస్థపై నమ్మకం నమ్మకం కలిగేందుకు సభ్యులకు రెండు వేల రూపాయల విలువ వస్తువులను అందజేస్తాడు వాస్తవంగా ఈ వస్తువుల విలువ కేవలం మూడు వందలు మాత్రమే వుంటాయి. ఈ సంస్థ లో ఒక సభ్యుడు ఎన్ని సభ్యత్వాలైన పొందవచ్చు. ఇందులో జాయిన్ అయిన ప్రతి సభ్యుడికి నెలకు వెయ్యి రూపాయల చొప్పున 20 నెలల పాటు డబ్బు ను తిరిగి అందజేసేవాడు. ప్రధాన నిందితుడు మిగితా నిందితులతో కలసి గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని సుమారు 28, 493




సభ్యత్వాలను నమోదు చేసుకోవడంతో పాటు వీరి నుండి 4వేల రూపాయల చొప్పున మొత్తం 11 కోట్ల39 లక్షల రూపాయలు ప్రజల డబ్బు ను తన వద్దనే భద్రపరుచుకొని వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అదే కాకుండా నిందితుడు సభ్యులకు కేవలం మూడు వందల రూపాయల విలువ వస్తువులను అందజేయడం ద్వారా మరో4కోట్ల 84 లక్షల రూపాయలను మోసం చేసినట్లుగా పోలీసుల దర్యాప్తు లో నిర్ధారణ అయింది.ముఖ్యంగా ప్రజలు అత్యాశతో ఈ సంస్థ లో లక్షల్లో పెట్టుబడి కూడా జరిగింది. ఈ సంస్థపై పోలీసులకు పలు పిర్యాదులు రావడంతో పాటు ఈ ముఠా సభ్యులు ప్రజల సొమ్ము తో తప్పించు పారిపోయే ప్రమాదాన్ని గుర్తించిన పోలీసులు ముఠా సభ్యులను అదుపులోకి విచారించగా ఈ ముఠా పాల్పడే మోసం పోలీసులకు వెల్లడించడంతో పాటు ఈ ముఠా వసూల్ చేసిన డబ్బును వివిధ 17 బ్యాంకుల్లో జమ చేసినట్లుగా గుర్తించిన పోలీస్ అధికారులు, 5కోట్ల 48 లక్షల, 64 వేల రూపాయలకు సంబంధించి ఎలాంటి లావా దేవీలు జరగకుండా బ్యాంక్ ఖాతాలను నిలిపివేయడం జరిగిందని.ప్రధాన నిందితుడు పై గతంలో మెదక్, సూర్యాపేట జిల్లాలతో పాటు ఇల్లందు, ఎల్. బి నగర్ పోలీస్ స్టేషన్ల లో సుమారు పదికి పై గా చీటింగ్ కేసులు ఉన్నట్లు వరంగల్ సీపీ వెల్లడించారు.ఈ సందర్బంగా సీపీ మాట్లాడు తూ ప్రజలు అధిక మొత్తం లో లాభం వస్తున్నది అని బోగస్ కంపెనీ లను నమ్మి ఎక్కువ మొత్తం లో డబ్బులు జమ చేస్తే ఎప్పుడో ఒకప్పుడు ఆ కంపెనీ బోర్డ్ తిప్పేస్తారు అప్పుడు మొత్తం నష్టపోతారు. ఇటువంటి మోసాగాళ్ల మాటలు నమ్మకుండా డబ్బులు పెట్టుబడి పెట్టేముందు జాగ్రత్తగా ఆలోచించాలి తక్కువ సమయం లో ఎక్కువ లాభం వస్తున్నదని చెబితే ఎవరు నమ్మవద్దని సీపీ ప్రజలకు సూచించారు.ఈ ముఠా పట్టు కోవడంలో ప్రతిభ కనబరిచిన వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, వర్ధన్న పేట, టాస్క్ ఫోర్స్ ఏసీపీ నర్సయ్య, మధుసూదన్, టాస్క్ ఫోర్స్ ఇన్స్ స్పెక్టర్ పవన్, పాలకుర్తి సిఐ జానకీరాం రెడ్డి, పాలకుర్తి ఎస్. ఐ, టాస్క్ ఫోర్స్ ఎస్. ఐ వంశీ కృష్ణ, దిలీప్,తో టాస్క్ ఫోర్స్,పాలకుర్తి పోలీస్ సిబ్బంది ని పోలీస్ అధికారులు, సిబ్బందిని సీపీ అభినందించారు.

## చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి

- సాయుధ దళ కార్యాలయంలో ఆయుధ పూజలో పాల్గొన్న జిల్లా ఎస్పీ
- జిల్లా ప్రజలందరికీ విజయదశమి (దసరా) పండుగ శుభాకాంక్షలు %-% జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 1 (భారత శక్తి):
నిర్మల్ జిల్లా సాయుధ దళ కార్యాలయంలో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తికి ప్రతీకగా భావించే ఆయుధాలకు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జమ్మి చెట్టుకు పూజలు చేసి, పోలీసు వాహనాలకు కూడా శుభపూజలు నిర్వహించారు. అనంతరం పోలీస్ పెట్రోల్ పంప్ వద్ద కూడా ఎస్పీ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ పంప్ ద్వారా 20 మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం, అలాగే విజయదశమి బోనస్‌ను సిబ్బందికి స్వయంగా అందజేయడం జరిగింది.ఈ సందర్భంలో ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా పోలీసులకూ, ప్రజలకూ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమిని విజయాల పర్వదినంగా అభివర్ణిస్తూ, శక్తికి ప్రతీక అయిన దుర్గామాత సమక్షంలో ఆయుధాలకు విశిష్టమైన శక్తి ఉంటుంది. ఈ పర్వదినం ప్రతి ఒక్కరికీ సుఖ సంతోషాలను కలిగించాలి అని ఆకాంక్షించారు. అలాగే పోలీస్ శాఖలో ప్రతి అధికారి ప్రజా రక్షణలో అగ్రగామిగా ఉండి, శాఖ గౌరవాన్ని మరింత పెంచే విధంగా పనిచేయాలని సూచించారు. పండుగలను అందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ముఖ్యంగా నవరాత్రుల అనంతరం జరిగే దుర్గామాత విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను కూడా శాంతియుతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తో పాటు భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ ,నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీన, ఇన్స్పెక్టర్లు, ఆర్ ఐ లు, ఎస్ఐ లు, ఆర్ ఎస్ ఐ లు,సాయుధ దళ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విజయాలను ప్రసాదించే విజయ దశమి


హైదరాబాద్, అక్టోబర్ 01 (భారత శక్తి ):
శ్రీ రాజరాజేశ్వరి స్తోత్రం
అంబా మోహిని దేవతా త్రిభువనీ
ఆనంద సంధాయినీబీ
వాణీ పల్లవ పాణి వేణు మురళీ
గాన ప్రియాలోలినీ?
కళ్యాణీ ఉడురాజబింబ వదనా
ధూమ్రాక్ష సంచారిణీబీ
చిద్రూపీ పరదేవతా భగవతీ
శ్రీ రాజరాజేశ్వరీ?

సనాతన ధర్మం లో ప్రతి సంవత్సరము ఆశ్వయుజ మాసాన శుక్లపక్షంలో దశమి తిథి రోజున జరిపేదే విజయదశమి ఉత్సవం. ఇది శుద్ధ పాడ్యమి నుంచి దశమి వరకు పది రోజులపాటు జరుగుతుంది. దీన్నే 'దసరా' అని కూడా వ్యవహరిస్తారు. పదవ రోజున దశమిని విజయదశమి అంటారు. హైందవులకిది ప్రధానమైన పండుగ. అశ్వీన్యస్య సితే పక్షే దశమ్యాం సర్వకామార్థ సాధకః అని ఈ శ్లోకం. ఆశ్వయుజ శుద్ధ దశమి నాటి సంధ్యా సమయాన్ని విజయకాలంగా గుర్తించారు పండితులు. సర్వకామార్థ సాధకం విజయదశమి రోజున జనులందరూ సీమోలంఘనం చేస్తారు. అంటే ఆ రోజు సాయంకాలం గ్రామ ప్రజలందరూ తమ గ్రామ పొలిమేరలు దాటి వెళతారు. అక్కడ శమీ పూజ నిర్వహిస్తారు. శమీ వృక్షం (జమ్మి చెట్టు) ను మంగళ వాయిద్యాలతో, సుగంధ ద్రవ్యాలతో, అర్ఘ్య పాద్యాలతో పూజిస్తారు. పూజా సమయంలో శమీ శమయతే పాపం....రామస్య ప్రియ దర్శిని అనే శ్లోకాన్ని పఠిస్తారు. శమీ పాపాలను పోగొడుతుందని నమ్ముతారు. దేవి నవరాత్రులు రాక్షసులతో పోరాడి ఒక్కొక్క రోజు ఒక్కొక్క రాక్షసుడిని అంతమందిస్తుంది. అందుకే ఈ తొమ్మిది రోజులు అమ్మవారి దేవాలయాల్లో ఒక్కొక్క రోజు ఒక్కొక్క దేవతగా అమ్మవారిని అలంకరించి పురోహితులు దీక్షతో పూజలు చేస్తారు. సప్తమి నాటి సరస్వతి, అష్టమి నాటి దుర్గాదేవి, నవమి నాటి మహిషాసుర మర్దిని మొదలైన అవతారాలు




అమ్మవారి రూపాల్లో ప్రధానమైనవి. ఈ రోజున ఆయుధ పూజలు కూడా నిర్వహించే ఆచారం ఉన్నది. రామాయణ, భారతాల ప్రకారంగా పాండవులకు శ్రీరామచంద్రుడికి శమీ వృక్షము విజయాన్ని ప్రసాదించిందని తెలుస్తుంది. ఇలా విజయదశమి విజయాలను ఇచ్చే విజయదశమిగా హైందవులు నమ్ముతారు. అయితే ఇదే రోజు 1925 విజయదశమి రోజున నాగపూర్ లో డాక్టర్ కేశవరావు బలిరాం హెడ్గేవర్ గారు (డాక్టర్జీ) రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(%=ూా%)ను స్థాపించారు. సరిగ్గా ఈ రోజుకి 100 సంవత్సరములు పూర్తి చేసుకుని శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(%=ూా%). ఇలా సనాతన హైందవ ధర్మానికి ప్రతీకగా విజయదశమి విజయాల పరంపరను గుర్తుచేసే మహోన్నతమైన ఉత్సవంగా హిందవులుజరుపుకుంటున్నారు.
ప్రతి సంవత్సరం ఆశీర్వదిజమాసంలో శుక్లపక్షంలో దశమి తిషధి రోజు జరిపేది విజయదశమి ఉత్సవం ఇది శుద్ధ పార్టీ నుంచి దశమి వరకు పది రోజులపాటు జరుగుతుంది దీన్ని దేవీ నవరాత్రులు అంటారు శరదృతువులో వస్తుంది కనుక శరన్నవరాత్రులు అంటారు 10 రోజుల పాటు జరుగుతుంది కాబట్టి దసరా అని కూడా వ్యవహరిస్తారు పదవరోజును దశమి నాడు విజయదశమి హైందవులకు ప్రధానమైన పండుగ.
- అశ్వీన్యస్య సితే పక్షి
- దశమ్యం తారకోదయే?
- సకాలో విజయే నామబీ
- సర్వ కామార్థ సాధకః?

ఈ శ్లోకం ఆశ్వయుజ శుద్ధ దశమినాటి సంధ్యా సమయాన్ని విజయకాలంగా తెలుపుతుంది. ఇది సర్వాకామ్యార్థ సాధకం. దశమి రోజున జనులందరూ



సీమోల్లంఘనం చేస్తారు. సీమోల్లంఘనం అంటే ఆ రోజు సాయంకాలం గ్రామ ప్రజలందరూ తమ గ్రామ పొలిమేర్లు దాటి వెళ్తారు. అక్కడ శమీ పూజ నిర్వహిస్తారు. శమీ వృక్షం (జమ్మి చెట్టు)ను మంగళ వాయిద్యాలతో, సుగంధ ద్రవ్యాలతో, అర్ఘపాధ్యాయులతో పూజిస్తారు. పూజా సమయంలో శమీ వృక్ష విశిష్టతను తెలియజేసే శ్లోకాలు పఠిస్తారు.
శమీవృక్ష(జమ్మిచెట్టు)విశిష్టత



- శమీ శమయతే పాపంబి
- శమీ శత్రువినాశనీబి
- అర్జునస్య ధనుర్ధారీబి
- రామస్య ప్రియదర్శినిబి
- కరిష్యమాణ యాత్రయాంబి
- యథా కాలం సుఖమయాబి
- తత్ర నిర్విఘ్న కరీత్వంబి
- భవ శ్రీరామ పూజితే బి

శమీ వృక్షం పాపాలను పోగొడుతుంది. శత్రువులను నశింపజేస్తుంది. ఈ వృక్షం అర్జునుడిని ధనుస్సును ధరింపజేసింది. శ్రీరాముడికి ప్రియమైన సీతమ్మ దర్శనం కలిగించింది. తాను చేయబోయే విజయ యాత్రలో శ్రీరాముడిచే పూజలు అందుకున్న ఓ శమీ వృక్షమా! నాకు విఘ్నాలు కలుగకుండా చేయుము. అని ఈ శ్లోకం వివరిస్తుంది.

అర్జునస్య ధనుర్ధారీ

అజ్ఞాతవాస కాలంలో విరాటరాజు రాజ్యంలో తలదాచుకున్న పాండవులు తమ మహిమాన్వితమైన ఆయుధాలను శమీ వృక్షం పై ఉంచారని ఐతిహ్యం. ఉత్తర గోగ్రహణ కాలంలో అర్జునుడు తన గాండీవాన్ని శమీ వృక్షంపై నుంచి తీసుకొని మరల దాన్ని సంధించి యుద్ధంలో విజయం సాధించాడు. విజయుడు విజయం సాధించిన ఆనాటి దశమి తిథియే ఈనాడు మనం జరుపుకుంటున్న విజయదశమి. ఈ భారత గాధ అర్జునస్య ధనుర్ధారి అనే విషయాన్ని వ్యక్తపరుస్తుంది.

- రామస్య ప్రియదర్శినీ

శ్రీరామచంద్రుడు రావణునితో యుద్ధం చేస్తున్నప్పుడు రావణుడి శిరస్సులు తెగిపోతూ రక్త బిందువులు భూమి మీద పడుతున్న కొద్దీ శిరస్సులు తిరిగి యధా పూర్వకంగా అతుక్కుంటున్నాయి. ఈ స్థితిలో శ్రీరాముడు కలత చెందాడు. వెంటనే జగన్మాత దుర్గమ్మను పూజించి ఆమెను ప్రసన్నురాలిగా చేసుకున్నాడు. అంతవరకు నిద్రిస్తున్న ఆ దేవి ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు మేల్కొంది. కనుక ఆనాటి నుంచి శ్రీరాముడు అసాధారణ పరాక్రమంతో యుద్ధం చేసి పదవ రోజున అనగా విజయదశమి రోజున పూర్తిగా విజయాన్ని పొందాడు. శ్రీరామచంద్రుడు శమీ వృక్షాన్ని పూజించి తన అర్ధాంగి సీతాదేవితో సహా అయోధ్యను చేరుకున్నాడు. ఈ కారణం వల్ల ఈ తొమ్మిది రోజులు అయోధ్యా వాసులు పండుగ జరుపుకొని దశమి రోజున శమీ పూజ నిర్వహించారు. ఈ రామాయణ గాధ "రామస్య ప్రియదర్శినీ" అనే విషయాన్ని స్పష్టం చేస్తుంది. అందుకే విజయదశమి రోజున శమీ పత్రాలను పరస్పరం ఇచ్చి పుచ్చుకొని ఆలింగనాలతో ఆశీస్సులతో అభినందనలు తెలుపుకునే ఆచారం (ఈ పండగ రోజు) అనాదిగా వస్తున్నది. దీనివల్ల పరస్పరం ప్రేమాభిమానాలు పెరిగి సుఖశాంతులు కలుగుతాయని హైందవులు నమ్ముతారు.

- ఆనందంగా ఆయుధ పూజ

దశమి రోజున ఆయుధ పూజను ఎంతో వైభవంగా నిర్వహిస్తారు ఆయుధాలు మాత్రమే కాకుండా కులవృత్తులకు సంబంధించిన పరికరాలను ఆయా వృత్తుల వారు విజయదశమి రోజున పూజించడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం ఈరోజు వాహనాలను పసుపు కుంకుమలతో పూలమానులతో మామిడి తోరణాలతో అలంకరించి వేడుకను జరుపుకుంటారు.

- రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్,దుర్గా వాహిని స్థాపన

1925 నాగపూర్ లో ఇదే రోజున పరంపూజ్య డాక్టర్ కేశవరావు బలిరాం హెడ్గేవార్ (డాక్టర్జీ) కేవలం ఐదుగురితో రాష్ట్రీయ స్వయంసేవక సంఘాన్ని స్థాపించాడు. ఈరోజుకి సరిగ్గా ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఇప్పుడు ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాలను విశ్వమంతా జరుపుతుంది. 1991లో విశ్వహిందూ పరిషత్ దుర్గా వాహిని ని స్థాపించింది. మహిళలను అపరదుర్గలుగా తీర్చిదిద్దే సంస్థ ఇది. ఇలా విజయ దశమి పురాణ ఇతిహాస కాలము నుంచే కాకుండా ఆధునిక కాలంలో కూడా ఎన్నో విజయాలకు మూలమై ఎంతో స్ఫూర్తిని ఇస్తున్నటువంటి ఉత్సవం. అందుకే ఈ విజయ దశమిని అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకొని సనాతన హైందవ సంప్రదాయాన్ని సంపన్నం చేయాలి! భారతదేశాన్ని మరల గురు స్థానంలో నిలబెట్టాలి!



చౌదూరి నరసింహారావు
ప్రవచన కర్త, ఆధ్యాత్మిక విశ్లేషకులు

# ఫ్యాషన్ గురించి

## నేనెందుకు పట్టించుకోకూడదు?





ఎదుగుతున్నప్పుడు విన్న మాటలే తనని బలంగా మార్చాయని అంటోంది బాలీవుడ్ తార భూమి పెడ్నేకర్. 'టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథా', 'భక్షక్' లాంటి శక్తిమంతమైన కథల్ని ఎంపిక చేసుకుంటూ ప్రేక్షకుల్ని అలరిస్తున్న కథానాయికీమె. ఈ ఏడాది ప్రారంభంలోనే 'ది రాయల్స్' సిరీస్‌తో ఓటీటీ వేదికగా సందడి చేసిన ఈమె.. ఎంచుకునే చిత్రాలే తనలోని మార్పుకు కారణమని చెప్తుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న భూమి.. తన సినీ ప్రయాణం, బాల్యం గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.

"చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి పదేళ్లు పూర్తయ్యాయి. నేను యశ్ రాజ్ ఫిల్మ్ రూపొందించిన 'దమ్ లగా కే హైసా'తో టీనేజర్‌గా ఉన్నప్పుడే సినీ ప్రయాణాన్ని ప్రారంభించాను. బాలీవుడ్‌లో పెద్ద హీరోయిన్ కావాలని కలలు కన్నా. మొదట్లో గుర్తింపు, అవకాశాల కోసం ఎదురుచూశా. కానీ నేడు నేను కోరుకున్నవన్నీ సాధించా. ఒక నటిగా చాలా అభివృద్ధి సాధించాను. నా తొలి సినిమా ప్రభావం, ఉనికిని నేను ఇప్పటికీ మర్చిపోలేను. ఇదే నన్ను ప్రేక్షకులకు దగ్గర చేసింది. ఆ సమయంలోనే సినిమా చాలా శక్తిమంతమైన సాధనమని గ్రహించా. నా కళతో సినీప్రియుల్లో స్ఫూర్తి నింపాలనుకున్నా. అందుకే 'భక్షక్', 'సోంచిరియా', 'బధాయి దో' లాంటి కథల్ని ఎంపిక చేసుకున్నా. ఇవి మహిళ గౌరవం, జర్నలిజం లాంటి ఇతివృత్తాలను అన్వేషించాయి. ఈ పదేళ్లు ప్రతి క్షణం నా కల కోసం బతికాను. మరిన్ని వైవిధ్యమైన కథలతో నా చివరి శ్వాస వరకూ నటిస్తూనే ఉండాలని కోరుకుంటున్నా". "సినీ రంగంలోకి రావడం వల్ల జీవితంలో ఎన్నో కొత్త విషయాలు జరిగాయి. గత రెండేళ్లుగా నా కెరీర్ ఇంకా ఆసక్తికరంగా మారింది. ఎందుకంటే ధైర్యంగా, సినిమాను దాటి మాట్లాడే అవకాశం దొరికింది. నాకు ఇది చాలా పెద్ద మార్పు. తొలినాళ్లలో నా వృత్తి కారణంగా కొన్ని నియమాలను పాటించేదాన్ని. ఇప్పుడు ఎందుకో నేను ఫ్యాషన్ పట్ల చాలా ఉత్సాహంగా ఉన్నా. "ఆమె ఎందుకు అంత కష్టపడుతోంది. ఆమె చాలా మంచి నటి. ఫ్యాషన్ గురించి ఎందుకు పట్టించుకోవాలి.." అంటూ ఈ మధ్య కొంత మంది సామాజిక మాధ్యమాల్లో నాపై కామెంట్లు చేస్తున్నారు. కానీ నేను ఎందుకు ఫ్యాషన్ గురించి పట్టించుకోకూడదు? ఏం చేయాలో, చేయకూడదో అనేది నా వ్యక్తిగత నిర్ణయం. ఫ్యాషన్ అనేది నా ప్రతిభను ప్రపంచానికి చెప్పడానికి ఓ గొప్ప మార్గం. ఇటీవల సొంతంగా కొన్ని బ్రాండ్‌లను కూడా ప్రారంభించడంతో మరో కొత్త అధ్యాయానికి కూడా నాంది పలికాను". "నన్ను ఎవరైనా నువ్వు ఇది చేయలేవు.. నీ వల్ల కాదు అంటే నన్ను నేను సవాలు చేసుకొని రంగంలోకి దిగుతా. బాల్యం నుంచి ఇలాంటి మాటలే వింటూ పెరిగా. చాలా సందర్భాల్లో నన్ను 'ఏంటి ఆమె నటి అవుతుందా?' అని ఎగతాళి చేసేవారు. వెక్కిరించేవారు. కానీ అవేమీ నాపై ప్రభావం చూపించలేదు. అనుకున్నట్లుగానే నేను ఒక అద్భుతమైన ఫిల్మ్ స్టూడియోలో కాస్టింగ్ విభాగంలో అడుగుపెట్టాను. అక్కడే ఎంతో కష్టపడి అన్నీ నేర్చుకున్నా. ఈ ప్రయాణంలో నాకు ఆ దేవుడే అండగా ఉన్నాడేమో అనిపిస్తుంది. 'దమ్ లగా కే హైసా' చిత్రంలో నటించడం నాకో గొప్ప అవకాశం. నా కలలకు దారి చూపించిందీ సినిమా". "నటీనటులందరు సోషల్ మీడియాలో విమర్శలు ఎదుర్కోవడం ఈరోజుల్లో సాధారణం అయిపోయింది. దీన్ని ట్రోలింగ్, బెదిరింపు.. ఇలా మీరు దానిని ఏ విధంగా పిలిచినా.. మనం దానికి అలవాటు పడ్డాం అనేది మాత్రం నిజం. కానీ మహిళల్ని లక్ష్యంగా చేసుకున్నప్పుడు దానిని ఎలా ఎదుర్కోవాలో ఇప్పటికీ నాకు తెలియదు. ఈ విషయంలో ధైర్యంగా లేకపోయినా.. కచ్చితంగా వాటిని తట్టుకొని నిలబడగలనని తెలుసు. మనం సోషల్ మీడియా ఆధిపత్యం చెలాయిస్తున్న ప్రపంచంలో జీవిస్తున్నాం. ఎంతో మంది వారి అభిప్రాయాలను మనపై రుద్దుతుంటారు. వాటిని అంతగా పట్టించుకోకపోతేనే.. ప్రశాంతంగా ఉండొచ్చనేది నా అభిప్రాయం"

**చిత్రం చూసి**

**ఓఅభిప్రాయానికి రండి**

## 'ది తాజ్ స్టోరీ' వివాదంపై చిత్ర బృందం




పరేశ్ రావల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ది తాజ్ స్టోరీ'. సోమవారం ఈ సినిమా నుంచి చిత్రబృందం ఆవిష్కరించిన మోషన్ పోస్టర్ వివాదాస్పదమైంది. తాజ్ మహల్ నుంచి శివుని విగ్రహం బయటకు వస్తున్న దృశ్యంతో విడుదలైన ఈ పోస్టర్ నెట్టింట విస్తృత చర్చలకు దారితీసింది. చిత్రబృందం వివాదాస్పద వాదనలను ప్రోత్సహిస్తోందంటూ నెటిజన్లు స్పందిస్తున్నారు. విమర్శలు పెరుగుతున్న నేపథ్యంలో పరేశ్ రావల్ ఆ పోస్ట్‌ను తొలగించారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రాన్ని సమర్పిస్తోన్న స్వర్ణిమ్ గ్లోబల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఇన్‌స్టా వేదికగా ఓ ప్రకటన విడుదల చేసింది. "ది తాజ్ స్టోరీలో ఎలాంటి మతపరమైన విషయాలను ప్రస్తావించలేదు. తాజ్ మహల్ లోపల శివాలయం ఉందని కూడా చెప్పలేదు. ఇది పూర్తిగా చారిత్రక వాస్తవాలపై దృష్టి పెడుతుంది. దయచేసి సినిమా చూసి మీ సొంత అభిప్రాయాన్ని ఏర్పరచుకోవాలని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాం" అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సురేశ్ ఝూ నిర్మించిన ఈ చిత్రానికి తుషార్ అమ్రిష్ గోయెల్ దర్శకత్వం వహించారు. ఈ నెల 31న థియేటర్లలో విడుదల కానుందీ సినిమా.

# ట్రంప్ సుంకాలతో భయం అవసరం

- సినిమాలపై టారిఫ్‌ల మీద స్పష్టత రావాల్సి ఉంది
- అవి అమలులోకి వచ్చినా యూఎస్‌లో టికెట్ల ధరల్ని పెంచలేం
- షూటింగ్‌ల కోసం ప్రతి కథనీ అమెరికా బాట పట్టించలేం



భారతీయ సినిమా విడుదల అంటేనే అమెరికాలో ఓ ప్రత్యేక సంబరం. ఇక తెలుగు సినిమా విడుదలంటే సందడి రెట్టింపు అవుతుంది. అగ్రరాజ్యంలోని మల్టీప్లెక్స్ థియేటర్ సైతం అనకాపల్లిలోని థియేటర్‌లా మారిపోతుంది. మనవాళ్ల సినిమా అభిరుచి అలాంటిది. సినిమా బాగుందంటే... వసూళ్లకు ఆకాశమే హద్దు. మిలియన్లకొద్దీ డాలర్లు వసూలవుతుంటాయి. భారతీయ సినిమాకి ఏటా 30–40% వసూళ్లు అమెరికాలోని మన ప్రేక్షకులు చూడటంతోనే వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విదేశీ సినిమాలపై అనూహ్యంగా 100% సుంకాల మోత మోగించడంతో చిత్ర పరిశ్రమ ఉలిక్కి పడింది. ఇదే విషయంపై అమెరికాలోనూ సినిమాలు రూపొందిస్తున్న మన తెలుగు నిర్మాత, పంపిణీదారు, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టి.జి.విశ్వప్రసాద్‌తో 'ఈనాడు సినిమా' ప్రత్యేకంగా ముచ్చటించింది. ఇవీ వివరాలు...

**సినిమాలపై టారిఫ్ ఎలా లెక్కగడతారనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది.** ట్రంప్ టారిఫ్‌లు కస్టమ్స్ సుంకాల రూపంలోనే ఉంటున్నాయి. మన వస్తువుల్ని అమెరికాకు ఎగుమతి చేసినప్పుడు, వాటిపై సరిహద్దు కేంద్రాల దగ్గర లెక్కగట్టి సుంకాలు విధిస్తారు. మరి సినిమాకి సరిహద్దు కేంద్రం ఎక్కడ? అంతా ఆన్‌లైన్ కంటెంట్ రూపంలోనే వెళుతుంది. ఒక పంపిణీదారు కంటెంట్ కొన్నప్పుడు అందులో వచ్చిన కంటెంట్ ఏమిటి? దాంతో ఉపయోగాలేమిటనేది చూస్తారు. కొనుగోలుకు చేసిన వ్యయంపై పన్ను విధించాలనుకుంటే, ఆ ఖర్చును పక్కాగా ఎలా నిర్ధారిస్తారు? దీనిపై ఒక స్ట్రక్చర్ వస్తే తప్ప స్పష్టత రాదు. **ఒక సినిమా ఎంత వసూలు చేసిందో లెక్కగట్టి వాటిపై సుంకాలు విధించేందుకు ఆస్కారం లేదంటారా?** అది వీలు కాదు. మనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరహాలో అక్కడ ఫెడరల్, స్టేట్ గవర్నమెంట్లు ఉంటాయి. అధ్యక్షుడి పరిధిలో ఉన్న ఫెడరల్ గవర్నమెంట్‌కి దిగుమతి సుంకాలు, ఆదాయపు పన్ను వ్యవహారాలపైనే అధికారాలు ఉంటాయి. మిగతావన్నీ స్టేట్ గవర్నమెంట్ల పరిధిలోకే వస్తాయి. టారిఫ్‌లు అమలు చేయాలనుకుంటే... సినిమాని దిగుమతి వస్తువుగా పరిగణించాల్సి ఉంటుంది. అప్పుడు సినిమాని ఎక్కడ, ఏరకంగా దిగుమతి వస్తువుగా నిర్ధారిస్తారనేది తేలాల్సిన విషయం. టికెట్ అమ్మకాలు/మొత్తం వసూళ్లపై పన్నులు వేసే అధికారం ఫెడరల్ ప్రభుత్వానికి ఉండదు. సేల్స్ పన్నుల వ్యవహారాలన్నీ రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి వస్తాయి. ఎట్టిపరిస్థితుల్లోనూ సుంకాలు వేయాలనుకుంటే కంపెనీల ఆదాయంపై వేయొచ్చు. అది ఆదాయపు పన్ను అవుతుందే కానీ, దిగుమతి సుంకాల పరిధిలోకి రాదు. మన సినిమాల్ని ఎలాగైనా కట్టడి చేయాలనే పట్టుదలతో ఉంటే... కస్టమ్స్ నిబంధనలను మార్చాల్సి ఉంటుంది. అదంత సులభం కాదు. కావాలంటే అమెరికాలో విదేశీ సినిమాలను బహిష్కరించవచ్చు. సినిమాపై టారిఫ్ లెక్కగట్టి పన్నులు వేయడంకంటే ఇదే వాళ్లకు సులభమని నా అభిప్రాయం. **ఇదంతా హాలీవుడ్‌ని రక్షించుకోవడం కోసమేనని ట్రంప్ అంటున్నారు కదా! ఇకపై అక్కడే షూటింగ్‌లు చేయాల్సి వస్తుందా?**

ఉద్దేశం అదే. అయితే, ఆచరణే కష్టం. హాలీవుడ్ సినిమాలు అమెరికాలో కాకుండా ఇతర దేశాల్లో చిత్రీకరణ జరుపుకోవడంతో ఆదాయం, ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయనేది వాదన. అమెరికాలో చిత్రీకరణతో నిర్మాణ వ్యయాలు పెరుగుతున్నాయని హాలీవుడ్ స్టూడియోలు భావిస్తున్నాయి. బయట దేశాలేమో రాయితీలు ఇస్తున్నాయి. అందుకే జార్జియా, కెనడా, ఐరోపా దేశాలకు వెళ్లిపోతున్నారు. హాలీవుడ్ సినిమా అంటే అమెరికా ఒక్కటే కాదు కదా... ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శితమవుతున్నాయి. మరి ఆయా కథలకు అనుగుణంగా వాళ్లకు ఎక్కడ సౌకర్యంగా ఉంటే అక్కడ చిత్రీకరణ చేస్తారు. భవిష్యత్తులో షూటింగుల విషయంపై ట్రంప్ టారిఫ్‌లకు సంబంధించి స్ట్రక్చర్ వస్తే తప్ప ఒక అభిప్రాయానికి రాలేం. **ఒకవేళ మన సినిమాలపై ట్రంప్ సుంకాల భారం పడితే... టికెట్‌ల ధరలు పెంచాల్సిందేనా? అమెరికాలో ఎంతో కొంత చిత్రీకరణ తప్పనిసరనే నిబంధనలు తీసుకొస్తే పరిస్థితి ఏమిటి?** టారిఫ్ భారం తప్పించుకోవడానికి అమెరికా వెళ్లి చిత్రీకరణలు చేయడం అసాధ్యం. సహజంగా కథ కోరుకున్నప్పుడే అమెరికా వెళ్లి షూటింగ్‌లు చేస్తుంటాం. అంతేకానీ, టారిఫ్ కోసమని ప్రతి కథనీ అమెరికా బాట పట్టించలేం కదా. ఇక టికెట్ ధరలంటారా? పెంచడం కుదరదు. ధరల్ని పెంచితే ప్రేక్షకుడు థియేటర్‌కి రాడు. ట్రంప్ సుంకాలతో ప్రేక్షకుడిపై ఒత్తిడి పెరగదు. కానీ, నిర్మాతలకు, పంపిణీదారులకు ఆదాయం తగ్గుతుంది. **టారిఫ్‌ల ప్రభావం ఓటీటీ వేదికలపైనా ఉంటుందేమోననే భయాలు నెలకొన్నాయి. దీనిపై మీరేమంటారు?** సుంకాలకీ, ఓటీటీ వేదికలకీ ప్రత్యక్షంగా సంబంధమే లేదు. సినిమా పరిశ్రమ దెబ్బతింటే ఓటీటీ వేదికలూ దెబ్బ తింటాయి. సినిమా తీసేవాళ్లు తగ్గితే, కంటెంట్ రాదు. కంటెంట్ రాకపోతే ఓటీటీ వేదికల మనుగడ కష్టం అవుతుంది. ఆ భయాలే తప్ప, ఓటీటీలపైనా టారిఫ్‌లు అమలు చేస్తారని కాదు. **మొత్తంగా ట్రంప్ సుంకాలతో మనకు వచ్చిన సమస్యేమీ లేదంటారు?** సుంకాలతో ప్రజల ఖర్చులు పెరిగి... వారి జీవనశైలి మారిపోతుంది. ఆ ప్రభావం సినిమా రంగంపైనా కచ్చితంగా పడుతుంది. అంతే కానీ, సినిమాలపై ట్రంప్ విధించనున్న టారిఫ్‌ల గురించి ఇప్పటికప్పుడు భయాలేమీ అవసరం లేదు. అక్కడ ఉత్తర్వులను అమలు చేయడానికి చట్టాలను చాలా స్పష్టంగా నిర్వచించాల్సి ఉంటుంది. ఒకవేళ అమలు చేయాలని నిర్ణయించినా... అక్కడ లా డెవలప్ చేయడానికి మూడు నెలలు, సమీక్ష చేయడానికి నెల సమయం పడుతుంది. ఆ తర్వాత పబ్లిక్ నోటీస్ ఇవ్వాల్సి ఉంటుంది. దానికి రెండు నెలలు పడుతుంది. ఇంతలో న్యాయస్థానాల్ని ఆశ్రయిస్తుంటారు. ఇలా చాలా తతంగం ఉంటుంది. **మన సినిమాలను లక్ష్యంగా చేసుకునే ట్రంప్ ఈ సుంకాలు విధిస్తున్నారనుకోవచ్చా?** అమెరికాలో మన సినిమాలు ఏడాదికి సగటున 50–60 మిలియన్ డాలర్లకు మించి వసూళ్లు సాధించడం లేదు. ఈ మొత్తానికే ట్రంప్ ఇదంతా చేస్తున్నారని అనుకోవడం లేదు. జపనీస్, చైనీస్ సినిమాలపైనే ఆయన దృష్టి ఎక్కువగా ఉంది. ఇటీవల జపాన్ నుంచి వస్తున్న యానిమేషన్ సినిమాలు అమెరికాలో మంచి వసూళ్లు సాధిస్తున్నాయి. చైనా సినిమాలూ అంతే ప్రభావం చూపిస్తున్నాయి.

**ఇటీవల అమెరికాలో థియేటర్ల దగ్గర హడావుడి కూడా విదేశీయులకి కంటగింపుగా మారిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?** అమెరికాలో వైవిధ్యమైన సమాజాలు నివసిస్తుంటాయి. మెక్సికన్లు మే 5న 'సింకోడి మాయో' అని ఒక పండగ చేసుకుంటారు. ఒక ఏరియా మొత్తం, ఒక రోజంతా వాళ్ల వేడుకే జరుగుతుంది. మనవైపు జాతర్లు, మేళాలు, వినాయక చవితి, దసరా, దీపావళి చేసినట్టు అన్నమాట. మెక్సికన్లు చిన్నచిన్న పనులు చేస్తుంటారు. మనదేమో రిచ్ కమ్యూనిటీ. అమెరిన్లతో సమానంగా అక్కడ ఉద్యోగాలు చేస్తుంటాం. దాంతో మనపై సహజంగానే కొంచెం కంటగింపుగానే ఉంటుంది. అందుకు తగ్గట్టే వాళ్ల ప్రతిస్పందనలు ఉంటాయి. సినిమా విడుదల సమయంలో మనం చేసే సందడి అమెరికా జనాలకి అలవాటైంది. ఆరంభంలో పేపర్లు ఎగరేస్తుంటే కొన్నిసార్లు షోలు రద్దు చేసేవారు. ఇప్పుడు అలవాటు చేసుకున్నారు.

# సింగర్ మృతి కేసు..

# మేనేజర్ అరెస్ట్



అస్సాంకు చెందిన ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ (52) ఇటీవల సింగపూర్‌లో ప్రమాదవశాత్తూ మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈనేపథ్యంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఆదేశాల మేరకు దర్యాప్తు కొనసాగుతోంది. తాజాగా ఈ కేసులో మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు.

నార్త్‌ఈస్ట్ ఇండియా ఫెస్టివల్ చీఫ్ ఆర్గనైజర్ శ్యామ్‌కాను మహంత, జుబీన్‌గార్గ్ మేనేజర్ సిద్ధార్థశర్మలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మహంతను అరెస్ట్ చేయగా గురుగ్రామ్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో శర్మను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. వీరిద్దరినీ గువాహటికి తరలించినట్లు తెలిపారు.

జుబీన్ మేనేజర్, ఈవెంట్ ఆర్గనైజర్ ఇళ్లలో ప్రత్యేక దర్యాప్తు బృందం ఇటీవల సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అలాగే సౌండ్ రికార్డిస్ట్ నివాసంలోనూ తనిఖీలు జరిగాయి. ఇక ఇప్పటికే ఈ కేసు విషయంలో మ్యుజీషియన్ శేఖర్ జ్యోతి గోస్వామిని అదుపులోకి తీసుకున్నారు. జుబీన్ మరణానికి ముందు ప్రయాణించిన నౌకలో ఉన్న బృందంలో గోస్వామి కూడా ఉన్నారని అందుకే అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఓటీటీలో ఈ వారం


### తను తలుచుకుంటే.. పూర్తి చేస్తాడు



శివ కార్తికేయన్, రుక్మిణీ వసంత్ జంటగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'మదరాసి'. ఇటీవలే థియేటర్లలో ప్రేక్షకులను అలరించిన ఈ సినిమా బుధవారం నుంచి అమెజాన్ ప్రైమ్ వేదికగా వీక్షకులకు అందుబాటులోకి రానుంది. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో విద్యుత్ జమ్వాల్, షబీర్ కల్లరక్కల్ కీలకపాత్రలు పోషించారు. తమిళనాడులో తుపాకీ సంస్కృతిని అలవాటు చేసి సొమ్ము చేసుకుంటూ..అక్రమాలకు పాల్పడుతున్న సిండికేట్‌ని అడ్డుకోవాలనే కథాంశంతో తెరకెక్కిందీ సినిమా. "తను తలుచుకుంటే దానిని పూర్తిచేయడానికి ఎంత దూరమైన వెళ్తాడు. ఇది నా ఊరు సార్ నేను వదలను" అంటూ అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలతో ప్రేక్షకుల్ని అలరించిన ఈ సినిమాని మీరూ చూసేయండి. విద్యావేత్త మోహిత్ త్యాగి నిజ జీవిత ప్రయాణం నుంచి ప్రేరణగా తెరకెక్కిన సిరీస్ 'థర్టీన్త్'. గగన్ దేవ్ రియార్, పరేశ్ పహుజా ప్రధాన పాత్రలో నటించిన ఈ సిరీస్‌కి నిశిల్ శేత్ దర్శకత్వం వహించారు. ఇందులో గగన్ ఉపాధ్యాయుడి పాత్రలో విద్యార్థులను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తుంటాడు. ఆయన శిష్యుడిగా పరేశ్ సమాజానికి ఉపయోగపడే పనే చేయాలని ఉద్యోగాన్ని వదులుకున్న రితేశ్ పాత్రలో కనిపించనున్నారు. భిన్నమైన స్టార్టప్ ఐడియాలతో పరుగులు పెడుతున్న ఈ ప్రపంచంలో తన గురువు కలనే నిజం చేస్తూ.. విద్యకు సంబంధించిన ఒక మంచి స్టార్టప్‌ని ప్రారంభించాలనుకుంటాడు రితేశ్. దాని కోసం తన గురువుని ఎలాంటి సహాయం కోరతాడు..విద్యావ్యవస్థలో మార్పు కోసం ఆయనతో కలిసి ఏ విధమైన ప్రయత్నాలు చేశారనే దాని చుట్టూ తిరుగుతుందీ సిరీస్. బుధవారం నుంచి సోనీలివ్ వేదికగా ప్రసారం కానుంది. ఓ దీపంలో జీనీ ఉంటాడు. దాని నుంచి అతను బయటికి వస్తే ఏవైనా మూడు కోరికలు కోరుకోమని వాటిని తీరుస్తానంటాడు.. ఇలాంటి కథలు అందరూ వినే ఉంటారు. అలాంటి జీనీ నిజజీవితంలోకి వస్తే ఆ అవకాశాన్ని వదులుకుంటారా ఎవరైనా? కానీ బే సుజీ అనే అమ్మాయి ముందు మనుషుల్లో ఉన్న అవినీతిని రుజువు చేసి నువ్వేంటో నిరూపించుకో ఆ తర్వాత నేను నా కోరికలు కోరుకుంటా అంటోంది. వేల సంవత్సరాలుగా మాయా దీపంలోనే సుదీర్ఘనిద్రలో ఉండి ఒక్కసారిగా మేల్కొంటాడు జీనీ(కిమ్ వూ బిన్). నిద్రావస్థలో ఉండడం వల్ల మానవుల కోరికలు తీర్చి చాలా కాలం అవుతుంది. ఈ నేపథ్యంలోనే అనుకోకుండా బే సుజీ(కా యోంగ్)ని కలుస్తాడు. తనని చూడగానే మూడు కోరికలు కోరుకోమంటాడు. సుజీ దానిని నిరాకరించి..సందర్భం వచ్చినప్పుడే కోరుకుంటానని జీనీని తన చుట్టూ తిప్పుకుంటుంది. అలా సరదాగా మొదలైన వారి పరిచయం ప్రేమగా మారుతుంది. ఒక సాధారణ అమ్మాయి అతీంద్రియ శక్తులుండే జీనీని ఎలా ప్రేమించగలిగింది? తన ప్రేమ ఫలిస్తుందా..అతడితో కలిసి జీవించడానికి తాను చేయాల్సిన పోరాటాలేంటి? చివరిగా సుజీ మూడవ కోరిక ఏం కోరుకుంది? తెలియాలంటే శుక్రవారం నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానున్న 'జీనీ మేక్ ఏ విష్' సిరీస్‌ను మీరూ చూసేయండి. ఈ రొమాంటిక్ కామెడీ సిరీస్‌ని దర్శకులు లీ బియోంగ్ హున్, అన్నా గిల్ హో సంయుక్తంగా తెరకెక్కించారు.

# గత 26 ఏళ్లలో..

## ఇండియన్ టాప్ 130 మూవీస్ ఇవే




సినిమాలకు రేటింగ్స్ ఇచ్చే ప్రముఖ ఎంటర్టైన్మెంట్ పోర్టల్ ఐఎండీబీ తమ వినియోగదారుల నుంచి అభిప్రాయాలు సేకరించి, ఏ సినిమాపై ఎక్కువ ఆసక్తికనబరిచారు? క్రేజ్ పరంగా ఏ హీరో ఏ స్థానంలో ఉన్నారు? తదితర వివరాల్ని వెల్లడిస్తూ ఒకేసారి 26 ఏళ్ల సినిమాలకు సంబంధించిన నివేదికను రూపొందించింది. 2000 జనవరి 1 నుంచి 2025 ఆగస్టు వరకు.. ఒక్కో ఏడాదిలో విశేష ఆదరణ పొందిన చిత్రాల జాబితాను విడుదల చేసింది. ప్రపంచ వ్యాప్తంగా తమకున్న 250 మిలియన్లకుపైగా యూజర్లు ఇచ్చిన రేటింగ్ ఆధారంగా ఈ జాబితా రూపొందించింది. అంటే.. ఏడాదికి 5 సినిమాల చొప్పున 26 ఏళ్లకుగానూ 130 చిత్రాలు టాప్‌లో ఉన్నాయి.

తొలి స్థానంలో నిలిచిన చిత్రాలివీ..మొహబ్బతే (2000), కభీ ఖుషీ కభీ ఘమ్ (2001), దేవదాస్ (2002) కల్ హో నా హో (2003), వీర్ జారా (2004), బ్లాక్ (2005), ధూమ్ 2 (2006), తారే జమీర్ పర్ (2007), రబ్ నే బనా దీ జోడీ (2008), 3 ఇడియట్స్ (2009), మై నేమ్ ఈజ్ ఖాన్ (2010), జిందగీ నా మిలేగీ దొబార (2011), గ్యాంగ్స్ ఆఫ్ వస్సీపూర్ (2012), ది లంచ్ బాక్స్ (2013), పీకే (2014), బాహుబలి 1 (2015), దంగల్ (2016), బాహుబలి 2 (2017), కేజీయఫ్ చాప్టర్ 1 (2018), ఉరి: ది సర్జికల్ స్ట్రైక్ (2019), దిల్ బెచారా (2020), పుష్ప 1 (2021), కేజీయఫ్ 2 (2022), యానిమల్ (2023), పుష్ప 2 (2024), సైయారా (2025).

**తదుపరి స్థానాల్లో మరికొన్ని తెలుగు సినిమాలు..**

మగధీర.. 2009లో నాలుగో స్థానం, నేనొక్కడినే.. 2014లో నాలుగో స్థానం, అర్జున్ రెడ్డి.. 2017లో నాలుగో స్థానం, అల వైకుంఠపురములో.. 2020లో రెండో స్థానం, ఆర్ఆర్ఆర్.. 2022లో రెండో స్థానం, సలార్ 1.. 2023లో నాలుగో స్థానం దక్కించుకున్నాయి.



# బీసీసీఐకి నఖ్వీ క్షమాపణలు

## ఆ విషయంలో వెనక్కి తగ్గని ఏసీసీ చీఫ్

బీసీసీఐకి నఖ్వీ క్షమాపణలు.. ల ఆసియా కప్ ఫైనల్ తర్వాత జరిగిన పరిణామాలు తీవ్ర చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. టైటిల్‌ను గెలిచినా సరే.. భారత్‌కు ట్రోఫీతోపాటు మెడల్స్ రాలేదు. ఏసీసీ చీఫ్‌గా ఉన్న మోసిన్ నఖ్వీ చేతులమీదుగా తీసుకొనేందుకు భారత క్రికెటర్లు నిరాకరించారు. దీంతో వాటిని తనతోపాటు ఏసీసీ కార్యాలయానికి నఖ్వీ తీసుకెళ్లారు. దీనిపై బీసీసీఐ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేసింది. ఏసీసీ సర్వసభ్య సమావేశంలోనూ ఘాటుగానే స్పందించింది. అక్కడా సమాధానం చెప్పకుండా మోసిన్ తప్పించుకోవడం గమనార్హం. నఖ్వీపై ఐసీసీకి ఫిర్యాదు చేస్తామని ఇప్పటికే బీసీసీఐ ( ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈక్రమంలో నఖ్వీ కాస్త వెనక్కి తగ్గినట్లు ఉన్నారు. ఈ విషయంలో బీసీసీఐకి క్షమాపణలు చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి.

ట్రోఫీ విషయంలో మాత్రం..ఆసియా కప్ ఫైనల్ సమయంలో, అనంతరం జరిగిన పరిణామాలపై బీసీసీఐకి క్షమాపణలు చెప్పిన మోసిన్ నఖ్వీ.. ట్రోఫీ అందజేత విషయంలో మాత్రం స్పష్టత ఇవ్వడం లేదు. ఇప్పటికే ట్రోఫీ, మెడల్స్‌ను తనతోపాటు ఉంచుకున్న ఆయన వాటిని భారత్‌కు ఇచ్చేందుకు మాత్రం అంగీకరించడం లేదని క్రికెట్ వర్గాలు తెలిపాయి. బీసీసీఐకి ఇవ్వకుండా భారత సారథే తన ఆఫీస్‌కు రావాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే బీసీసీఐ అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. మరోసారి నఖ్వీ ఇలాంటి ప్రతిపాదనే తీసుకురావడంతో ఐసీసీ దృష్టికి తీసుకెళ్లేందుకు బీసీసీఐ సిద్ధమైంది.



#### సమయం లేదు మిత్రమా..

## అవన్నీ పక్కన పెట్టేయాల్సిందే

ఇంగ్లాండ్ పర్యటనకెళ్లి సమవుజ్జీలుగా తిరిగి వచ్చాం. పొట్టి ఫార్మాట్‌లో జరిగిన ఆసియా కప్‌లో గెలిచాం.. ఇప్పుడు స్వదేశంలో టెస్టు సిరీస్ కోసం సన్నద్ధం.. గత మూడు వారాల్లో చోటుచేసుకున్న పరిణామాలను భారత క్రికెట్ అభిమానులు త్వరగా మరిచిపోలేరు. కానీ, టీమ్ఇండియా మాత్రం వాటిని పక్కనపెట్టేసి టెస్టు సిరీస్ పైనే మనసు పెట్టాల్సిన తరుణం ఆసన్నమైంది.

**తక్కువ వ్యవధి..**

దుబాయ్‌లో టీమ్ఇండియా() ఆసియా కప్ ఆడింది. అక్కడినుంచి ఆటగాళ్లు ఇప్పటికే భారత్‌కు చేరుకున్నారు. కానీ, రెండు రోజుల వ్యవధిలోనే మళ్లీ టెస్టు సిరీస్‌కు సిద్ధం కావాల్సిన పరిస్థితి. విండీస్‌తో గురువారం నుంచే టెస్టు సిరీస్ మొదలుకానుంది. ఆసియా కప్‌ను టీ20 ఫార్మాట్‌లో ఆడిన సంగతి తెలిసిందే. మళ్లీ ఇప్పుడు ఐదు రోజుల ఆట కోసం సన్నద్ధం కావాల్సిన పరిస్థితి. విండీస్‌తోనే కదా.. పెద్ద కష్టమేం అక్కర్లేదని భావించకూడదు. గతేడాది స్వదేశంలోనే టీమ్ఇండియాకు చుక్కెదురైంది. న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌ను కోల్పోవాల్సి వచ్చింది. అందుకే, విండీస్‌తో సిరీస్‌ను తేలిగ్గా తీసుకోకూడదు.

**ఫైనల్‌కు చేరుకోవాలంటే..**

ఇప్పుడు నాలుగో (ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్) కొనసాగుతోంది. ప్రస్తుతం భారత్ పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో ఉంది. ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను 2-2తో సమం చేయడంతో 46.67 శాతం సాధించింది. టాప్-2లో ఉంటేనే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరుకొనేందుకు అవకాశం ఉంది. అలా జరగాలంటే విండీస్‌పై రెండు టెస్టులను క్లీన్‌స్వీప్ చేయాలి. దీంతో రెండో స్థానానికి చేరుకొనే అవకాశం ఉంటుంది. ఎందుకంటే ఆస్ట్రేలియా (100 శాతం) ఆడిన మూడు టెస్టుల్లోనూ గెలిచింది. శ్రీలంక (66.67 శాతం) రెండో స్థానంలో ఉంది.

**అంతా ఫామ్‌లోనే..**

ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో ఆడి.. ఇప్పుడు చోటు దక్కించుకున్న ప్రతి క్రికెటర్ ఫామ్‌లోనే ఉండటం భారత్‌కు కలిసొచ్చే అంశమే. జస్‌ప్రీత్ బుమ్రా రెండు టెస్టుల్లోనూ ఆడతాడనే వార్తలు భారత్‌కు సంతోషాన్నిచ్చేవే. ప్రధాన స్పిన్నర్లుగా రవీంద్ర జడేజాతోపాటు కుల్‌దీప్ యాదవ్ ఉంటాడు. ఆల్‌రౌండర్ కోటాలోనే కాకుండా.. వైస్ కెప్టెన్‌గానూ జడ్డూ ప్లేస్‌కు ఢోకా లేదు. వీరితోపాటు వాషింగ్టన్ సుందర్‌కే మేనేజ్‌మెంట్ ఓటు వేయనుంది. ఓపెనర్లుగా మరోసారి కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ ఆడటం ఖాయం. వన్‌డౌన్‌లో సాయిసుదర్శన్ వస్తాడు. కెప్టెన్ గిల్ ప్లేస్ సెకండ్ డౌన్‌లోనే. ఇంగ్లాండ్ పర్యటనలో విఫలమైన కరుణ్‌నాయర్‌కు అవకాశం రాలేదు. వికెట్ కీపర్‌గా ధ్రువ్ జురెల్‌కే ఛాన్స్ ఇస్తారా? జగదీశన్‌ను ఆడిస్తారా? అనేది తేలాల్సి ఉంది. బుమ్రా, సిరాజ్‌తోపాటు నితీశ్ రెడ్డి పేస్ బౌలింగ్‌ను పంచుకుంటాడు. తుది జట్టు అంచనా: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్/అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, సిరాజ్, బుమ్రా

## తడబడి.. నిలబడి..



గువాహటిసొంతగడ్డపై మహిళల వన్డే ప్రపంచకప్.. ఈసారి బలమైన జట్టుతో బరిలోకి భారత్.. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ లాంటి మేటి జట్లను సైతం ఓడించగలదని, కప్పు గెలవగలదని హర్మన్‌ప్రీత్ సేనపై అంచనాలు! కానీ శ్రీలంక లాంటి బలహీన జట్టుతో ఆరంభ పోరులో కేవలం 4 పరుగుల తేడాలో 4 వికెట్లు కోల్పోయి 124/6తో నిలిచిన క్షణాన ఆశలు, అంచనాలు ఒక్కసారిగా కూలిపోతున్న భావన! లంకతోనే ఇలా ఆడితే, ఓడితే.. ఇక కప్పేం గెలుస్తారనే నిట్టూర్పులు! కానీ ప్రతికూల పరిస్థితుల్లో గొప్ప పట్టుదలతో నిలిచిన దీప్తి శర్మ, అమన్‌జ్యోత్.. మొత్తం కథను మార్చేశారు. జట్టుకు మెరుగైన స్కోరునందించారు. ఆపై బౌలింగ్‌లోనూ దీప్తి జట్టును ముందుండి నడిపించింది. మిగతా బౌలర్లూ సత్తా చాటారు. ఫలితం.. తొలి పోరులో భారత్‌కు 60 పరుగుల విజయం.

మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఫేవరెట్లలో ఒకటైన భారత జట్టు.. టోర్నీని ఘనవిజయంతో ఆరంభించింది. మంగళవారం తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పటికీ తట్టుకుని నిలబడ్డ భారత్.. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 60 పరుగుల తేడాతో శ్రీలంకను ఓడించింది.

# వామ్మో ఇదేం దూకుడు..

### 'సచిన్' ఘనతను వైభవ్ అధిగమించేస్తాడా?



ప్రత్యర్థిని ఊపిరితీసుకోనీయకుండా అటాకింగ్ గేమ్ ఆడటం అతడి స్పెషాలిటీ. అది ఐపీఎల్ అయినా, దేశవాళీ అయినా సరే దూకుడుగా ఆడటమే అతడి నైజం. కుర్రాడు దుమ్మురేపేస్తున్నాడు.. ఈ మాట వైభవ్ సూర్యవంశీకి ఇది చాలా చిన్న ప్రశంసే. అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టేందుకు రంగం సిద్ధమవుతుందా? 'క్రికెట్ దేవుడు' రికార్డు బద్దలు కాబోతుందా?

వైభవ్ సూర్యవంశీ రికార్డుల పరంపర కొనసాగుతోంది. ప్రస్తుతం అతడు ఆస్ట్రేలియాతో యూత్ టెస్టులు ఆడుతున్నాడు. తాజాగా 78 బంతుల్లోనే సెంచరీ చేసిన అతడు ఓ ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. న్యూజిలాండ్ క్రికెట్ స్టార్ మెక్‌కల్లమ్ సరసన చేరాడు. యూత్ టెస్టుల్లో 100లోపు బంతుల్లోగానే రెండు సెంచరీలు చేసిన రెండో బ్యాటర్‌గా వైభవ్ నిలిచాడు. అంతకుముందు ముందు 58 బంతుల్లోనే ఆసీస్‌పైనే అండర్ -19 జట్టు తరఫున శతకం బాదాడు.

**అక్కడ్నుంచే మొదలు..**

రాజస్థాన్ రాయల్స్ ప్రధాన కోచ్‌గా ఒక్క సీజన్‌కు మాత్రమే బాధ్యతలు నిర్వర్తించిన రాహుల్ ద్రవిడ్.. ఓ అద్భుతమైన క్రికెటర్‌ను వెలుగులోకి తీసుకొచ్చాడు. ఐపీఎల్ మెగా వేలానికి ముందు చాలా మందిలానే వైభవ్ కూడా పేరు నమోదు చేసుకున్నాడు. ఎవరు తీసుకుంటారులే అంతా అనుకున్నారు. కానీ, వైభవ్ టాలెంట్‌ను గుర్తించిన ద్రవిడ్ మాత్రం పట్టుబట్టి తన జట్టులోకి తీసుకున్నాడు. ఆ మెగా వేలంలో రూ. 1.10 కోట్లు దక్కించుకుని వైభవ్ సంచలనం సృష్టించాడు. అయితే, యశస్వి జైస్వాల్, సంజు శాంసన్ వంటి ఓపెనర్లు ఉండగా ఛాన్స్ రావడమూ కష్టమని భావించినవారూ లేకపోలేదు. అనూహ్యంగా సంజును వన్‌డౌన్‌లో పంపించిన మేనేజ్‌మెంట్ వైభవ్‌కు అవకాశం కల్పించింది. ఏడు మ్యాచుల్లో రికార్డు సెంచరీతో సహా 252 పరుగులు రాబట్టాడు. అప్పట్నుంచి అతడి పేరు మారుమోగిపోయింది. ఇక యూత్ వన్డేలు, టెస్టుల్లోనూ చెలరేగిపోవడంతో భారత జట్టులోకి ఎంట్రీనే తరువాయి అన్నట్లుగా అతడి హవా కొనసాగుతోంది.

**ఐసీసీ నిబంధన అడ్డే.. కానీ**

ఇప్పటికిప్పుడు వైభవ్‌ను భారత జట్టులోకి తీసుకోవాలని డిమాండ్ చేసే వారు చాలా మంది ఉన్నారు. కానీ, ఐసీసీ నిబంధన మాత్రం అతడికి అడ్డు వచ్చే అవకాశం ఉంది. అంతర్జాతీయ మ్యాచ్ ఆడేందుకు కనీస వయసును 15 ఏళ్లుగా నిర్దేశించింది. అప్పుడే సదరు ప్లేయర్ మానసికంగానూ కాస్త మెరుగ్గా ఉంటాడనే ఉద్దేశంతో అలా పెట్టింది. కానీ, వైభవ్‌లా అత్యుత్తమ ప్రతిభ కలిగిన ప్లేయర్‌ను ఆడించడంపై ఆయా బోర్డుల నుంచి వచ్చే విజ్ఞప్తులను ఆమోదించే అవకాశమూ ఉంది. ప్రత్యేక అనుమతి తీసుకుని జట్టులోకి ఎంపిక చేయొచ్చు. అలా అనుకుంటే.. ప్రస్తుతం వైభవ్ వయసు 14 ఏళ్ల 200o రోజులు. జాతీయ జట్టులోకి రావాలంటే మార్చి వరకూ ఆగాలి. అయితే, ప్రత్యేక అనుమతి తీసుకుంటే ఆ సమయం కూడా అక్కర్లేదు. 15 ఏళ్లు దాటాక జాతీయ జట్టుకు ఎంపికై తొలి మ్యాచ్ ఆడితే.. సచిన్ రికార్డును అధిగమించి సరికొత్త చరిత్ర సృష్టించడం ఖాయం. ఎందుకంటే సచిన్ తన తొలి మ్యాచ్‌ను 16 ఏళ్ల 238

## ఆల్‌రౌండ్ షో.. తొలి భారత మహిళా క్రికెటర్‌గా దీప్తి శర్మ ఘనత





భారత మహిళా జట్టు క్రికెటర్ దీప్తి శర్మ చరిత్ర సృష్టించింది. మహిళల వన్డే ప్రపంచకప్‌లో టీమ్ఇండియా శుభారంభం చేసింది. శ్రీలంకపై 59 పరుగుల తేడాతో (డక్‌వర్త్‌లూయిస్ పద్ధతి) విజయం సాధించింది. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఓ రికార్డును తన పేరిట లిఖించుకుంది. ఇప్పటివరకు ఏ భారత మహిళా క్రికెటర్‌కు సాధ్యం కాని ఘనతను తన ఖాతాలో వేసుకుంది. శ్రీలంకపై హాఫ్ సెంచరీతోపాటు మూడు వికెట్ల ప్రదర్శన చేసింది. దీంతో వరల్డ్ కప్‌లో ఇలాంటి ఘనత సాధించిన తొలి టీమ్ఇండియా మహిళా క్రికెటర్‌గా రికార్డు సృష్టించింది. అయితే, వన్డేల్లో ఇలా నమోదు చేయడం ఆమెకు రెండోసారి.తొలుత బ్యాటింగ్‌లో జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు దూకుడుగా ఆడింది. 53 బంతుల్లో 53 పరుగులు చేసింది. దీంతో 269 పరుగుల గౌరవప్రదమైన స్కోరును భారత్ చేసినట్లైంది. ఆమెతోపాటు అమన్ కౌర్ (57) కూడా రాణించింది.

# జావెలిన్‌లో డబుల్ ధమాకా

దిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు అదరగొట్టారు. ఒకేరోజు రెండు స్వర్ణాలు సహా నాలుగు పతకాలు ఖాతాలో చేర్చారు. మంగళవారం జావెలిన్‌త్రోలోనే రెండు పసిడి పతకాలు సొంతమయ్యాయి. పురుషుల ఎఫ్64 విభాగంలో సుమిత్ అంటిల్ జావెలిన్‌ను 71.37 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో తానే సృష్టించిన ఛాంపియన్‌షిప్ రికార్డు (70.83 మీ, 2023లో)ను తుడిచిపెట్టాడు. ఈ టోర్నీలో పసిడి హ్యాట్రిక్ కూడా కొట్టాడు. 2023, 24లోనూ అతడు స్వర్ణాన్ని నెగ్గాడు. పురుషుల ఎఫ్44 జావెలిన్ త్రోలో సందీప్ సంజయ్ సర్గార్ స్వర్ణం.. సందీప్ చౌదరి రజతంతో మెరిశారు. సంజయ్ 62.82 మీటర్ల త్రో వేయగా.. సందీప్ 62.67 మీటర్లు జావెలిన్ విసిరాడు. ఎడినిల్‌సన్ (బ్రెజిల్, 62.36 మీ) కాంస్యం దక్కించుకున్నాడు.

**యోగేశ్ మూడోసారి:** డిస్కస్ త్రోలో యోగేశ్ కతూనియా హ్యాట్రిక్ రజతం కైవసం చేసుకున్నాడు. ఎఫ్56 కేటగిరిలో 42.49 మీటర్ల దూరం డిస్క్‌ను విసిరి రెండో స్థానంలో నిలిచాడు. క్లాడినీ బటిస్టా (బ్రెజిల్, 45.67 మీటర్లు) స్వర్ణం, కొన్‌స్టాన్‌టినోస్ (గ్రీస్, 39.97 మీటర్లు) కాంస్యం గెలిచారు. టీ44 100 మీటర్ల పరుగులో నైఫ్ అల్మాస్‌రహి (సౌదీ అరేబియా) ప్రపంచ రికార్డు సృష్టిస్తూ పసిడి గెలిచాడు. 10.94 సెకన్లలో లక్ష్యాన్ని చేరిన అతడు 2019లో ఎంలాంగో (దక్షిణాఫ్రికా, 11 సె) నెలకొల్పిన రికార్డును బద్దలు కొట్టాడు. టీ34 200 మీటర్లలో దేవిడ్ (రష్యా), టీ20 400 మీటర్లలో దేవిడ్ జోస్ (స్పెయిన్), టీ54, 400 మీటర్లలో యాసిన్ (ట్యూనీసియా) పసిడి గెలిచారు.




**ప్రమాదంలో కాలు కోల్పోయి..**

ప్రపంచ పారా ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణాల హ్యాట్రిక్ సాధించిన సుమిత్ అంటిల్ మొదట రెజ్లర్ కావాలనుకున్నాడు. కానీ విధి అతడి ప్రణాళికలను వమ్ము చేసింది. హరియాణాకు చెందిన ఈ కుర్రాడు 17 ఏళ్ల వయసులో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అతడు ప్రయాణిస్తున్న బైక్.. ట్రక్‌ను ఢీకొనడంతో ఎడమ కాలిని కోల్పోయాడు. దీంతో రెజ్లర్ కావాలనే కల చెదిరింది. కానీ క్రీడలపై ఆసక్తిని కోల్పోలేదు. 2017లో పారా అథ్లెట్‌గా మారాడు. జావెలిన్ త్రోలో పట్టు సాధించి ఈ క్రీడలో దూసుకెళ్తున్నాడు. 2020, 2024 పారాలింపిక్స్‌లో స్వర్ణాలు నెగ్గిన 27 ఏళ్ల సుమిత్.. ప్రపంచ అథ్లెటిక్స్‌లో ఇప్పటివరకు మూడు స్వర్ణాలతో సహా నాలుగు పతకాలు కైవసం చేసుకున్నాడు.

**నాలుగేళ్ల వయసులోనే..**

మహారాష్ట్రకు చెందిన సందీప్ సంజయ్ నేపథ్యం భిన్నం. నాలుగేళ్ల వయసులోనే ఒక ప్రమాదంలో అతడి కాలికి తీవ్ర గాయం అయ్యింది. ఆటపై ఆసక్తితో అతడు పారా జావెలిన్‌వైపు అడుగులేశాడు. ఆర్థికంగా అవరోధాలు ఎదురైనా.. సాధన మానలేదు.

# దేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న శ్రీరాములు అందెల

బడంగ్పేట్, మహేశ్వరం, అక్టోబర్ 01 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పెట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని అల్మాస్గూడ గ్రామంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించినటువంటి దుర్గాదేవి అమ్మవారిని రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులందరితో కలిసి శ్రీరాములుని ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతు నవరాత్రులు శక్తి స్వరూపిణి అమ్మవారిని ఆరాధించే పవిత్ర సమయమని, అందులో భాగంగా గ్రామాలలో జరిగే ఈ విధమైన కార్యక్రమాల ద్వారా భక్తుల బాధ్యతను, భక్తి భావాన్ని మరింత పెంచుతాయని అదేవిధంగా తెలంగాణ హిందూ బంధువులందరికీ ముందస్తు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు రామిడి వీరకర్ణ రెడ్డి, కార్పొరేషన్ మాజీ బిజెపి అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్చల సుదర్శన్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు రేసు నరసింహా రెడ్డి, కార్యదర్శి లక్ష్మీనారాయణ యాదవ్, రాంబాబు గౌడ్, ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీరామ్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, బంగారు, రవికాంత్, మల్లేష్ యాదవ్, విగ్నేష్, కిరణ్, జామ్, నరసింహా రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బిక్షపతి రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, శ్రీకాంత్ మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## దుర్గ మాతకి ప్రత్యేక పూజలు నిర్వహించిన చిలుక మధుర ఉపేందర్ రెడ్డి

ఎల్బీనగర్, అక్టోబర్ 01 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ దుర్గ మాత ప్రత్యేక పూజలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి..ఈ కార్యక్రమంలో శైలజా రెడ్డి, రజినీ, రాణి, మదరపు శైలజ, అరుణ, సరిత, వరూధిని, మహాలక్ష్మి, గీత, కృష్ణవేణి, విమల, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



## దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన మేయర్ , డిప్యూటీ మేయర్, కమిషనర్

హైదరాబాద్ : అక్టోబర్ 01 (భారత శక్తి): రేపు దసరా పండుగను పురస్కరించుకుని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఆర్ వి కర్ణన్ లు గ్రేటర్ హైదరాబాద్ నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. క్రౌర్యం పై శౌర్యం, అసురత్వం పై దైవత్వం, అమానుషం పై మానవత్వం, స్వార్థం పై పరమార్థం, చెడు పై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకే విజయదశమి పండుగ నగర ప్రజల జీవితాల్లో ఆనందపు వెలుగులు నింపాలని వారు ఆకాంక్షించారు.




## హైడ్రా కమిషనర్‌కు వీహెచ్ వినతి

హైదరాబాద్, అక్టోబర్ 01 (భారత శక్తి): అంబర్‌పేటలోని బతుకమ్మకుంటను బాగా అభివృద్ధి చేశారు. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. బతుకమ్మ కుంట నిర్వహణ బాధ్యతను కూడా హైడ్రా తీసుకోవాలి` అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ శ్రీ వి. హనుమంతరావు గారు కోరారు. బుధవారం హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కబ్జాల చెర నుంచి బతుకమ్మకుంటను కాపాడడం.. చెరువుగా అభివృద్ధి చేయడం.. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి గారు ప్రారంభించడం ఇలా అన్ని కార్యక్రమాలు ఎంతో వైభవంగా జరిగాయని.. ఈ విషయంలో హైడ్రా చేసిన కృషి అభినందనీయమని శ్రీ వీహెచ్ గారు అన్నారు. బతుకమ్మకుంటను అభివృద్ధి చేసి వదిలేశారు అనే అపవాదు రాకుండా దీని పరిరక్షణ బాధ్యతను హైడ్రా తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. లేని పక్షంలో ఇక్కడ ప్రస్తుతతం ఉన్న ఆహ్లాదకర వాతావరణం దెబ్బతింటుందని అన్నారు.

*** బోటు షికారు కొనసాగించండి..**

బతుకమ్మకుంట ఇప్పుడు పర్యాటక ప్రాంతంగా మారిందని శ్రీ వీహెచ్ గారు అన్నారు. ప్రారంభోత్సవం నాటి నుంచి నేటి వరకూ అక్కడ ప్రతి రోజు సాయంత్రం సందడి వాతావరణం నెలకుంటోందని.. వందలాది మంది వచ్చి బతుకమ్మ ఆడారన్నారు. వచ్చే ఏడాది మరింత వైభవంగా బతుకమ్మ ఆటలు ఆడుతారని.. ఈ నేపథ్యంలో చెరువు అందాలు ఏమాత్రం దెబ్బతినకుండా చూడాలని కోరారు. ప్రస్తుతం బతుకమ్మకుంటలో ఉన్న బోటు షికారును కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. చెరువును చూడడానికి స్థానికేతరులు కూడా వస్తున్నారన్నారు. బతుకమ్మ కుంట సందర్శన, వ్యాయామ సమయాలను కూడా నిర్దేశించాలని కోరారు. ఆ సమయాలను గేటుపై పెట్టి.. నిరంతరం వాచ్‌మ్యాన్‌లు ఉండేలా చూడాలన్నారు. గతంలో ఇక్కడ చెత్త సేకరణ ఆటోలు పార్కింగ్ చేసేవారని.. వారికి ప్రత్యామ్నాయ పార్కింగ్ ఏరియా చూపించాలని కోరారు. అలాగే బతుకమ్మ కుంట సందర్శనకు వచ్చిన వాహనదారులు కూడా ఇష్టానుసారం వాహనాలను పార్కింగ్ చేయకుండా నియంత్రించాలని సూచించారు. హైడ్రా కమిషనర్‌ను కలిసిన వారిలో స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు నారాయణస్వామి కూడా ఉన్నారు.

### క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రభావవంతంగా

## జరిగేలా పర్యవేక్షణను బలోపేతం చేయాలి

**: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్**




హైదరాబాద్, అక్టోబర్ 01 (భారత శక్తి): క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రభావవంతంగా జరిగేలా పర్యవేక్షణను బలోపేతం చేయాలనీ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు అమలుపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, ఏసీ శానిటేషన్ రఘు ప్రసాద్ , తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రైమరీ కలెక్షన్‌లో ఉన్న లోటుపాట్లు, జివిపి క్లియరెన్స్, అదనపు బిన్ల ఏర్పాటు, చెత్త సేకరణలో ఉన్న క్షేత్ర సమస్యలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ...నగరంలో శానిటేషన్ కార్యక్రమాలు ప్రభావంతంగా చేపట్టేందుకు అధికారులు పర్యవేక్షణ పెంచాలని చెప్పారు. చెత్త సేకరణ వాహనాలపై కూడా పర్యవేక్షణ ఉండాలన్నారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చేసిన పనులను పరిశీలించి, ప్రతిపాదిత నిర్మాణాత్మక పరిష్కారాల ను కమిషనర్ సమీక్షించారు. హైదరాబాద్ నగరంలో స్వచ్ఛత కార్యక్రమాలు మరింత మెరుగుపడాలని, జవాబుదారీతనం, సమయానుకూల చర్యలు, పర్యవేక్షణ పెంచాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

## తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ పేరులో మార్పు లేదు

**: స్పష్టం చేసిన జిహెచ్ఎంసి ప్రాజెక్ట్స్ వింగ్**



హైదరాబాద్, అక్టోబర్ 01 (భారత శక్తి): తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ పేరులో ఎలాంటి మార్పు లేదని జిహెచ్ఎంసి ప్రాజెక్ట్స్ వింగ్ తెలిపింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేసింది. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఇప్పటికే ఈ ఫ్లైఓవర్ కు తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ గా నామకరణం చేస్తూ అమోదం తెలిపింది. ఫ్లై ఓవర్ కు ఒకవైపు బోర్డ్ ఏర్పాటు పనులు పూర్తి అయ్యాయి. రెండోవైపు బోర్డు ఏర్పాటుకు ఫౌండేషన్ క్యూరింగ్ జరుగుతున్నది. క్యూరింగ్ పీరియడ్ పూర్తి కాగానే రెండు రోజుల్లో రెండో సైడ్ బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రాజెక్ట్స్ వింగ్ తెలిపింది. అప్పటి వరకూ ఇప్పటికే ఏర్పాటు చేసిన బోర్డును కప్పి ఉంచామని స్పష్టతనిచ్చింది. రెండోది పూర్తిగా ఇన్స్టాల్ అయిన తర్వాత రెండింటిని కలిపి ఒకేసారి ఓపెన్ చేస్తామని జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్స్ వింగ్ ప్రకటనలో తెలిపింది..

### దుర్గం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే పనిలో

## జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్



హైదరాబాద్, అక్టోబర్ 01 (భారత శక్తి): దుర్గం చెరువును తెలంగాణలో ఒక ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయడానికి చేపట్టిన పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులు, ఎస్ఎన్‌డిపి, లేక్స్ విభాగాలతో రహేజా ఐటీ పార్క్ (హైదరాబాద్) ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులకు సూచించారు. బుధవారం కమిషనర్ ఆర్.వి. కర్ణన్ దుర్గం చెరువును పరిశీలించి, చెరువు ప్రొటెక్షన్ పనులతో పాటు ప్రతిపాదిత అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. చెరువులోకి మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల సమయంలో పరిసర కాలనీలు ముంపు బారిన పడకుండా ఉండేందుకు చెరువు నీటి మట్టాన్ని ఎఫ్.టి.ఎల్ కంటే తక్కువగా ఉంచాలని లేక్స్ విభాగానికి ఆదేశాలు ఇచ్చారు. కమిషనర్ ప్రోత్సాహంతో రహేజా ఐటీ పార్క్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి.ఎస్.ఆర్) పథకం కింద దుర్గం చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులకు నిధులు సమకూర్చడానికి ముందుకొచ్చింది. రెండు సంవత్సరాల పాటు చెరువును సంరక్షించడానికి ఆ సంస్థ బాధ్యత తీసుకుంది. ఇందులో భాగంగా చెరువు చుట్టూ కంచె ఏర్పాటు, నిరంతర శుభ్రపరిచే చర్యలు, నీటిమొక్కలు, తేలియాడే వ్యర్థాలను తొలగించడం, అలాగే వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్, ల్యాండ్‌స్కేపింగ్, పచ్చదనం ఏర్పాటుతో ప్రజలకు సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.వి. కర్ణన్, రహేజా ప్రతినిధులను పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. అలాగే ఎస్ఎన్‌డిపి, లేక్స్ విభాగాలను కూడా లేక్ ప్రొటెక్షన్,అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. క్షేత్ర పరిశీలనలో జిహెచ్ఎంసి కమిషనర్ వెంట హెచ్.ఎమ్.డబ్ల్యూ.ఎస్.ఎస్.బి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావు, జీహెచ్ఎంసీ ఎస్.ఇ. శంకర్ నాయక్, రహేజా గ్రూప్ నుండి బాలరాజు, జీహెచ్ఎంసీ ఇ.ఇ. శిరీష, సీజీఎం (ఎస్‌టిపి) పద్మజ, లేక్స్ విభాగం డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జగదీష్‌లు ఉన్నారు.

# యుద్ధాల్లో సాంకేతికత పెరిగింది.. ఇది ఆందోళన కలిగించే అంశం

ఢిల్లీ, అక్టోబర్ 01 (భారత శక్తి) : ప్రస్తుత యుద్ధాల్లో ఆధునిక సాంకేతికత వినియోగం ఆందోళనకరంగా పెరుగుతోందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. డిఫెన్స్ అకౌంట్స్ డిపార్టుమెంట్ 278వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన ప్రసంగిస్తూ, భారత రక్షణ రంగంలో పరిశోధన, అభివృద్ధిని బలోపేతం చేయడానికి ఒక వినూత్నమైన పర్యావరణ వ్యవస్థను రూపొందించనున్నట్లు వెల్లడించారు. యుద్ధాల్లో ఆధునిక సాంకేతికత వినియోగం పెరగడంపై రాజ్‌నాథ్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. అత్యాధునిక సాంకేతికతలు సంవత్సరాల తరబడి పరిశోధన మరియు అభివృద్ధి ఫలితంగా రూపొందించబడినవని ఆయన పేర్కొన్నారు. మనం కూడా ఈ సాంకేతికతను అందిపుచ్చుకోవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. మన చుట్టూ ఉన్న పరిస్థితులు మారుతున్నాయని, దేశ భద్రతా అవసరాలు కూడా పెరుగుతున్నాయని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ కారణంగానే రక్షణ బడ్జెట్ ప్రతి సంవత్సరం పెరుగుతోందని ఆయన అన్నారు. బడ్జెట్ పెరుగుతున్నందున, దానిని సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యత కూడా రెట్టింపు అవుతుందని ఆయన స్పష్టం చేశారు. సాంకేతిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన నొక్కి చెప్పారు. దేశీయ సాంకేతిక వ్యవస్థను అభివృద్ధి చేయడానికి నిధులను పెంచుతున్నట్లు ఆయన తెలిపారు.

## కరూర్ నగర్ తొక్కిసలాట ఘటన...
# నటుడు విజయ్ కీలక నిర్ణయం

తమిళనాడు, అక్టోబర్ 01 (భారత శక్తి) : తమిళనాడులోని కరూర్ తొక్కిసలాట ఘటన నేపథ్యంలో సినీ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయన చేపట్టిన రాష్ట్రవ్యాప్త పర్యటనలను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్త పర్యటనలను రెండు వారాల పాటు వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఇటీవల విజయ్ కరూర్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో టీవీకే 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటనను విడుదల చేసింది. "తొక్కిసలాట ఘటనలో ఆత్మీయులను కోల్పోయిన బాధ, దుఃఖం నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో వచ్చే రెండు వారాల పాటు బహిరంగ సభ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నాం. పర్యటనలకు సంబంధించిన కొత్త షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని మా అధినేత ఆమోదంతో తెలియజేస్తున్నాం" అని పార్టీ హెడ్ క్వార్టర్స్ సెక్రటరియేట్ ప్రకటించింది.

# 15 నెలల్లో 4,71,574 మందికి ఉద్యోగాలిచ్చాం

అమరావతి, అక్టోబర్ 01 (భారత శక్తి) : ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తమ ప్రభుత్వం ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని, మానవతా దృక్పథంతో సంక్షేమ పాలన అందిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా దత్తి గ్రామంలో నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి నెలా ఒక గ్రామానికి నేరుగా వచ్చి పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్నానని, అందులో భాగంగానే దత్తి గ్రామానికి వచ్చానని చంద్రబాబు తెలిపారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రంలో కేవలం రూ.500 మాత్రమే పింఛను ఇస్తున్నారని, కానీ ఏపీలో మాత్రం తాము అత్యధికంగా అందిస్తున్నామని పోల్చి చెప్పారు. రాష్ట్రంలో ప్రతి వంద మందిలో 13 మందికి పింఛను అందుతోందని, అందులో 59 శాతం మహిళలేనని వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన "సూపర్ సిక్స్" పథకాలను సూపర్ హిట్ చేశామని, అన్ని హామీలను అమలు చేస్తున్నామని ఆయన అన్నారు. మహిళల కష్టాలు తీర్చేందుకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. "స్త్రీ శక్తి" పథకం కింద ఆగస్టు 15న ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కేవలం 45 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 10 కోట్ల మంది మహిళలు వినియోగించుకున్నారని తెలిపారు. డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చింది తెలుగుదేశం ప్రభుత్వమని గుర్తుచేశారు. రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని చంద్రబాబు అన్నారు. ఇప్పటికే రైతు భరోసా కింద ప్రతి రైతుకు రూ.6,000 జమ చేశామని, త్వరలోనే మరో రూ.14,000 అందిస్తామని హామీ ఇచ్చారు. యువతకు ఉద్యోగాలు కల్పించే బాధ్యత తనదని చెబుతూ, ఏడాదిలోనే మెగా డీఎస్సీ నిర్వహించామన్నారు. ఈ 15 నెలల్లో 4,71,574 మందికి ఉద్యోగాలిచ్చామని తెలిపారు. రాష్ట్రానికి ఇప్పటికే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వీటి ద్వారా 9 లక్షల ఉద్యోగాలు వస్తాయని సీఎం ధీమా వ్యక్తం చేశారు.

## డిసెంబర్‌లో భారత్ పర్యటనకు రానున్న
# రష్యా అధ్యక్షుడు పుతిన్

ఢిల్లీ, అక్టోబర్ 01 (భారత శక్తి) : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ డిసెంబర్ నెలలో భారత్ పర్యటనకు రానున్నారు. ప్రతి సంవత్సరం జరిగే శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు డిసెంబర్ 56 తేదీల్లో ఆయన భారత్‌కు విచ్చేయనున్నారు. రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్న కారణంగా భారత్‌పై అమెరికా అధిక సుంకాలు విధిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో పుతిన్ రాక ప్రాధాన్యత సంతరించుకుంది. భారత్‌లో పుతిన్ పర్యటన ఉంటుందని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఈ ఆగస్టులో మాస్కో పర్యటన సందర్భంగా ప్రకటించారు. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ కూడా పర్యటన ఉంటుందని గత వారం ధ్రువీకరించినప్పటికీ, తేదీలను వెల్లడించలేదు. డిసెంబర్ 5, 6 తేదీల్లో పర్యటన ఉంటుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, పుతిన్‌లు గత ఏడాది రెండుసార్లు సమావేశమయ్యారు. జులైలో జరిగిన శిఖరాగ్ర సదస్సులో భాగంగా మోదీ రష్యాకు వెళ్లారు. అక్టోబర్‌లో బ్రిక్స్ సదస్సు సందర్భంగా కజాన్‌లో మరోసారి వీరిద్దరు సమావేశమయ్యారు. ఇటీవల చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులోనూ పుతిన్ మోదీ భేటీ అయ్యారు.

# పాకిస్థాన్‌పై ఆపరేషన్ ఎందుకు ఆపారు?

ఢిల్లీ, అక్టోబర్ 01 (భారత శక్తి) : పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై భారత్ ప్రారంభించిన సైనిక చర్యలను మధ్యలోనే ఎందుకు నిలిపివేశారని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కేంద్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. దేశమంతా ఒక్కతాటిపై నిలిచి, గట్టి సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్న సమయంలో ఆపరేషన్‌ను ఆపివేయడం వెనుక కారణమేంటని ఆయన నిలదీశారు. పహల్గాం దాడి జరిగినప్పుడు మీరే ప్రధాని అయితే ఏం చేసేవారని ఓ విలేకరి ప్రశ్నించగా, ఒవైసీ ఆ ప్రశ్నను సున్నితంగా పక్కనపెట్టారు. "సోదరా, అలాంటి కలలు కనే అలవాటు నాకు లేదు. నేను వాస్తవంలో ఉంటాను. మా లక్ష్యం కేవలం పదవులు చేపట్టడం కాదు" అని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆయన అసలు విషయానికి వస్తూ, పహల్గాం ఘటన తర్వాత పాకిస్థాన్‌కు గట్టి బుద్ధి చెప్పేందుకు భారత్‌కు ఒక మంచి అవకాశం లభించిందని అన్నారు. "అదొక యుద్ధం లాంటి పరిస్థితి. అలాంటి సమయంలో ఆపరేషన్ ఎందుకు ఆగిపోయిందో నాకు నిజంగా అర్థం కావడం లేదు. దేశం మొత్తం గట్టి సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పుడు ఎందుకు వెనక్కి తగ్గారు? ఇప్పుడు పార్లమెంటులో కూర్చుని పీవోకేను స్వాధీనం చేసుకుంటామని మాట్లాడతారు" అంటూ ఆయన కేంద్రంపై విమర్శలు గుప్పించారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న "మినీ స్విట్జర్లాండ్"గా పిలిచే పహల్గాంలోని బైసరన్ లోయలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఒక నేపాల్ జాతీయుడితో సహా 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దాడికి ప్రతీకారంగా భారత్ "ఆపరేషన్ సిందూర్" చేపట్టింది. పాకిస్థాన్, పీవోకేలోని 9 ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసింది. సింధు జలాల ఒప్పందాన్ని నిరవధికంగా నిలిపివేయడంతో పాటు పాక్ జాతీయులను వెనక్కి పంపింది. దీనికి ప్రతిగా పాకిస్థాన్ డ్రోన్లతో భారత పౌర ప్రాంతాలపై దాడులకు దిగింది.




## దసరా కానుకగా చీరలు పంపిణీ చేసిన
# చిలుక మధుర ఉపేందర్ రెడ్డి దంపతులు

ఎల్బీనగర్, అక్టోబర్ 01 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు, దేవాలయాల్లో పనిచేసే మహిళలకు, ఎఎన్ఎంఎస్ లకు దసరా పండుగ కానుకగా చీరలు పంపిణీ చేసిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి దంపతులు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి నిత్యం సమాజ సేవలో నిమగ్నమయ్యే మహిళా కార్మికులకు దసరా పండుగ కానుకగా ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా చీరలు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. దీనిని ఒక బాధ్యతగా తీసుకొని రాబోయే రోజులలో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకుపోతామని చిలుక దంపతులు తెలియజేశారు.

# వ్యక్తిత్వ వికాసంతోనే దేశ నిర్మాణం.. అదే ఆర్ఎస్ఎస్ మార్గం

ఢిల్లీ, అక్టోబర్ 01 (భారత శక్తి) : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అనేది కేవలం ఒక సంస్థ కాదని, వ్యక్తిత్వ వికాసం ద్వారా దేశ నిర్మాణానికి పాటుపడే ఒక మహోన్నత శక్తి అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. 'నేను' అనే అహాన్ని వీడి 'మనం' అనే సామూహిక భావన వైపు నడిపించే స్ఫూర్తిదాయక ప్రయాణమే సంఘ్ అని ఆయన అభివర్ణించారు. ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో బుధవారం జరిగిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్‌కు ఎన్నో అనుబంధ సంస్థలు ఉన్నప్పటికీ, వాటన్నింటి లక్ష్యం ఒకటేనని, అదే 'జాతికే ప్రథమ స్థానం' అని స్పష్టం చేశారు. ఏ రెండు అనుబంధ సంస్థల మధ్య వైరుధ్యాలు ఉండవని ఆయన పేర్కొన్నారు. సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ దేశ నిర్మాణం అనే బలమైన సంకల్పాన్ని తీసుకున్నారని మోదీ గుర్తుచేశారు. ప్రతి పౌరుడిలో దేశం పట్ల బాధ్యత పెరిగినప్పుడే దేశం బలోపేతం అవుతుందని ఆయన విశ్వసించారని తెలిపారు. అందుకే వ్యక్తి వికాసానికి ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. నేటికీ సంఘ్ శాఖల్లో ఈ వ్యక్తిత్వ నిర్మాణ ప్రక్రియ కనిపిస్తుందని, ఇవి శారీరక, మానసిక, సామాజిక ఎదుగుదలకు దోహదపడే పవిత్ర వేదికలని ప్రధాని అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో డాక్టర్ హెడ్గేవార్ సహా ఎందరో సంఘ్ కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారని మోదీ గుర్తు చేశారు. స్వాతంత్ర్యానంతరం కూడా సంఘ్‌పై అనేక దాడులు, కుట్రలు జరిగాయని ఆయన అన్నారు. సంస్థను అణచివేసేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయని, కానీ వాటన్నింటినీ సంఘ్ ఎదుర్కొని నిలబడిందని తెలిపారు. ఎన్ని కుట్రలు పన్నినా స్వయంసేవకులు ఎన్నడూ ద్వేషానికి ప్రాధాన్యత ఇవ్వలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు.



## కనకదుర్గ అమ్మవారి ప్రత్యేక పూజలో పాల్గొన్న
# ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, అక్టోబర్ 01 (భారత శక్తి): దేవీ శరన్నవరాత్రి కార్యక్రమాల్లో భాగంగా దిల్ సుఖ్ నగర్ శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కనకదుర్గ అమ్మవారి గుడి ఫౌండర్ చైర్మన్ రాంచందర్, చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు మహేష్ గౌడ్,మధు సాగర్, కిరణ్, రామకృష్ణ, కిషన్, సంతోష్, శివరాం,ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ జయ దుర్గాదేవి శరన్నవరాత్రులు

* భక్తుల కోలాహలంతో సందడిగా సాగిన ఉత్సవాలు..
* మహిమగల తల్లిగా శ్రీ జయ దుర్గాదేవి ఆలయం ప్రసిద్ధి..
* నగరంలోని సైదాబాద్ ప్రాంతంలో వెలసిన అమ్మవారు..
* జీవనజ్యోతి సంఘం ఆధ్వర్యంలో నిత్యా కైంకర్యాలు..
* ఆలయ వ్యవస్థాపకులు శ్రీ, శ్రీమతి కోరుడు సుజాతా అమరేశ్వర్ ఆధ్వర్యంలో వేడుకలు..

**హైదరాబాద్ :భారతశక్తి అమ్మా అని పిలిచినా, ఆర్తిగా పూజించినా ఆదుకునే అమ్మవారు దుర్గాదేవి.. అలాంటి తల్లిని నవరాత్రులు పూజించి వేడుకుంటే కోరిన కోర్కెలు అన్నీ తీరతాయన్నది వాస్తవం.. ఈ క్రమంలోనే హైదరాబాద్ నగరంలో సైదాబాద్ లో వెలసిన శ్రీ జయ దుర్గాదేవి భక్తుల పూజలు అందుకుంటూ వారిని ఆదుకుంటూ కొలువైవుంది.. ఈ శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి..**







హైదరాబాద్, అక్టోబర్ 01 (భారతశక్తి) : శరన్నవరాత్రులను పురస్కరించుకొని సైదాబాద్ లోని శ్రీ జయ దుర్గా దేవి అమ్మవారి దేవాలయం నందు జీవనజ్యోతి సంఘం ఆధ్వర్యంలో.. ఆలయ వ్యవస్థాపకులు శ్రీ, శ్రీమతి కోరాడు సుజాతా అమరేశ్వర్ నేతృత్వంలో శరన్నవరాత్రుల ఉత్సవాలు భక్తిపూర్వకంగా వైభవంగా జరిగాయి.. ఈ పుణ్యదినాలను పురస్కరించుకొని అమ్మవారు నవ అవతారాలను ధరించి భక్తులకు దర్శనం ఇచ్చారు.. దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి.. ఈ తొమ్మిది రోజులు ప్రతినిత్యం హోమం, పూజా కృతువులు చక్కగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించబడి ఈ రోజు పెద్ద ఎత్తున అమ్మవారి ఊరేగింపు ఘట్టాల సమూహంతో ప్రజలందరి భక్తితో కూడిన పూజలు స్వీకరిస్తూ అమ్మవారు వీధి వీధి తిరిగి మరల ఆలయానికి చేరుకుని పూజలు అందుకోవడం జరిగింది.. ఈ కార్యక్రమానికి విచ్చేసిన స్థానిక సైదాబాద్ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని, వారి జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని మనసా, వాచా, కర్మణా ఆలయ వ్యవస్థాపకులు శ్రీ, శ్రీమతి కోరాడు సుజాతా అమరేశ్వర్ కోరుకున్నారు..

# ఎవడబ్బ సొమ్మని వాడుతున్నారు..?

**జరిగిన ఒక యదార్థ సంఘటన ఇక్కడ చెప్పుకోవాల్సి వస్తోంది.. ఒక రోడ్ మీద ఒక పెద్దాయన కళ్ళుతిరిగి స్పృహతప్పి పడిపోతాడు.. అప్పుడే అటుగా ఒక ప్రభుత్వాధికారి ప్రభుత్వ వాహనంలో వస్తున్నాడు.. ఒక యువకుడు ఆ వాహనాన్ని ఆపి విషయం చెప్పి హాస్పిటల్ కి ఆ వ్యక్తిని తీసుకెళ్లామని చెప్పాడు.. కానీ ఆ అధికారి సీరియస్ అవుతూ ఇది ఆటో అనుకున్నారా..? లేకపోతే మీ పర్సనల్ వాహనం అనుకున్నారా..? ఇది ప్రభుత్వ వాహనం ఇది మేము మాత్రమే ఉపయోగించాలి.. ఎదో ఒక ఆటో మాట్లాడుకుని వెళ్ళండి.. లేకపోతే 108 కి ఫోన్ చెయ్యండి.. అంటూ స్పీడుగా వెళ్ళిపోయాడు.. అసలు విషయం ఏమిటంటే ఆ వాహనంలో ఆ అధికారి తన ఫామిలీ మెంబర్స్ ని తీసుకుని వెళ్తున్నాడు.. తన వ్యక్తిగత అవసరాలకోసం వాడుకుంటున్నాడు.. ఇది ఎవరికీ తెలియదు.. ఇలాంటి దుర్మార్గులు ఎందరో ఉన్నారు.. ఇలాంటి వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి.. అలాగే కొన్ని చోట్ల ప్రభుత్వ కార్యాలయాలను తమ వ్యక్తిగత అవసరాలకు వాడుకునే నికృష్టులు కూడా ఉన్నారు..ప్రభుత్వ కార్యాలయాల్లో పేకాట ఆడుతూ, మందు పార్టీలు చేసుకుంటూ కెమెరాకు దొరికిపోయిన ఉద్దండుల చరిత్రలు ఎన్నెన్నో చూశాం.. ప్రభుత్వ వాహనం అంటే ప్రజల వాహనమే కదా..? పర్సనల్ గా కావాలని అడగడం లేదు కదా..? ప్రమాదకర పరిస్థితుల్లో సహాయం అడిగితే ఇంత పొగరు ఎందుకు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.. ఈ వైఖరి మారాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..**





**(స్పెషల్ కరస్పాండెంట్)**

హైదరాబాద్, అక్టోబర్ 01 (భారత శక్తి) : ప్రభుత్వ ఆస్థులు, అంటే ప్రజల ఆస్థులు అని చెప్పుకోవచ్చు.. ఇందులో వాహనాలు, భవనాలు, కార్యాలయ సామగ్రి, ఇంధనం, పబ్లిక్ ఫండ్స్, టెలిఫోన్లు, కంప్యూటర్లు వంటివి ఇవన్నీ ప్రజల పన్నుల డబ్బుతో కొనుగోలు చేసినవే. ఇవి ప్రజల సేవ కోసం మాత్రమే ఉపయోగించాలి. కానీ వాస్తవ పరిస్థితుల్లో ఈ ఆస్తులను చాలా మంది అధికారులు, ఉద్యోగులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగించడం పెద్ద సమస్యగా మారిందని చెప్పుకోవచ్చు..

*** ఎక్కడ ఎక్కువగా దుర్వినియోగం జరుగుతోంది..? :**

ప్రస్తుతం దేశవ్యాప్తంగా దాదాపు అన్ని విభాగాల్లో ఈ సమస్య కనిపిస్తోంది. మరీ ముఖ్యంగా..

**పోలీస్ శాఖ :**

ప్రభుత్వ జీపులు, బోలెరోలు, ఇన్నోవాలు, బైకులు వ్యక్తిగత పనుల కోసం వాడుతున్నారు. ముఖ్యంగా అధికారులు తమ కుటుంబసభ్యులను, పిల్లలను స్కూల్ కి తీసుకెళ్లడానికి, షాపింగ్ కి వెళ్ళడానికి ఉపయోగిస్తున్నారు.

**మున్సిపల్ / పంచాయతీ శాఖ :**

కార్యాలయ బొలెరో వాహనాలను ప్రైవేట్ కార్యక్రమాలకు ఉపయోగించడం చేస్తున్నారు.. ప్రభుత్వ ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్లు సొంత వ్యవసాయ పనులకు వాడుతున్నారు... మిగులు డీజిల్ ను వారి సొంత వాహనాలకు ఉపయోస్తున్నారు.

**రెవెన్యూ, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్ శాఖలు :**

సైట్ ఇన్స్పెక్షన్ పేరిట వాహనాలను వ్యక్తిగత ట్రిప్ లకు వినియోగిస్తున్నారు.. ప్రభుత్వ డీజిల్, పెట్రోల్ ను సొంత వాహనాల్లో వాడుకోవడం చేస్తున్నారు..

ప్రముఖ ప్రజా ప్రతినిధులు, అధికారులైతే మరీ అవినీతికి పాల్పడుతున్నారు.. ప్రభుత్వ ఇళ్లను, గెస్ట్ హౌస్ లను తమ బంధువుల వివాహాలు, పార్టీలు నిర్వహించేందుకు విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారు..

*** అసలు ఎందుకు ఈ దుర్వినియోగం జరుగుతోంది..?**

అధికారులపై కఠినమైన పర్యవేక్షణ లేకపోవడం.. శిక్షలు, డిసిప్లినరీ చర్యలు లేకుండా వదిలేయడం.. రాజకీయ రక్షణ మెండుగా ఉండటం.. "వాడినా ఎవరూ పట్టించుకోరు" అనే పొగరు, నమ్మకం ఉండటం.. ప్రభుత్వ ఆస్తులు తమ సొంతం అనుకోవడం.. వాటిపై తమకు హక్కు ఉందని భావించడం..

*** విశ్లేషకులు సూచిస్తున్న నివారణ మార్గాలు, పరిష్కారాలు :**

జీపీఎస్ ట్రాకింగ్, డిజిటల్ మానిటరింగ్ ఖచ్చితంగా చేపట్టాలి.. అన్ని ప్రభుత్వ వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసి, వాటి ప్రయాణ రికార్డులను రియల్ టైమ్ లో పర్యవేక్షించాలి. స్పష్టమైన వినియోగ నిబంధనలు ఏర్పాటు చేయాలి..

ప్రతి శాఖ స్పష్టమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసుడూర్ అంటే ఒక ఖచ్చితమైన ప్రణాళికా బద్ధమైన ఆపరేటింగ్ సిస్టం జారీ చేయాలి. ఎవరు ఎప్పుడు, ఏ అవసరానికి వాహనాలు, కార్యాలయాలు వాడాలో రికార్డు చేసి ఉంచాలి..

**ప్రజా ఫిర్యాదు వ్యవస్థ పటిష్టం చేయాలి :**

సాధారణ పౌరులు ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగంపై ఆన్లైన్ లేదా టోల్ ఫ్రీ ద్వారా ఫిర్యాదు చేయగలిగే విధానం ఏర్పాటు చేయాలి.

దీనితో బాటు అకౌంటబిలిటీ, ఆడిట్ నిర్వహించాలి.. ప్రతి సంవత్సరం ప్రభుత్వ ఆస్తుల వినియోగంపై స్వతంత్ర ఆడిట్ చేసి, నివేదికను పబ్లిక్ డొమైన్ లో ఉంచాలి..

**కఠినమైన శిక్షలు అమలు చేయాలి :**

ఒకవేళ వ్యక్తిగత ఉపయోగం నిరూపితమైతే.. సస్పెన్షన్, వేతన కోత, క్రమశిక్షణా చర్యలు, కేసులు నమోదు చేయాలి.. కఠిన శిక్షలు అమలు చేయాలి..

**సివిల్ సొసైటీ పర్యవేక్షణ :**

ఇక ఎన్.జీ.ఓ.లు, మీడియా, విజిలెన్స్ విభాగం వంటి సంస్థలు ఈ అంశాన్ని క్రమంగా పర్యవేక్షిస్తే అధికారుల దుర్వినియోగం తగ్గుతుంది.

*** ఇక చివరిగా చెప్పుకోవాల్సింది ఏమిటంటే :**

ప్రభుత్వ ఆస్థి అంటే అది ప్రభుత్వానిది కాదు.. ప్రజలది. దాన్ని వృథా చేయడం, దుర్వినియోగం చేయడం అంటే పన్ను చెల్లించే ప్రతి పౌరుడి డబ్బును దోచుకోవడం లాంటిది. పౌరులు కూడా జాగ్రత్తగా ఉండి, ఇలాంటి దుర్వినియోగం గమనించినప్పుడు వెంటనే ఫిర్యాదు చేయడం తమ బాధ్యతగా భావించాలి. ఈ దిశగా ప్రజలను చైతన్యం చేయడానికి ప్రణాళిక రూపొందిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరుకుంటున్నాం.. ప్రజల ఆస్థులను కాపాడుకుందాం.. అవినీతి అధికారుల భారతం పడదాం..







## బతుకమ్మ చీరలు ఎక్కడ..?

**– మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

చేవెళ్ల, అక్టోబర్ 01 (భారత శక్తి): చేవెళ్ల నియోజకవర్గం చేవెళ్ల మండలం ముడిమ్యాల్ వ్యవసాయ క్షేత్రంలో బిఆర్ఎస్ చేవెళ్ల మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "బతుకమ్మ పండుగ వస్తే కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటి ఆడపడుచుకు చీరలు అందేవి. కానీ ఈ రోజున్న రేవంత్ సర్కార్ మాత్రం 'ఆ చీర ఎవరు కట్టుకుంటారు దేనికి పనికొస్తుంది అని హేళన చేశారు.. మరి... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఆడపడుచుకు రెండేసి చీరలు ఇస్తామని వాగ్దానం చేసి ఎంగిలిపు బతుకమ్మ, సద్దుల బతుకమ్మలకైనా ఆ చీరలు ఎక్కడ..? ప్రతి ఆడపడుచుకి నాలుగు చీరలు కాంగ్రెస్ పార్టీ బాకీగా పెట్టిందని గుర్తుంచుకోవాలి"అని అన్నారు. అలాగే, "ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటినీ నెరవేర్చలేని అసమర్థ రేవంత్ సర్కార్ ఇప్పుడు కొత్త రాగం పాడుతున్నారు. ప్రతి మహిళను కోటీశ్వరురాలు చేస్తానంటున్నారు. కానీ ఇప్పటివరకు ఎంతమంది మహిళలు కోటీశ్వరులయ్యారు? ఎంతమందిని కోటీశ్వరాళ్లను చేశారు?" అని ప్రశ్నించారు. అబద్ధాల హామీలిచ్చి గద్దెనెక్కిన రేవంత్ సర్కార్ స్థానిక సంస్థలు ఎన్నికల్లో ప్రజల్ని మభ్యపెట్టి మోసం చేసి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారు కాబట్టి కాంగ్రెస్ చేస్తున్న మోసాలను గడప గడపకు వెళ్లి బహిర్గతం చేయాలని, 'కాంగ్రెస్ బాకీ కార్డు' ద్వారా ప్రజలకు బాకీలు వివరించి చెప్పాలని రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో కచ్చితంగా విజయ డంకా మోగించబోతున్నామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మన న్యాయస్థానాలలో
## గౌరవ, సమానత్వానికి సంక్షోభం ఏర్పడుతోంది..




**(స్పెషల్ కరస్పాండెంట్)**

హైదరాబాద్, అక్టోబర్ 01 (భారత శక్తి) : న్యాయవ్యవస్థ అనేది న్యాయ దేవత కొలువుండే ఆలయం.. ఇక్కడ సమానత్వం, న్యాయం, రాజ్యాంగ విలువలు కాపాడబడతాయి.. అయితే, ఇటీవలి కాలంలో మన కోర్ట్ రూమ్ లలో ఒక కలవరపరిచే ధోరణి కనిపిస్తోంది.. న్యాయవ్యవస్థకు ప్రాణం లాంటి అడ్వకేట్లు అవమానానికి, నిర్లక్ష్యానికి, అసమాన వ్యవహారానికి గురవుతున్నారు. సాక్షాత్తూ న్యాయమూర్తులే న్యాయస్థానాల్లో అడ్వకేట్లను తక్కువ చేసి మాట్లాడితే, న్యాయవృత్తికి గౌరవం ఎక్కడ మిగులుతుంది? కోర్టులు నిజంగా న్యాయం చెప్పే సంస్థలా..? లేక అధికార ప్రదర్శన వేదికలా మారుతున్నాయా?

**కోర్టు ప్రక్రియల్లో ద్వంద్వ వైఖరి**

ప్రభుత్వ న్యాయవాదులు వాయిదాలు లేదా సమయం కోరితే అవి సులభంగా మంజూరవుతున్నాయి. కానీ బాధితుల తరపున లేదా ప్రైవేట్ పార్టీ తరపున న్యాయవాదులు సమయం కోరితే, వారి అభ్యర్థనలను కఠినంగా తిరస్కరిస్తున్నారు. ఇది ఒక ప్రాథమిక ప్రశ్నను లేవనెత్తుతుంది.. సమానత్వం ఎక్కడ ఉంది? రాజ్యాంగం ప్రతి పౌరుడికి హామీ ఇచ్చిన సమతుల్యం ఎక్కడ ఉంది? ఇలాంటి ద్వంద్వ వైఖరి అడ్వకేట్లను మాత్రమే కాదు, సాధారణ పౌరుల న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని సైతం సడలింపజేస్తుంది.. అడ్వకేట్లకే కోర్ట్ లో న్యాయం దొరకకపోతే, సామాన్య ప్రజలకు న్యాయం లభిస్తుందని ఎలా ఆశించగలం?

**రాజ్యాంగానికి అవమానం**

మన రాజ్యాంగం సమానత్వాన్ని, సమాన రక్షణను న్యాయానికి మూలస్థంభాలుగా పేర్కొంది. కానీ నేటి న్యాయవాతావరణంలో ఈ విలువలు కనుమరుగైపోతున్నాయి. రాజ్యాంగ ఆత్మను కాపాడటానికి బదులుగా, కొంతమంది కోర్టు ఆచరణలు అసమానత్వం, ఎటు తేల్చుకోలేని వైఖరిని బలపరుస్తున్నాయి. ఈ పరిస్థితి ఒక అసౌకర్యకరమైన ప్రశ్నను లేవనెత్తుతుంది: తప్పు కోర్టుల పని విధానంలో ఉందా..? లేక జడ్జిల ప్రవర్తనలో ఉందా? జడ్జిల బాధ్యతను ఎవరు నిర్ధారిస్తారు? మార్పు కోసం సరిదిద్దే చర్యలు తీసుకోకపోతే, ఈ వ్యవస్థ ఎప్పుడైనా మారుతుందా?

**ముందుకు సాగే దారి :**

నిజంగా మన న్యాయవ్యవస్థ సమానత్వం, రాజ్యాంగ విలువల ప్రతిరూపంగా ఉండాలంటే, కొన్ని కీలక సంస్కరణలు అవసరం:

1. బాధ్యతా పద్ధతులు : అడ్వకేట్లు అన్యాయానికి గురైన సందర్భాల్లో జడ్జిల ప్రవర్తనపై పారదర్శక సమీక్ష ఉండాలి.
2. రెండు వైపులకూ సమాన అవకాశాలు : అది ప్రభుత్వం కావచ్చు లేదా బాధితుడి తరపు న్యాయవాది కావచ్చు, కోర్టులు ఒకే ప్రమాణాన్ని అనుసరించాలి.
3. బార్ కౌన్సిల్ బలోపేతం : అడ్వకేట్ల గౌరవాన్నికాపాడటంలో, అవమానం లేదా అన్యాయంపై ఫిర్యాదులను పరిష్కరించటంలో బార్ కౌన్సిల్ చురుకుగా ఉండాలి.
4. వ్యవస్థాపక సంస్కరణలు : ప్రతి కోర్ట్ రూమ్ లో గౌరవం, సమానత్వం, వృత్తిపరమైన మర్యాదను నిర్ధారించే విధంగా విధాన నియమాలను నవీకరించాలి.
5. ప్రజా అవగాహన, చర్చలు : పౌర సమాజం, మీడియా, వృత్తి సంఘాలు ఈ అంశాలపై నిరంతరం చర్చలు జరిపి సంస్కరణల కోసం ఒత్తిడి తీసుకురావాలి.





**డాక్టర్ బాల,**
**సైకలాజిస్ట్ అండ్ సోషియో పొలిటికల్ ఇంజనీర్..**
**సెల్ : 8801505922..**

ముగింపు :

న్యాయవ్యవస్థ తన శక్తి ద్వారా కాకుండా ప్రజల విశ్వాసం, నమ్మకంతోనే తన నైతికతను నిలబెడుతుంది. కోర్టులు తమ ముందు నిలబడ్డ అడ్వకేట్లను గౌరవించకపోతే, న్యాయవ్యవస్థ విశ్వసనీయతే ప్రశ్నార్థకమవుతుంది. ఇప్పుడు ఈ వాస్తవాలను ఎదుర్కోవాల్సిన సమయం వచ్చింది. కోర్టులు గుర్తుంచుకోవలసింది ఒక్కటే.. అవి అధికారం చూపేందుకు లేవు, న్యాయం, సమానత్వం, రాజ్యాంగ పరిపాలనను నిలబెట్టేందుకు ఉన్నవి. అప్పుడే మన రాజ్యాంగం ఆత్మ నిజంగా జీవిస్తుంది. ఇది నా హృదయపు లోతుల నుండి వచ్చిన బాధ.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.